# The
# Andhra Pradesh Legislative Assembly Debates

*[Part II - Proceedings other than Questions and Answers]*

OFFICIAL REPORT

---

## *40th Day of the Sixth Session of the Andhra Pradesh Legislative Assembly*

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

**Tuesday the 11th March, 1958**

The House met at Half Past Eight of the Clock

*[Mr. Speaker in the Chair]*

QUESTIONS AND ANSWERS

*(See Part I)*

PAPERS LAID ON THE TABLE OF THE HOUSE

*Orders Issued: In regard to recovery of Taccavi & Excise Arrears*

*The Minister for Revenue (Sri K. Venkata Rao)*: I beg to lay on the Table of the House a copy in each of the following Orders issued in regard to the recovey of Taccavi and Excise arrears.

| | | |
|---|---|---|
| (1) | Memo No. 146815-T/57-1 Rev. dated 30-12-1957. | Recovery of Excise and Taccavi arrears-Attachment of sale and properties - - Instructions - Issued. |
| (2) | G. O. Ms. No. 194, Revenue dated 2-2-1958. | Excise arrears - Written off of arrears relating to compounding fees etc. - Orders issued. |
| (3) | Memo No. 13628-T/58-1 Revenue dated 4-2-58. | Excise - Collection of Excise arrears-Attachment of property Confirmation of Sale - Issue of certain orders. |
| (4) | G. O. Ms. No. 235 Revenue dated 8-2-1958. | Advances - Loans and Advances - Taccavi loans in Telangana - Recovery of |

*Mr. Speaker*: Papers laid on the table of the House.

## *Election of members to the Committee on Public Accounts.*

*The Chief Minister (Sri N. Sanjeeva Reddy)*: I beg to move:

" That with reference to rule 165 of the Rules of Procedure and Conduct of Business of the Andhra Legislative Assembly made under clause (I) of the Article 208 of the Constitution of India, this Assembly do proceed on a date to be fixed by the Speaker to elect fourteen members to be members of the Committee on Public Accounts for the financial year 1958–59."

*Mr. Speaker*: Motion moved:

Public Accounts committee సభ్యులను "proportionate representation by means of sigle transferble vote" పద్ధతిన elect చేయడానికి నిశ్చయించాను 18_3_1958 మధ్యాహ్నం 1 గంట వరకు nomination దాఖలు చేయడానికి తేది నిర్ణయించాను. అవసరమైన సభ్యులకంటే ఎక్కువ nominations దాఖలైన తరువాత election కు యింకో తేది నిర్ణయిస్తాను.

## *Election of m·mbers to the Committee on Estimates.*

*Sri N. Sanjeeva Reddy*: I beg to move:

" That with reference to rule 185 of the Rule of Procedure and Conduct of Business of the Andhra Legislative Assembly made under clause (1) of Article 208 of the Constitution of India, this Assembly do proceed on a date to be fixed by the Speaker to elect fourteen members, to be members of the Committee on Estimates for the financial year 1958–59."

*Mr. Speaker*: Motion moved. Estimate Committee కి కూడా nominationవేయడానికి 18_3_58 మధ్యాహ్నం 1 గంట వరకు time యిచ్చాను. కావలసిన సభ్యులకంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే election కు యింకో తేదీ నిర్ణయిస్తాను.

## *Election of the members to the Committee on Privileges.*

*Sri N. Sanjeeva Reddy*: I beg to move:

" That with referenee to rule 172 of the Rules of Procedure and Conduct of Business of the Andhra Legislative Assembly made under clause (1) of Article 208 of the Constitution of India, this Assembly do proceed on a date to be fixed by the Speaker to elect ten members to be members of the Committee on Privileges for the financial year 1958–59"

*Mr. Speaker*: Motion moved

Previleges Committee కి సభ్యులను proportionate representation by means of sigle transferble vote పద్ధతిన elect చేయడానికి నిశ్చయించాను. 18–3–58వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు nomination దాఖలు చేయడానికి తేదీ నిర్ణయించాను అవసరమైన సభ్యుల సంఖ్యకంటే ఎక్కువ nominations దాఖలైతే election కు తరువాత ఇంకో తేదీ నిర్ణయిస్తాను.

## BUDGET- DEMANDS FOR GRANTS

శ్రీమతి వై. సీతాకుమారి (భాన్సువడ) :- అధ్యక్షా! రెవిన్యూమంత్రి గారు ప్రవేశపెట్టిన demands ను బలపరుస్తూ కొన్ని సూచనలు చేస్తున్నాను. లాండ్ రెవిన్యూపద్దు మనదేశంలో చాలా ముఖ్యమైనది. ప్రతి శాసన సభ్యునకు సంబంధించిన సమస్యలు దానిలో ఉన్నాయి. రెవిన్యూమంత్రిగారు తెలంగాణా జిల్లాల్లో పర్యటన చేసినప్పుడు కొన్ని సమస్యలు వారి దృష్టికి తేబడ్డాయి. ఆంధ్రలో లేని కొన్ని ప్రత్యేక సమస్యలు ఇక్కడ ఉన్నాయి. వాటిని మంత్రిగారు అర్థం చేసుకోవాలి. వచ్చే సమావేశంలో భూసంస్కరణల బిల్లును ప్రవేశ పెడుతున్నందుకు వారికి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. మా నిజామాబాద్ జిల్లాలో అనేకమైన సమస్యలున్నాయి. అక్కడ నిజాంసాగర్ ప్రాజెక్టువుంది. ఆ చెరువునీరు సకాలంలో రైతులకు అందక పంటలు దెబ్బతిని పన్నులు చెల్లించలేని స్థితిలోవున్నారు. ఇంకా అక్కడి ప్రజలు తమతమ కష్టాలను మంత్రిగారికి చెప్పుకొన్నారు. మంత్రిగారు ఆసమస్యలను దయతో విచారించి ప్రజలకు సహాయంచేయమని కోరుతున్నాను. ప్రత్యేకంగా మా జిల్లాలో "ఖాస్రాభూముల" సమస్యవుంది. పాతకాలంలో కొందరు తమకు కావలసిన భూములకంటే చాలా ఎక్కువ సేకరించి, అప్పుడు వాటినిదున్నకుండా ఏదో కొద్ది ధరలకు అమ్మేశారు. ఇప్పుడు వాటికి మంచిధరలు ఉండటంచూసి, తిరిగి వాటిపై తమకు హక్కుకావాలని దౌర్జన్యాలు చేస్తున్నారు. ఈ విషయంలో మంత్రిగారు శ్రద్ధతీసుకొని సక్రమమైన పద్ధతిలో బీదప్రజలకు న్యాయం జరుగునట్లు త్వరలోనే తగుచర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నాను.

గ్రామోద్యోగుల సంగతి అనేక చిక్కులతో కూడుకున్న సమస్య. మాలీ పటేలు, నీరడీలు జీతాలు సక్రమంగా అందవు. వారి బాధ్యతలుకూడా సక్రమంగా విభజించబడలేదు ఆంధ్రలోను, తెలంగాణాలోను ఈ గ్రామోద్యోగులకు సంబంధించిన ఉత్తమ పద్ధతులేమున్నాయో వాటిని ప్రవేశపెట్టి, వారికి సరిగా జీతాలు ముట్టునట్లుగాను, వారి బాధ్యతలు సక్రమంగా విభజింపబడి వారిపై సరైనపరిశీలన వుండేఏర్పాట్లు చెయ్యాలి. గ్రామప్రజల సమస్యల పరిష్కారానికి వారికనీస అవసరాల

కోసం, వారి సుఖంకోసం మంత్రిగారు గట్టిగా పట్టుబట్టాలని కోరుతున్నాను. మనకు వచ్చేఆదాయం గ్రామాలనుంచి ఎక్కువగా వస్తోంది. వారి కనీసఅవసరాలను కూడా మనం ఈ నాడు తీర్చలేదు. దీనిని యింక నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు. మనకు ఈ నగరంలోని సౌకర్యాలను కొన్నింటిని తగ్గించుకొని అయినా గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యసౌకర్యాలను కలుగచేయాలి. ఇవి చేయకపోతే మనం మళ్ళీ ప్రజలదగ్గరకు పోలేము. వారినుంచి మనం ఏమీ ఆశించలేము. వారి సమస్యల పరిష్కారానికి మంత్రిగారు సానుభూతితో పూనుకొని, మళ్ళీ మనం ఎన్నికలకు వారిదగ్గరకు వెళ్ళేలోపలే, వారి పరిస్థితి బాగుపడునట్లు చేయమని కోరుతున్నాను. తెలంగాణా ఆంధ్రకన్న వెనుకబడివుంది. ఏకవర్ష ప్రణాళిక వేసికొని మంత్రిగారు తెలంగాణా సమస్యలను పరిష్కరించి, యీ ప్రాంతాన్నికూడా ఆంధ్రస్థాయికి తీసుకొని రావలసినదిగా కోరుతూ, వారుప్రవేశపెట్టిన Demands ను బలపరుస్తున్నాను.

*శ్రీమతి కె. కనకరత్నమ్మ (వర్ధన్నపేట):- అధ్యక్షా! "రెవెన్యూ" మంత్రిగారు ప్రవేశపెట్టిన డిమాండును బలపరుస్తున్నాను. ఈ విషయంలో వారు, కొన్ని సూచనలను విమర్శా పూర్వకంగా చెయ్యమని సెలవిచ్చారు.

ఇదివరకు హైదాబాదు ప్రభుత్వంలో వుండే అవక తవకలు ఆంధ్రప్రదేశ్ అయిన తరువాత చక్కగా పరిష్కరించబడుతవని ఆశించాము. కాని, జరుగుతున్న విషయాలనుబట్టి చూస్తే ఆ ఆశ అడుగడుగునకు దిగజారుతున్నట్లుగా కనిపిస్తున్నది.

తాలూకాలలో Revenue Officers చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను, మంత్రిగారి దృష్టికి తీసుకురావాలని వుద్దేశిస్తున్నాను. రెవెన్యూ మంత్రిగారి orders; రెవెన్యూబోర్డు orders, సక్రమంగా అమలు కానప్పుడు ఈ రెవెన్యూ డిపార్టుమెంటు ఎవరికొరకు పనిచేస్తున్నది? అని తమ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను. ఈ సంవత్సరం Takkavi Loans వసూలు చేసే సందర్భంలో ముఖ్యంగా బీదవారు, వారి యొక్క భార్యల పుస్తెలను అమ్ముకొని ఎంతో కష్టంమీద అప్పులు చెల్లించారు. కొన్ని విషయాలలో, డబ్బు చెల్లించనందుకు, కొంతమంది పొలాలుకూడ జప్తు చేయబడ్డాయి. ఒకవైపు ప్రభుత్వం "జప్తు చెయ్యవద్దు" అన్నా అక్కడి తహశీల్దార్ తమకు ఇష్టమైనవారిని వదలిపెట్టి ఇచ్చుకోలేని వారి పొలాలను జప్తుచేసి, వేలము వేసి "కబ్జా"కూడ ఇచ్చిన సంఘటనలు ఉన్నాయి. రెవిన్యూ బోర్డు Stay order ను చేతిలో పెట్టుకొనికూడ, ఆదేరోజున ఒక పొలము అమ్మి కబ్జా ఇవ్వబడింది. కొన్ని విషయాలలో భూమిపై హక్కు ఇవ్వకముందే వేలం పాడినవారు ఆ పొలాన్ని స్వాధీనం చేసుకొని, సాగు చేసుకోవడంకూడ జరిగింది. అది అంతా తహశీల్దార్ చూసుకుంటూ ఊరుకున్నాడు. మొత్తం తాలూకాకు పెద్ద అయిన "తహసిల్దారు" యీ విధంగా చెయ్యడం చాలా అన్యాయము అని ప్రభుత్వదృష్టికి తీసుకువస్తున్నాను.

ఈ విషయమై ప్రజలలో ఆందోళన చెలరేగినప్పుడు, కనీసం 6 కిస్తీలలోపల చెల్లించాలని, స్వాధీనం కాబడ్డ భూమి యజమానులు Board కి appeal చేస్తే Board వారు ఎవరిభూమి వారికి అప్పచెప్పాలని orders issue చేసినప్పటికీ, అక్కడి తహసీలుదారు వాటిని ధిక్కరిస్తున్నారు. వేలంపాడిన ఆసామి, ఆ స్వాధీనంకాబడ్డ భూమిలో ఏదో కొద్దిగా వరిపంట పండించారు. కాబట్టి, ఆ పరిస్థితులలో యేమి చెయ్యాలని Board ను తిరిగి అడుగుతున్నాం. వీటినిబట్టి చూస్తే ఈ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీదవారి కొరకుగాక కేవలం గొప్పవారికొరకే అవతరించిందని, గ్రామాల లో నిరుత్సాహము ప్రబలుతున్నది. దీని నిర్మూలనకు పరిపాలనలో మంచి మార్పు తీసుకురావాలి.

అంతేకాకుండా, minor irrigation విషయంలో, మరమత్తు చెయ్య వలసిన చిన్న చిన్న చెరువులు చాలా ఉన్నాయి. వాటిని మరమ్మత్తుచేస్తే 30 ఎక రాల నుంచి, 100, 150 ఎకరాల వరకూ, సాగు చేసే అవకాశం ఏర్పడుతుంది గండ్లుపడ్డవాటికి, కనీసం మన్నువేసి కప్పించినా కూడ పంట పండించడానికి వీలు అవుతుంది.

ఇక ఈ "నీరడీలు" "సిందీలు" గ్రామఉద్యోగాలలో ఎక్కువగా కష్టపడు తున్నారు. ప్రభుత్వంద్వారా, వారికి మనిషికి ఒక ఎకరం బంజరుభూమి ఇవ్వ బడింది. వాళ్ళకు, సంవత్సరానికి, 30 లేక 36 రూపాయలవరకు, మంజూరు అయి వచ్చినప్పుడు, దారిలో మొక్కుబళ్ళు అన్నీ పోగా వారికి 15 రూపాయలుకూడ మిగలదు. కావున వారిజీతాల గురించి తగిన శ్రద్ధ తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

భూసంస్కరణలు తీసుకరావాలనే అభిప్రాయం వెలిబుచ్చుతున్నప్పుడు, గత 7,8 సంవత్సరాలుగా పండించుకొంటూ వస్తున్న రైతులవద్దనుంచి, పట్టా వారిపేరు మీద లేనందున, ఆ భూమిని వాళ్ళవద్దనుంచి తీసుకోవద్దని మనవి చేస్తున్నాను. కావున ముందువారి పేరుమీద పట్టా ఇచ్చినట్లైతే వారికి తాత్కాలికమైన ఫలితంగా ఉంటుంది. ఇప్పుడు ఆ పట్టాలు లేని కారణం చేత వారికి ఏ విధమైన సహాయము ప్రభుత్వంనుంచి కలుగడము లేదు. Police Action అయిన తరువాత ఎన్నో పొలాలు బంజర్లుగా ఉన్నచోట్ల అక్కడి బీదవారికి పంచబడ్డాయి. పట్టాలు మాత్రం వారికి లేవు. Settlement officers అప్పుడప్పుడు వచ్చి వారికి ఇష్టమైనవారికి కొలత వేసి భూములు పంచిఇస్తూ ఉన్నారు. ముఖ్యంగా మనకు Leader అయినటువంటి శ్రీ సంజీవరెడ్డిగారి ఆధ్వర్యంలో ప్రభుత్వంఇంత డీలగా నడవడము ఎంత మాత్రమూ పనికిరాదు. గట్టిచర్యలు తీసుకొని, తాలూకాలకు ఎక్కువ సౌర్యాలు కల్పించాలని మనవిచేస్తున్నాను. అంతేకాకుండా, అక్కడ ఉన్న officers ముందు

పైసా ఇస్తేనేగాని కలము పట్టనటువంటి పరిస్థితులలో ఉన్నారు. ఇది నిర్మూలించే వరకు ప్రజలకు ఎట్టి విశ్వాసము కలగదని మనవిచేస్తూ, రెవెన్యూ మంత్రిగారు ప్రవేశ పెట్టిన Demandను బలపరుస్తూ, తమకు నా కృతజ్ఞతాభివందనములు అర్పిస్తూ ఇంతటితో ముగిస్తున్నాను.

*శ్రీ ఎస్. వి. కె. ప్రసాద్ (చెన్నూరు):. అధ్యక్షా! రెవెన్యూ మంత్రి గారు, రెవెన్యూ పద్దును ప్రవేశ పెడుతూ, భూసంస్కరణలపై భూమి శిస్తుల సమస్యపై ఉపన్యసించడం జరిగింది.

భూసంస్కరణల విషయంలో కొన్ని general principles చెప్పి వాటిని గురించి, సభ్యుల అభిప్రాయాలు తెల్పాలని కోరారు. కాని, ఈ general principles పైన చాలా కాలంనుంచి, ప్రజలు, రైతాంగము, ఆందోళన చేస్తూ వచ్చారు. దీనికి సంబంధించిన అనేక విషయాలు అందరి ద్వారా చెప్పబడ్డాయి. కాని, ఈ భూసంస్కరణలు గురించి ప్రభుత్వము ఇప్పుడు serious గా ఉన్నదా? లేదా?అనేది ఒక ముఖ్యమైన సమస్యగా ఉన్నది. అదనపు భూములను పంచేది కూడ ఒక సమస్య మనముందు ఉన్నది.వీటిని గురించి ప్రభుత్వం ఇంతవరకు ఏమి చేసింది? ఇవన్నీ స్పష్టంగా అర్థం చేసుకున్న పిదపనే, ఈ భూసంస్కరణల విషయంలో మా అభిప్రాయం తెలిపితే సమంజసంగా ఉంటుంది. ఇంతవరకు ఈ చట్టాల యొక్క అనుభవం ఏమిటి? దానివల్ల కౌలుదార్లకు రక్షణ కలుగుతున్నదా? అనే విషయాలు జాగ్రత్తగా ఆలోచించాలి. అంతేగాక, ఇదివరకు చట్టాలలోని లోపాలను తొలగించడానికి ప్రయత్నం చేస్తేనే, ఈ సంస్కరణలు ఉపయోగ పడుతవి, లేకపోతే అవి నిరుపయోగం అవుతవని, ప్రభుత్వము తెలుసుకోవాలని కోరుతున్నాను. తెలంగాణాలో కొన్ని చట్టాలు మొత్తం భారతదేశంలో కన్నా ఆదర్శప్రాయమైన చట్టాలని, మంత్రిగారు గత సంవత్సరం చెప్పారు. వాటి ఫలితము కూడ మనకు చాల స్పష్టంగానే కనబడింది. వారియొక్క report ను బట్టి చూస్తే 1951 లో ఉన్న కౌలుదార్లలో, ఈ 1954_55కే సగము మంది దాదాపు, వారి భూములు పోగొట్టుకున్నారని స్పష్టంగా వ్రాయబడింది. ఇది ప్రత్యేకంగా opposition వారు చెప్పే విషయం కాదు.

ఆ విధంగా జరుగుతున్న ఉదాహరణలు అనేక గ్రామాలలో వున్నాయి. మానెపూడి తాలూకాలో మల్రెపాడు గ్రామం వుంది. అక్కడున్న దొరవారు కౌలుదారులను బేదఖలు చేస్తుంటే అధికారులు నిస్సహాయులవలె ఊరుకుంటున్నారు. జనగామ తాలూకాలో పాలకుర్తి అనే గ్రామం వుంది. అక్కడ ఇప్పటికీ దాదాపు 5 సంవత్సరాల నుంచి కౌలుదార్లకు రక్షణ కల్పించే సమస్య ప్రభుత్వం ముందున్నది. వారింతవరకూ యేమీ చేయలేకుండా వున్నారు. వారిని బేదఖలు చేయడం, వారు కలెక్టరు వద్దకుపోవడం మళ్లా కబ్జా యిప్పించడం,యీ విధముగా సాగిపోతున్నది.1.2 ఉదాహర

ణలు మాత్రమే చెప్పాను. ఇంకా అనేకం వున్నాయి. చట్ట ప్రకారం రక్షణ యిచ్చే
అవకాశం వున్నా ప్రభుత్వం యివ్వలేకుండా పోతున్నది. ఈ విధముగా 54–55
సంవత్సరములలో తెలంగాణా ప్రాంతములో సగము మంది కౌలుదార్లు భూములను
బేదఖలై పోగొట్టుకుంటున్నారంటే ఆదర్శ ప్రాయమని చెప్పిన చట్టం ఎట్లా అమలు
జరిగిందో స్పష్టంగా తెలుస్తుంది. ఇక ఆంధ్రలో చేసిన కౌలుదారీ చట్టం వలన అధిక
సంఖ్యాకులైన కౌలుదార్లు యిదివరకు తమకు భూమిపై వున్న హక్కులను పోగొట్టు
కున్నారని అందరికీ తెలిసినదే. మొత్తంగా చట్టం చేసేముందు "తెలంగాణా చట్టం
యొక్క ఫలితం యేమిటి? అని స్పష్టంగా ఆలోచించాలి. ప్లానింగు కమిటీ వారు
యీమధ్యనే ఒక కమిటీని వేశారు. ఈ చట్టాలవల్ల కౌలుదార్లు ఎందుకు బేదఖలు
అవుతున్నారో, కౌలుదారులకు హక్కులు ఎందుకు కలిగించలేక పోతున్నామో విచా
రించి భూములను పోగొట్టుకున్న కౌలుదార్లకు భూములను యిప్పించడం కోసం
ప్రయత్నం చేయాలని సూచన చేశారు. కాని, దాని గురించి ప్రభుత్వం యేమయినా
ఆలోచిస్తున్నదా? తేబోయే భూసంస్కరణలలో కౌలుదారులు పోగొట్టుకొన్న భూము
లను వారికి తిరిగి యిప్పించే సూచనలను పెట్టబోతున్నారా? అని అడుగుతున్నాను.
47 వ Section గురించి personal cultivation గురించి చాలా ప్రశ్నలు వేశారు. కాని
యీ సమస్య గురించి వారు ఏమీ చెప్పడంలేదు. కౌలుదారులకు భూమిని యిప్పించడం
నేటి ప్రధాన సమస్య. దానిని గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదు. కౌలుదారులకు
యాజమాన్య హక్కు కలిగించే చట్టాలు కొన్ని తెలంగాణాలో వున్నాయి. వాటిని
1955 వ సంవత్సరంలో ఖమ్మం జిల్లాలోను, వరంగల్లు జిల్లా ములుగు తాలూకాలోను
అమలు చేశారు. దీనివల్ల ఖమ్మంలో 60 వేల ఎకరాలుపై యాజమాన్యం హక్కు యిచ్చా
రని కాగితం మీద ప్రకటించారు. కాని భూస్వాములు కోర్టుకుఎక్కారు. 60వేల ఎకరాలు
అని కాగితంమీద వున్నా దాంట్లో కౌలుదారులకు ఖబ్జాహక్కు వున్నభూమి చాలా
తక్కువ. అధికారులు వారికి ఖబ్జా యిప్పించడానికి ప్రయత్నం చేయాలి. వారు
మళ్లీ కోర్టుకు ఎక్కాలి. కలెక్టరు దగ్గరకు రావాలి. దీనిని తెలంగాణాలో మిగతా
ప్రాంతాలకు వర్తింపచేయలేదు. ఎందువల్ల కొద్దిమందికే వస్తున్నదంటే అదివరకే
1952, 1953, 1954 సంవత్సరాలలో పంపకాలు జరిగిపోయినాయి, కొంతభూమి కంటె
ఎక్కువగల కౌలుదారులకే హక్కువస్తుందని ఆచట్టంలో వున్న లోపాన్ని సవరించ
డానికి ప్రభుత్వం పూనుకోలేదు. అందువల్ల చాలా కొద్దిమందికే లాభం వస్తుంది.
అదేవిధముగా ceiling సమస్య తీసుకుంటే తెలంగాణాలో ఖమ్మం జిల్లాలో 6 వేల
ఎకరాలు మాత్రమే మిగిలిందని చెప్పారు. ఆంధ్రలో ceiling పెడతామని చెబు
తున్నారు 20 ఎకరాల పైనున్నవారు లెక్కలివ్వాలని land census కోరారు.
ఏమితేలింది? అమ్మకాలు, పంపకాలు జరిగిపోయినవి. "ఈ చట్టాలవల్ల అసలు పంప
కానికి యేమీ భూమి వచ్చేటట్లులేని పరిస్థితిని ఎదుర్కోవడం ఎట్లు?" అని విన్న

శ్రీ కళావెంకటరావుగారు ఒక ప్రశ్న వేశారు, అమ్మకాలు, పంపకాలు అయిపోయిన తరువాత యేమి మిగులుతుంది? ధనికవర్గానికి భూస్వాములకు అనుకూలంగ్గాలేని విధానమును యీ చట్టములను తయారు చేయడంలో అనుసరించాలి. ఈ సంస్కరణలలోని లోపములను సవరించడానికి ప్రభుత్వం serious గా వుందా అని ప్రభుత్వమును ప్రశ్నిస్తున్నాను. ప్రభుత్వములోని మంత్రులే యీ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఉద్యమములను నడుపుతున్నారు. నెల్లూరులో శ్రీ సంజీవయ్యగారి అధ్యక్షతను జరిగిన సభలో శ్రీ తిమ్మారెడ్డిగారు ఉపన్యసించినట్లు తొమ్మిదవ తేదీ 'హిందూ' పత్రికలో వున్నది.

మిస్టర్ స్పీకర్: అది తీసుకవచ్చారా?

శ్రీ యస్. వి. కె. ప్రసాద్: తీసుకుని వచ్చానండి. దాంట్లో శ్రీ తిమ్మారెడ్డిగారు "మీరందరూ గట్టిగా నిలబడాలి, ఐక్యంకావాలి. మా ప్రభుత్వం చేతులు బలపరచాలి. మేము కేంద్ర ప్రభుత్వంతో దెబ్బలాడి యీ సంస్కరణలు చేయడం కోసం మా చేతులు బలపరచాలి" అని ఉపన్యాసం యిచ్చారు. వారు ప్రభుత్వం చేతులు బలపరచాలని స్పష్టంగా చెప్పారు. ఇది వ్యక్తిగతమైన సమస్యకాదు. ఒకవైపున ఖానూన్ చట్టములు ఆ విధంగా అమలు జరిగాయి. ఇక ప్రభుత్వంలోని బాధ్యతగల మంత్రులలో ఒకరు అధ్యక్షులుగాను, ఇంకొకరు ఉపన్యాసకులుగాను ఆవిధముగా చెబుతూవుంటే, యీ చట్టాలను గురించి ఏదో చేయబోతున్నాం అంటే దానినిగురించి ప్రజానీకం యేమిటనుకోవాలి? ప్రజా ప్రతినిధులు ఏమిటను కోవాలి? భూస్వాములకంటే మంత్రులే ఆవిధముగా చెబుతూవుంటే జరుగబోయే సంస్కరణలు దాని ననుసరించే జరుగుతాయి. ఉన్నలోపాలను సవరించడానికి యేమి చేస్తారు? హైదరాబాదు ప్రభుత్వం తెలంగాణాలోనికొంత ప్రాంతంలో 1955 వ సంవత్సరంలో ఒక శాసనం అమలు చేశారు. దానిని మిక్కిన ప్రాంతానికి ఎందుకు అమలు పరచరు? సెక్షన్ 38 (e) సె. 58 (c) లను యాజమాన్యపు హక్కువున్న కనీసపు హక్కయినా అనుభవించడానికి మొత్తం తెలంగాణా ప్రాంతానికి ఎందుకు వర్తింపచేయరు? హైదరాబాదు ప్రభుత్వం దాదాపు మూడు సంవత్సరములలో State అంతటా దీనిని వర్తింప చేస్తామని చెప్పారు: 1955 వ సంవత్సరంలో ప్రారంభం అన్నారు. ఒక విప్లవం వచ్చేస్తుందన్నారు. మనకు విశాలాంధ్ర వచ్చింది. ఎందుకని దానిని అమలు జరుపకుండా ఖమ్మంతోటి, ములుగుతోటి ఆపుచేశారు? "క్రొత్త సంస్కరణలు రాబోతున్నాయి. అందువల్ల ఆపాము " అంటారా? క్రొత్త సంస్కరణలు యింతకంటె హీనంగా వుండే పరిస్థితి వచ్చింది. Ceiling యిదివరకు 3,600 రూపాయలుంటే యిప్పుడు 5400 రూపాయల వరకు ఉండాలంటున్నారు.

A.I.C.C. Economic Review లో leaders వ్రాయడం జరుగుతున్నది. అందువల్ల ఉన్నదానిని ఎందుకు అమలు జరుపరు? 1955 వ సంవత్సరపు చట్టం 38 వ section క్రింద, 58 (c) section క్రింద సేద్యానికి వున్న హక్కులనైనా యివ్వండి; దానిని అమలు జరపండి." అంటే, ఏదో సాకుతో వాయిదా వేయడం జరుగుతున్నది. ఇక బంచరాయి భూమి సమస్య వుంది. ప్రభుత్వ భూముల పంపకం గురించి 1,2 విషయాలు ఇదే పద్ధతిన జరుగుతున్నది. చాలకాలం నుంచి ప్రజలు వాటిని పంచాలని కోరుతున్నారు. కొంత అనుభవిస్తున్నారు. వ్యవసాయఉత్పత్తి అవసరం అనుకునే యీ రోజులలో దీనిని త్వరత్వరగా ఎందుకు పూర్తిచేయరు? భూస్వాముల సమస్యలేదుకదా? కనీసం యిప్పుడు 'ఖబ్జా' వున్నవారికి పట్టాలు త్వర త్వరగా యివ్వడం విషయంలో, రాజకీయ బాధితులకు భూములివ్వాలనే సమస్య వచ్చినప్పుడు ఎంత త్వరగా ప్రయత్నం చేశారో అంత త్వరగా కనీసం యిప్పుడున్న రూల్సు ప్రకారం అయినాసరే 'ఖబ్జా' ఉన్నవారికి పట్టాలు రావాలి. కనీసం ఉన్నరూల్సునయినా సరిగా అమలుజరపాలి. 1954 సంవత్సరంలో తెలంగాణాలో ఉద్యమంవచ్చింది. ఒక సంవత్సరంలోపల పూర్తిచేస్తాం అన్నారు. 1954 పోయింది. 1958 సంవత్సరంకూడా వచ్చింది. మూడుసంవత్సరాలైనా మొత్తం 'ఖబ్జా' వుండి పట్టా యివ్వవలసిన వాటిలో మూడోవంతుకూడా యింతవరకు పూర్తికాలేదు. దాని వల్ల గ్రామాలలో ప్రతిసంవత్సరం రాజకీయకక్షలతోటి, పంటలనుమేపడం జప్తులు చేయించడం జరుగుతున్నది. వందలకొలది ఉదాహరణలున్నాయి. ఆంధ్ర ప్రాంతపు వివరాలు నాకుతెలియవు. తెలంగాణాప్రాంతం వివరాలు తెలుసును. జనగామ తాలూకాలో ఒక గ్రామంలో ఆవిధంగా రాజకీయకక్షలవల్ల పంటలు మేపించారు.

ములుగు తాలూకాలో గవర్నమెంటు భూములు వేలకొలది ఎకరాలు వున్నవి. అక్కడ ఆ భూములు చక్రవర్తి అనే ఆయన ఆక్రమించుకొని కూర్చున్నారు. ఆయన ఒక్కడికిక్రింద 800 ఎకరాలు భూమివుంది దానిని గురించి settlement చేశారా? ఎప్పుడు? అక్కడ Settlement జరగడంలేదు. Settlement చేసి ఒక్కొక్కరికి ఎంత భూమివుందో బయిటికితీయరు. ప్రభుత్వము Settlement operations ప్రకటన చేసినట్లయితే యీ వేలకొలది ఎకరాలు బయిటకుతీయవలసి ఉంటుంది. భూములులేని వేలకొలది కుటుంబాలకు భూములు యివ్వవలసి వస్తుంది. ములుగు తాలూకాలో వ్యక్తులస్వాధీనంలో వున్న భూములను లెక్కతీయాలని ఒకసారి ఒకవిధమైన order, ఇంకొకసారి ఇంకొక order వేస్తున్నారు. కాని ఆ Settlement Operations ఖతమటకు రాలేదు. బంజరుభూముల సమస్యకూడా అదేస్థితిలోనే ఉన్నది. భూసంస్కరణలు అమలుజరుపబోతున్నామంటే ఇదివరకు చేసినశాసనం అనుభవరక్షణము, కౌలు సవరించడము, మొదలయినపనులు చేస్తేనే ప్రభుత్వము

యీ విషయములో శ్రద్ధవహించుతున్నదని అనుకొనుటకు కాని, ప్రపంచము నమ్మడానికి గాని అవకాశం వుంటుంది. వాటినిగురించి ఆలోచించాలని కోరుతున్నాను.

శ్రీ వి. కోదండరామరెడ్డి (సర్వేపల్లి):—అధ్యక్షా, ఈ డిమాండును నేను బలపరుస్తూ రెవెన్యూ మంత్రిగారు యీ రంగములో చేస్తున్నకృషికి వారిని ప్రశంసిస్తున్నాను. నాకన్నముందు మాట్లాడిన సోదరసభ్యుడు నెల్లూరులో జరిగిన Agricultural Exhibition లో శ్రీ పి. తిమ్మారెడ్డిగారు శ్రీ సంజీవయ్యగారలు ప్రభుత్వము భూసంస్కరణల విషయములో పట్టుదల చూపడములేదని చెప్పివున్నారని చెప్పినారు. ఆ సమావేశములో నేనుకూడా వున్నాను. తిమ్మారెడ్డిగారు చేసిన ఉపన్యాసములో "మేము అనగా రైతులుకూడా సంఘాలుగా ఏర్పడాలి, ప్రతివారికి సంఘములు వుండవలసిన అవసరము వుంది." అని చెప్పారు. ఈ సంఘముల ద్వారా తమ యిబ్బందులను ప్రభుత్వమునకు చెప్పుకొనడానికి అవకాశం వుంటుంది. అటువంటిది మనరైతులలో లేకపోవడము శోచనీయము, అందువల్ల రైతులు అందరు కలిసి సంఘాలు ఏర్పాటుచేసుకొని వారికివున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకొనిరావలసినదిగా వారుచెప్పినారు. అంతేకాని,భూసంస్కరణలు అవసరంలేదని, వాటికి వ్యతిరేకం గాని చెప్పలేదు. భూసంస్కరణలు జరిగితీరవలసినదే గాని యేవిధముగా జరగవలసినదనే ప్రశ్న యోచించవలసివున్నది. అందుచే మీరు సంఘములుగా ఏర్పడి తమ యిబ్బందులు మీ సంఘముల ద్వారా విన్నవించుకోవచ్చు. ప్రభుత్వము వేరేవిధముగా వుందని వారు చెప్పలేదు. మంత్రులు దానిగురించి భేదాభిప్రాయములో వున్నారని చెప్పడము సమంజసముగా లేదు. నేను రైతులతరపున మాట్లాడుతున్నాను. మన వెంకటరావుగారు రెవిన్యూ మంత్రిగా ఎంతో కృషి చేస్తున్నారు. ఏదోవిధముగా రైతులకు, కూలీలకు సామరస్యము కలుగచేయాలని వారి ఉద్దేశ్యము. కాని రైతులలో అనవసరమైన ఆందోళన ఏర్పడింది. ప్రభుత్వము ఒకప్రక్కన అధికోత్పత్తి చేయాలని ప్రకటనలు చేస్తూ ఈ భూసంస్కరణలు ఏమిటి? ప్రజలలో ఆందోళనకరముగావుంది. వెంకటరావుగారు ఈ సంస్కరణలు తీసుకొస్తున్నారంటే శోచనీయమనే చెప్పాలి. సంస్కరణలు అవసరములేదని ఎవ్వరూ చెప్పడములేదు. అన్ని రంగాలలోనూ సంస్కరణలు అవసరమని అందరుచెప్పడానికి పూనుకొన్నారు. భూసంస్కరణలకు ప్రాధాన్యము యిచ్చే పరిస్థితులలో వాటిని ఏవిధముగా అమలు జరపాలనేది ప్రశ్న. ఈ మధ్య రెవిన్యూమంత్రి ఒక ordinance issue చేయించారు. ఆ ordinance ఉద్దేశ్యము మంచిదేకావచ్చు. కాని ప్రజలలో కల్లోలము ఏర్పడింది. 30 ఎకరాలకుపైన భూమికలిగివున్నవారు తమకు ఎంతఆస్తి ఉన్నదో గవర్నమెంటుకు తెలియచేయాలని ఆ ordinance లో వుంది. దీనివల్ల భూస్వాములు "మనకు 30 ఎకరాలకంటే ఎక్కువ భూమిని వుంచరు, 20 ఎకరాలే గరిష్టప్రమాణ

ముగా నిర్ణయించెదరు" అని ఆందోళన చెందారు. నాకు తెలిసినంతవరకు గ్రామాలలోని ప్రతి కుటుంబము విచ్ఛిన్నము కావడము, జరిగింది. వ్యవసాయరంగములోకూడా మనం ఉత్పత్తిఎక్కువగా ఎందుకుచేయాలి. ఈ వున్నభూములన్నీ ప్రభుత్వం తీసుకొనేటప్పుడు ఎక్కువ ఉత్పత్తిచేయవలసిన అవసరము ఏమి వచ్చింది. పండినదానితో సంతృప్తిపడదామనే నిర్లక్ష్యభావం రైతులలో ఏర్పడింది. ఈ నిరుత్సాహానికి కారణముఏమిటి? సోదరసభ్యుడు చెప్పినట్లు యీ భూసంస్కరణలు ఎంతవరకు ఉపయోగపడతాయి. ఈ భూమిని సద్వినియోగము చేసుకొనడానికి ఉన్న అవకాశములు ఏవిఅని యోచించాలి. ఇప్పుడు గ్రామాల్లో బంజరు భూములు ఎన్నోఉన్నాయి. కూలివారికి, భూములులేనివారికి ప్రభుత్వము ధారాళముగా పట్టాలుయిస్తున్నది. దీనివల్ల వ్యవసాయరంగములో ఎంత అభివృద్ధి వచ్చిందీ యోచించాలి. గ్రామాలలో ఎక్కడచూచినా అధికోత్పత్తికావాలి అని ప్రచారము జరుగుతున్నాయి. గాని దానికి తగినఫలితము కనపడడం కాదు. మన మంత్రిగారికి మంచిఉద్దేశ్యమేవుంది; నాకుతెలుసు. కాని వారిని అనవసరంగా కొందరు అపోహలు పాలుచేస్తున్నారు. సోదరసభ్యుడు చెప్పినట్లువారికి ఈ విషయములో ఏ ఉద్దేశ్యములేదని చెప్పడం ధర్మంకాదు. భూసంస్కరణలుచేసి ఆంధ్రదేశములో ఆ కీర్తిసంపాదించుదామని పూర్తిగా వారికివుంది. మనందరము దానితో ఏకీభవిద్దాము కాని, దానిలో ఎన్నో విషయాలు వున్నవి. ఈ భూములకు Ceilings పెట్టడములో నిర్ణయించవలసిన విషయాలు ఎన్నోవున్నవి. రైతుసభ్యులు మన అసెంబ్లీలో చాలామంది వున్నారు. వారిఅందరి సలహాలు చాలాఅవసరము. వారందరిని సమన్వయముచేసి ఒకసభ ఏర్పాటుచేసి ఇటువంటి సంస్కరణలు తెస్తే ఎంతవరకు ఉపయోగపడతవని యోచించాలి.

ఈ సంస్కరణలు జేసిన తరువాత వారికిడబ్బుకొరత ఏర్పడింది. భూ సంస్కరణల గురించి మన తెలంగాణా సభ్యులు చెబుతూంటారు. వారిని దగ్గరకు పిలచి వీటిని గురించి అడిగితే "తెలంగాణాలో ఈ భూ సంస్కరణలకు ఒక Act ఏర్పడింది కాని దాని ఫలితము లేద"ని నాకు ఎక్కువమంది సభ్యులు చెప్పివున్నారు. అటువంటి పరిస్థితులలో ఒక చోట ఈ సంస్కరణలు జేసి అవి ఆంధ్రదేశమంతా విస్తరింప జేయకూడదనే వుద్దేశ్యముకూడా మంచిది కాదు. ఇక్కడ అమలు జరుగనిది ఆంధ్రలో తొందరపడి జేయవలసిన అగత్యమేమి వుందని నేను అడుగుతున్నాను. మనము minor irrigation కు ఎక్కువగా ఖర్చుపెడుతున్నాము. తిమ్మారెడ్డిగారు నెల్లూరు వచ్చినప్పుడు Collectors ను సమావేశపరిచారు. అప్పుడు కొన్ని లక్షల రూపాయలు irrigation క్రింద ఖర్చు పెట్టాలన్నారు. ఖర్చుపెట్టుటకు వసంబతులో orders పోతాయి. మార్చిలో ఖర్చుపెట్టవలసి ఉంటుంది. మార్చిలోపల ఎన్ని చెరువులు ఎన్ని రూపాయలు ఖర్చుపెట్టి మరమ్మత్తు జేయించగలరో యోచించవలసి

వుంటుంది. అటువంటి పరిస్థితులలో ప్రతిసంవత్సరము ముందుగా ఒక Programme వేసుకొని యిన్ని చెరువులు ఈ సంవత్సరము బాగుజేయించాలి అని, ఇంత డబ్బు ఖర్చు జేదామని నిర్ణయించు కొనవలయును.

శ్రీ కె. వెంకటరావు :- అక్కడ సైకిల్ ఆఫ్ వర్క్ వున్నది. ప్రతి అయిదేళ్ళకు వుంటుంది. నెల్లూరి జిల్లాలో నవంబరు నెలలో వరదవచ్చింది గనుక యాక్షన్ తీసుకోవడం జరిగింది. దానికి సంతోషించాలి. ఫ్లడ్ ముందరవస్తే, మేము ముందుగనే ఖర్చుపెట్టేవాళ్ళం. అసలు ఫ్లడ్‌రాకూడదనే కోరిక.

శ్రీ వి. కొదండరామరెడ్డి :- ఇప్పుడు ఖర్చుపెట్టినదానికి సంతోషిస్తున్నాం. మిగిలిన మొత్తాలు లాప్సుకాకుండా వాటిని పై సంవత్సరం లో ఖర్చుపెట్టాలని కోరుతున్నాము. అడ్మినిస్ట్రేషన్‌లో లోపాలున్నాయని అందరికీ తెలుసును. ఈ విషయంలో మంత్రిగారు ఎక్కువ శ్రద్ధతీసుకొని రెవెన్యూశాఖ పరిపాలన సక్రమంగా జరిగేటట్లు చూడవలెనని కోరుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ యం. రాజేశ్వరరావు (దివి-రిజర్వుడు) :- అధ్యక్షా, శ్రీ గోపాలరెడ్డిగారి బడ్జెట్ ఉపన్యాసంలో వారు యింతవరకు 8 బడ్జెట్లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఐతే గత 7 బడ్జెట్లే యీ బడ్జెటుకన్నా ఆశాజనకంగా వున్నట్లు కొంతమంది వెలిబుచ్చారు. నేనుకూడ యీ బడ్జెటులో 8 బడ్జెట్లమీద జరిగిన చర్చలలో పాల్గొన్నాను. కాని ఇంతవరకు నేను చూసిన బడ్జెట్లలో యీ బడ్జెటు బాగున్నదని నేననుకొంటున్నాను. ఈ బడ్జెటు చూచినతర్వాత నాకుచాలా ఆనందం కలిగింది. 8 బడ్జెట్లలో యీ ఒక్కబడ్జెటు మిగులు బడ్జెటు. కారణము లేమైనప్పటికి మిగులు బడ్జెటు ప్రవేశపెట్టినందుకు, శ్రీ గోపాలరెడ్డిగారు ఇక్కడ లేకపోయినప్పటికీ, పరోక్షంగానైనా మా అభినందనలు వారికి అందజేస్తున్నాము. జనరల్ డిబేటులో పాల్గొనలేని కారణంచేత ఇతరవిషయములగురించి మాట్లాడటానికి నాకు అవకాశంలేదు. ఈ రెవిన్యూ డిమాండును పురస్కరించుకొని, ఒకటిరెండు విషయాలు మనవిజేయ దలచుకొన్నాను. గత సంవత్సరం రెవిన్యూ డిమాండుపై మాట్లాడుతూ ఒక సూచన జేశాను. ఇప్పుడు మనకు రెవిన్యూ డిమాండు క్రింద వస్తున్న ఆదాయాన్ని ఖర్చులను పరిశీలిస్తే, యీ ఆదాయాన్ని వసూలు జేయడంకోసం నూటికి 44 రూ. లు ఖర్చుజేస్తున్నామని బోధపడుతుంది. అందుజేత ఇంతఖర్చునూ తగ్గించుకోవలసిన అవసరమున్నది. ఇప్పుడు గ్రామాలలో పంచాయితీలు ఏర్పడి పటిష్ఠముగా పనిజేస్తున్నాయి. కాబట్టి పన్నులు వసూలుజేసే పనిని పంచాయితీలకు అప్పగించినట్లయితే ఖర్చు తగ్గుతుంది. పంచాయితీలు యీ పనిని నిర్వహించినందుకు వారికి నూటికి 25 రూ. వంతున యిచ్చినప్పటికికూడా .194 లక్షల రూ. మాత్రం ఆదా అవుతుంది. గత సం. బడ్జెటులెక్కలనుబట్టి యీ అంచనా చెప్పగలుగుతున్నాను.

యీ సంవత్సరం అంకెలు నేను చూడలేదు. ఈ సంవత్సరం రెవెన్యూ పద్దుక్రింద 815 లక్షల రు. ఆదాయమొస్తుంది. 25 జనరల్ అడ్మినిస్ట్రేషన్ పద్దుక్రిందగాని, 7. ల్యాండు రెవిన్యూపద్దుక్రిందగాని జరుగుతున్న యిటువంటి ఖర్చులను కలిపితే, 635 లక్షలవరకు కవబడుతుంది. దాదాపు 8 కోట్ల రూ॥ వసూలు చేయడానికి 6 కోట్ల రూ॥ వరకు ఖర్చవుతుందని మనమనుకోవలసి వస్తుంది. రెవెన్యూ మంత్రిగారు, దీనిని చిన్న విషయంగా చూడకుండా కొంచెం జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా కోరుతున్నాను. పంచాయితీ చట్టం ప్రకారం ల్యాండు రెవెన్యూ పద్దు క్రింద ప్రభుత్వానికి వచ్చే ఆదాయం క్రింద 12 శాతము పంచాయితీలకు యివ్వవలెనని వున్నది. ఐతే యిప్పటి వరకు ఒక కానీ కూడా యివ్వలేకపోయినాం. ఇది లక్ష్యముగా పెట్టుకొనే మన పంచాయితీ చట్టమును రూపొందించినాము. పన్ను వసూలు చేసే బాధ్యత పంచాయితీలమీద పెట్టినట్లయితే వారికి 25 శాతము వరకు మనం యివ్వవచ్చు. ఆవిధంగా చేసినందువల్ల పంచాయితీల ఆదాయం పెరగడమే కాకుండా ప్రభుత్వానికి యిప్పుడవుతున్న ఖర్చులో చాలా భాగం తగ్గుతుంది. దీనిని మంత్రి గారు పరిశీలన చేయవలయునని నేను కోరుతున్నాను. భూమి శిస్తును వసూలు చేయడంలోను, తక్కావీ ఋణాలను వసూలు చేయడంలోను, ఎల్. ఐ. లోన్సును వసూలు చేయుడంలోను, చాలా సాధకబాధకాలున్నాయి. ఇది ప్రభుత్వానికి కూడా తెలుసును. జాయింటు పట్టాలున్నవారికి యీ లోన్సు అందడంలో వస్తున్న యిబ్బందులు ప్రభుత్వానికి తెలియనివి కావు. పట్టాలను విడదీయవలసినదిగా ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా, డిమార్కేషన్ చార్జెస్ కట్టుకున్నా కూడా సబ్ డివిజన్ కాకపోవడం జరుగుతున్నది. ఇప్పుడు సర్వే, సెటిల్‌మెంటులు జరుగుతున్నవి. వాటితోబాటు ల్యాండు రెవెన్యూ కలెక్షన్‌కూడా ఒక సక్రమ పద్ధతికి తీసుకొని రావలెనని కోరుతున్నాను. పన్నులను వసూలుచేసే విషయంలో నేను ఒక సవరణ బిల్లును ప్రైవేటు మెంబర్సు బిల్లుగా తీసుకొని రావలయునని ప్రయత్నం చేశాను. దానిని పరిశీలించ వలయునని మంత్రిగారిని కోరుతున్నాను. ఏదైనా ఒక విషయంపై తీర్పుచెప్పేటప్పుడు పార్టీకి రీజనల్ ఆపర్ట్యునిటీ యిస్తాము కాని, రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం డిమాండును జారీచేసిన వెంటనే పన్ను యివ్వకపోతే ఆస్తిని జప్తు చేయడానికి రెవెన్యూ ఉద్యోగులకు అధికారమున్నది. ఈ నిబంధన చాలా దారుణంగా వున్నది. ఇందుకు నిదర్శనంగా ఒక ఉదాహరణ చెబుతాను. ఈ మధ్యన ఆర్. డి. ఒ., తహశీల్‌దారు, మొదలైనవారు ఒక ఆసామి ఇంటి దగ్గరలేని సమయంలో అతని భార్యకు డిమాండు నోటీసు నిచ్చి, డబ్బు యిస్తావా లేదా, అని ఒత్తిడి చేస్తే, "నా భర్త పొలంలో పని చేస్తున్నారు, 5 నిమిషాలు వ్యవధి యిస్తే పిలిపిస్తాను" అని చెప్పినా వినకుండా పిలిపించినదాకా ఆగవలసిన అవసరం మాకు లేదన్నారు. 'డబ్బు పెట్టెలో ఉన్నది, తాళాలు నాదగ్గర లేవు. పెట్టె పగులగొట్టించి

డబ్బు తీసుకొంపి' అని ఆమె . అన్నా కూడా వినపించుకోకుండా జప్తు చేశారు. దాని తరువాత పెట్టె పగులగొట్టి చూస్తే వారికి కావలసిన డబ్బుకన్న 4,5 రెట్లు వున్నది. ఈ విధంగా చేసినా లా ప్రకారం తప్పులేదు. ఇది యాక్టులో ఉన్న లోపం. కాబట్టి ఇన్ని రోజులనుంచి నోటీసు జారీ చేయాలని, తర్వాత నిర్ణయించిన వ్యవధిలోగా పన్ను చెల్లించకపోతే జప్తు చెయ్యవలెననే నిబంధన ఉంటే బాగుంటుం దనుకుంటాను. ఈ విషయంలో నేను రెవెన్యూ ఉద్యోగులతో సంప్రదించగా, యీ మాత్రం అధికారమైనా మాకు లేకపోతే పన్నులు వసూలు చేయడం సాధ్యం గాదని వారు చెబుతున్నారు. ఇట్టి అర్‌బిట్రరీ పవర్ వారు కావలెనంటున్నారు. కాని పౌరుల పన్న హక్కులను గమనించి నట్లయితే ఫండమెంటల్‌గా యీ నిబంధన తప్పు అని బోధ పడుతుంది. కాబట్టి రెవెన్యూ రికవరియాక్టును సవరించాలి. లేదా మేము తెచ్చే సవరణలు ఆమోదించాలి. భూసంస్కరణలు తీసుక వస్తామని చెబుతున్నారు. అందుకు ప్రథమ సోపానముగా టెనన్సీ యాక్టును ప్యాసు చేశారు. ఆ చట్టం చర్చింప బడుతున్నప్పుడు నేను, శ్రీ అయ్యపు రెడ్డి మొదలగు వారందరము కూడా యీ అధి కారం రెవెన్యూ అధికారులకు అప్పగించవద్దని కోరినాము. సాధ్యమైనంత వరకు సివిల్ కోర్టులకు అప్పగించ మన్నాము. మొదటి స్టేజిలో కాకపోయినా, అపీలు స్టేజిలో అయినా, సివిల్ కోర్టుకు యీ అధికారమును అప్పగించమని చెప్పాము. బిల్డింగ్స్‌లీజ్ అండ్ రెంట్ కంట్రోలు యాక్టు క్రింద రివిజినల్ పవర్స్ ఏ విధంగా సివిల్ కోర్టులకు యిచ్చారో, అదే విధంగా యీ చట్టం క్రిందకూడా రివిజినల్ పవర్స్‌ను డిస్ట్రిక్ట్ మునిసిఫ్‌కు గాని, సబార్డినేటు జడ్జికి గాని యివ్వమని కోరాము. అయితే యివి సమరీ ప్రొసీడింగ్సు గనుక రెవెన్యూ అధికారులకే యివ్వడం మంచిదని అభి ప్రాయ పడ్డారు. ఇవ్వాళ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 145వ సెక్షన్ క్రింద 2 మాసాలలోపున ప్రొసీడింగ్సు పూర్తికావలయుననే నిబంధనయున్నది. అలాంటి ప్రొసీజరును టెనెన్సీయాక్టు సందర్భంలోకూడా అమలుచేయవచ్చు. ఏదో ఒక స్టేజిలో సివిల్‌కోర్టులకు వెళ్లకపోయినట్లయితే నిర్ణయాలు చాలా ఆర్‌బిట్రరీగా జరుగుతాయని ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. టెనెన్సీయాక్టులో ప్రాక్టీసుచేసే లాయర్లయొక్క అనుభవాలను చూసినట్లయితే, ఎంత ఘోరంగావున్నవో బోధ పడుతుంది. ఇవి సమరీ డిస్పోజల్స్ అనిచెప్పినా యీనాడు ఏదో ఆర్. డి. వో. ఆఫీసులో ఎన్నో పిటీషన్లు పెండింగుగా వున్నాయి. మూడవ సంవత్సరము కావస్తున్న ఇప్పటివరకు అప్పీల్సు విచారణలో వున్నాయంటే ఎంత తొందరగా తీర్పుల తీర్మానం జరుగుతున్నదో ఆలోచించండి. ఇవి సమరీ ప్రొసీడింగ్సు అయినంత మాత్రంచేత ఆర్‌బిట్రరీగా వుండవలసినదేనా? ఈ మధ్యన ఒక సందర్భంలో రెమిషన్ ఆఫ్ రెంటుకు దరఖాస్తుపెడితే రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగారు 6 బస్తాలు ఫైర్ రెంట్ అని ఎస్టిమేటువేశారు. దాని ప్రకారం లెక్కవేసి చూసినట్లయితే.

ఎకరానికి 13 బస్తాలవుతుంది. ఇటువంటివి రెండు మూడు కేసులు ప్రభుత్వ దృష్టికి తీసుకవచ్చాను. సివిల్ కోర్టుల్లోకూడా సమరీ ప్రొసీడింగ్స్ యీయడం జరుగుతున్నది. నెలలోనో, రెండునెలల్లోనో ప్రొసీడింగ్సు అయిపోతాయి. కాబట్టి రెవెన్యూ ఉద్యోగులనుంచి యీ అధికారాన్ని తీసివేసి సివిల్ కోర్టులకు అప్పగించవలెనని కోరుతున్నాను. టెనెన్సీ యాక్టులో "అగ్రీడ్ రెంట్" అనే మాటను వాడారు. వీటి అర్థం చాలా అంబిక్యూయస్‌గా వున్నది. దీని విషయంలో కోర్టులు వెలిబుచ్చిన అభిప్రాయాలు చాలా విచిత్రంగా వున్నాయి. 51 బస్తాలుపండితే ఫైర్ రెంట్ నిర్ణయమయ్యే వరకుకూడా మొదట ఏ రెంట్‌కు ఒప్పుకొన్నారో ఆ రెంట్‌నే కట్టాలన్నారు. వెనుకటి అగ్రిమెంటు ప్రకారం 60 బస్తాలు యివ్వవలసివున్నా, యీ సంవత్సరం 51 బస్తాలు మాత్రమే పండినది. ఐనప్పటికి కేసు తీర్మానమయ్యేవరకు 60 బస్తాలచొప్పున కట్టవలయునన్నారు. 5 వ సెక్షన్— "The Land Lord and the tenant may agree between themselves to any rent subject to the maximum prescribed in Section 3" అని వున్నది. Section 3 లో not more than 50% అని అన్నారు. దీనిమీద Courts యిచ్చిన interpretation పూర్తిగా విరుద్ధంగావుంది.

బంజరుభూముల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమేమో తెలియడంలేదు. అటువంటి పరిస్థితులలో భూసంస్కరణలు తెచ్చినప్పటికి కూడా మాకు ఏమి సహాయం జరుగుతుందో ఊహించలేకున్నాము. లక్షలాది ఎకరాల బంజరు భూములున్నాయి. బంజర్ల విషయములో రోజుకొక జీ. ఒ. వస్తున్నది. పొలిటికల్ సఫరర్స్‌కు యీ భూములనిచ్చే విషయంలో బాన్ రద్దుచేశామంటున్నారు. భూ సంస్కరణల ద్వారా పేద ప్రజలకు సహాయం చేయడమే ప్రభుత్వోద్దేశమైతే అందుకు ముఖ్యంగా యీ బంజరు సమస్యలను ముందు పరిష్కారం చేయాలి. ఎన్‌క్రోచ్‌మెంట్సు విషయంలో చాలా ఆర్బిట్రరీగా వ్యవహరిస్తున్నారు. 8 పర్యాయాలు అన్‌అబ్జక్షనబుల్ అని చెప్పిన దానిని 9వ పర్యాయం అబ్జక్షనబుల్‌గా నిర్ణయించడం జరుగుతున్నది. ఎవరో తహశీల్‌దారుకు కావలసిన రైతులకు సహాయంచేసే నిమిత్తం యీ విధంగా విపరీతమైన ఉత్తర్వులు జారీచేయడం జరుగుతున్నది. ఈ విధంగా ఉద్యోగుల యొక్క దయా దాక్షిణ్యాల మీద పేద ప్రజలు ఆధారపడవలసిన పరిస్థితులను సరిదిద్దాలి.

అందుచేత ఒక ఆక్రమణ objectionable లేక unobjectionable అని తేల్చాలని అనుకొన్నప్పుడు అది ఆ Revenue Divisional Officer తో, R.I. తో, తాసిల్‌దారుతో ఫైసల్ చేసి 'once for all' నిర్ణయం చేయండి. దానిని అతిక్రమించి వెళ్ళటానికి వీలులేదని, వెళ్ళినట్లయితే criminal prosecution పెట్టండి. అంతేగాని

బంజరు భూములు యిస్తామని ప్రచారం చేస్తూ, ఉపన్యాసాలు యిస్తూ. యివాళ జరుగు తున్న ఈ కష్టాన్ని చూస్తూంటే ప్రభుత్వం అవలంబిస్తున్న యీ విధానానికి మేము సంతోషించ లేకుండా ఉన్నాము.

ఈ సర్వే. సెటిల్‌మెంట్ విషయంలో. సర్వే పార్టీలను పెట్టి ఎంతో డబ్బు ఖర్చుపెట్టుతున్నారు. వీళ్ళు చేసే పనిలో ఎన్ని అవకతవకలున్నవో, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తూనే ఉన్నాము. బంజరుభూములు. చెరువులు, అన్నింటినీ పట్టా భూములుగా సర్వే చేస్తుంటే. మళ్ళీ మేము కంప్లైంట్సు చేసినప్పుడు resurvey చేయించుటకు ఎంతో డబ్బు ఖర్చు అవుతోంది. ఏలూరు తాలూకా నారాయణపురం గ్రామంలో 176 ఎకరాల చెరువు ఉందని గవర్నమెంటు లెక్కలలో ఉంటే, 56 ఎకరాలని మొత్తము చెరువుకు సర్వే లెక్క వ్రాశారు. ఈ విధంగా 5-6 చెరువుల విషయం ప్రభుత్వదృష్టికి తెస్తుంటే చర్య తీసుకొనుటలేదు. పబ్లిక్‌గా చెరువు కన బడుతూంటే. రైతుల భూములని పట్టాలు యిస్తూంటే ప్రభుత్వదృష్టికి తెచ్చినా ఏమీ చేయలేక పోతున్నారు.

మైనరు ఇరిగేషన్ విషయం ఉన్నది. దీని విషయం పంచాయతీ కాన్ఫరెన్సులో తీర్మానం చేస్తూ, మైనర్ ఇరిగేషన్ యిప్పటికైనా పంచాయితీలకు వప్ప జెప్పాలని కోరారు. ఈ మైనర్ ఇరిగేషన్ పనులు త్వరగా కావాలంటే. ప్రజలకు ఉపయోగపడాలంటే, రెవిన్యూ డిపార్టుమెంటు వదిలేసి, పంచాయితీలకు వప్పచెప్పితే బాగుంటుంది. కాబట్టి యివన్నీ రెవిన్యూ మంత్రిగారు జాగ్రత్తగా ఆలోచించి తగు చర్యలు తీసుకుంటారని. అవసరమయితే వారికి కావలసిన సహకారం యివ్వడానికి కూడా సిద్ధముగా ఉన్నామని మనవిచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

*శ్రీ బి. రామారెడ్డి:- (మైదుకూరు) అధ్యక్షా. రెవెన్యూ మంత్రిగారు ప్రవేశ పెట్టిన ఈ డిమాండును ఆమోదిస్తూ వారికి కొన్ని సలహాలు యివ్వదలచు కొన్నాను. భూమి పన్ను నిర్ణయించిన విధానంలో ఉన్న లోపాలవల్ల, యిటు రైతులకు, అటు పన్ను వసూలు చేసే గ్రామాధికార్లకు చాలా చిక్కులు ఏర్పడుతున్నవి. రైతు తను ప్రతి సంవత్సరం ఎంత పన్ను యివ్వవలెనో నిర్ణయంగా తెలిపే అవకాశాలు లేకుండా ఉన్నందువలన కేవలం కరణంగారి దయాదాక్షిణ్యాల పైన ఆధారపడవలసిన దుస్థితి సంభవిస్తోంది. V.M. కు కరణంగారు బాకీ పట్టీ యిచ్చేనంతవరకు, అతనికి తగు వంజాయిషీ చెప్పేవరకు. ఏ రైతునుంచి ఎంత వసూలు చేయవలెనో తెలియక తికమకలై సాధారణంగా గ్రామోద్యోగులు యిరువురికి అనేక కష్టలు ఏర్పడే పరిస్థి తులున్నాయి. రైతు స్వాధీనములో ఉండే భూమికి—ఫలానారకమైన భూమికి యింత పన్ను అని. ఆ భూమిని విభాగాలు చేసి, పన్ను నిర్ణయించి స్పష్టంగా తెలిపితే, అతను కరణంగారి దయాదాక్షిణ్యం పైన ఆధారపడకుండా తన పన్ను ఎంతో తెలుసుకొని

దానిని ముందుగా జాగ్రత్త పడి కట్టుటకు వీలుంటుంది. ఆ విధంగా ఏర్పాటు చేయించాలని మంత్రిగారికి సలహా యిస్తున్నాను.

వాణిజ్య పంటలపైన పన్ను వేశారు. పచ్చిమిర్చి పంట perishable పంట కాబట్టి దానిపైన వాణిజ్య పంటల పన్ను వేయవద్దని మొదట చెప్పుకున్నా పన్ను వేసినారు. వాణిజ్య పంటలపైన వేసిన పన్నుల విషయంలో చాలా మంది రైతులు చాలా కష్టపడుతున్నారు. స్వయముగా వారి కష్టాలు చెప్పారు. ఒక్కొక్క పెద్దఖండం భూమికి జాయింటు పట్టా ఉన్నా, దానిని చాలా మంది రైతులు సాగుచేసుకుంటూ ఉంటారు. అందులో ఏ భాగములో వాణిజ్య పంట వేసినప్పటికీ. ఆ మొత్తము భూమికి వాణిజ్య పంట పన్ను వేస్తున్నారు. ఆ జాయింటు పట్టాలోని అందరు రైతులు ఆ పన్నే యిచ్చుకొనేటట్లు కరణాలు వ్రాస్తున్నారు. అదేమిటని రైతులు అడిగినప్పటికీ. రూల్సు ఆ విధంగా ఉన్నాయంటున్నారు. అటువంటి లోపాలు సవరించి. వాణిజ్య పంట వేసిన వాని భాగమునకు మాత్రమే ఆపన్ను విధించేట్లు చేస్తారని తమ ద్వారా రెవిన్యూ మంత్రిగారికి మనవి చేస్తున్నాను. పైరులపైన పన్ను వేసే విషయంలో కరణాలు ముందుగానే అడంగులు కట్టే ఆచారములేదు. పైరులు కోసిన తరువాత ఎప్పుడో కడుతారు. ఇంట్లో కూర్చొని వారికి యిష్టము వచ్చినట్లు వ్రాసుకొనడం. అవి తాసిల్దారుకు యిష్టము వచ్చినప్పుడు తణిఖీ చూడటం, రైతు ఖుష్కీపైరు వేస్తే వరిపైరు అని, వరిపైరు వేస్తే ఖుష్కీ అని వ్రాసి యీ విధంగా రైతుకు నోటీసు వచ్చేవరకు తెలియక పోవటం, ఏ పంట వేసినదీ రైతు నిరూపించుకొనేందుకు కాలము కూడా దాటిపోవటం జరుగుతోంది. అందువల్ల రైతు ఏమీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ విషయాలు గురించి కరణాలకు. తాసిల్దార్లకు సక్రమమైన ఉత్తర్వులు పంపాలని. తాసిల్దార్లు సకాలంలో అడంగులు తణిఖీ చేసే ఏర్పాటు చేస్తారని రెవిన్యూ మంత్రిగారికి మనవి చేస్తున్నాను.

మైనర్ ఇర్రిగేషన్ పనుల విషయంలో ద్వంద్వ పరిపాలనగా జరుగుతూ ఉండటంవలన కష్టంగాఉన్నది. రెవిన్యూ అధికార్లు ఎస్టిమేట్సు తయారుచేసినా, అవి P W D స్క్రూటినీకి పంపవలసిన బాధ్యత ఉన్నది. కేవలం కొద్ది ఏరియా ఉన్న వాటిని రెవిన్యూ డిపార్టుమెంటు చేయటం మిగతావి P. W. D. వారు చేయటం పరిపాటి అయిఉన్నది. ఇర్రిగేషన్ అంతాకూడా P W. D. వారికే యిచ్చి ఒక్కరి ఆధిపత్యంక్రిందనే ఉంచితే బాగుంటుంది. జిల్లాకు ఒక మైనర్ ఇర్రిగేషన్ సూపర్‌వైజరును పెట్టారు. ఆయనకు పూర్తిగా తణిఖీచేయడానికి సాధనసామగ్రి లేనందువల్ల జిల్లా అంతటా పర్యటన చేయుటలో ఆలస్యమై. రైతుల కార్యక్రమాలు సకాలములో జరిగేది కష్టముగా ఉన్నది. ఇర్రిగేషన్ పనులన్నీ P. W. D. వారికి ఎప్పగించాలి. లేకపోతే మైనరు ఇర్రిగేషన్ సూపర్‌వైజరుకు అసిస్టెంటు ఇంజనీరు

హోదా యిస్తూ వాహన సౌకర్యం యిచ్చి తొందరగా కార్యక్రమం పూర్తిచేసే ఏర్పాటు చేయుట మంచిదని సూచిస్తున్నాను.

భూసంస్కరణల విషయంలో గౌరవ సభ్యులలో అనేక మందికి అనేకమైన అభిప్రాయాలు ఉన్నవి. భూసంస్కరణలవల్ల అధికాహారోత్పత్తి సాధ్యమని చాలా మంది అభిప్రాయ పడుతున్నారు. భూసంస్కరణలు కూడదని ఎవరు అనరు. కాని పంచలాది, వేలాది ఎకరాలు కలిగి. సేద్యం చేయకుండా బీడులుగా వదలిపెట్టుతున్న వారి విషయం చూడాలని, పంచ ఎకరాల చిల్లర, ఉన్న రైతులు. స్వయముగా చేసుకుంటున్న వ్యవసాయం, ఖండ ఖండాలుగా చేస్తే ఏ విధంగా అధికాహారోత్పత్తి అవుతుంది? అధికాహారోత్పత్తి కావాలంటే విడి విడిగాచేసి బీదరైతులకు—వ్యవసాయంలో అనుభవం. అభిలాష ఉన్నవారికి యిస్తే శ్రద్ధగా చేసుకోగలరేమోగాని, భూమిలేని ప్రతివారికి యివ్వడంవల్ల. ఆ వృత్తిలో నిపుణులుకాని వారికి యివ్వడం వల్ల, సరిగాచేసుకోలేక, భూమిని ఖండ ఖండాలుగా చేసుకోడమే సంభవిస్తుందిగాని అధికాహారోత్పత్తి కాదు. సంవత్సరమునకు రు. 5,600 లు ఆదాయంగాని, భూమికి కొంత పరిమితిగాని పెడతామన్నారు. సంవత్సరానికి రు. 5,600 అంటే నెలకు రు. 450 వరకు అవుతుంది. ఆ ఆదాయం సామాన్య కుటుంబములో బిడ్డలచదువులకు, వివాహాలకు. అకస్మాత్తురోగాలకు సరిపోతుందా — ఆలోచించాలి. వారి భావితరం వారికికూడా కష్టాలు లేకుండా అందరూ సన్యాసులుఅయ్యే పద్ధతిలేకుండా. యీ భూసంస్కరణలు చేస్తారని ఆశిస్తున్నాను.

జిల్లాపరిపాలనలో ఎర్రదారం బిగువు సడలిస్తేగాని సరిగా పనులు జరుగుట లేదు. తక్కావీ ఋణాలు తీసుకొనే విషయంలో రైతుకు ప్రాణం పోతోంది. ఈ విషయంలో ఒక చిన్న సదుపాయం తాసిల్దారుకు చెప్పాను. అప్పుకు పత్రం యిచ్చిన వెంటనే తహశీల్దారు గ్రామాలకు పోయి. అక్కడ కరణం రైతులను కూర్చోపెట్టి అక్కడికక్కడే పరిష్కారం చేసి అప్పు మంజూరు చేసి తాలూకా ఆఫీసుకు రమ్మంటే ఖర్చులు తగ్గుతాయి. కాలహరణం తగ్గుతుంది. కాబట్టి. ఆ విధంగా చేయకుండా, యీ ప్రొసీజర్ అంతా అమలుజరిపితే. వాళ్ళ ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి సులభోపాయంతో. స్వల్పకాలంలో రైతులకు అప్పులు ఇచ్చే సదుపాయం కలిగించాలని నేను ప్రార్థిస్తున్నాను.

తరువాత. ప్రభుత్వంవారు కరువుప్రాంతాలు గురించి చెప్పారు. మా కడప జిల్లా కరువు ప్రాంతంగా ఉన్నది. పేపర్లలో అన్ని జిల్లాల పేర్లు వచ్చాయిగాని. మా జిల్లా పేరు మాత్రం రాలేదు. మా జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించటంగాని, శిస్తు రెమిషన్ ఇవ్వటంగాని చేయలేదు. మా జిల్లాలోకరువు పనులు

వగైరా ప్రారంభించటానికి మంత్రిగారు వెంటనే ప్రయత్నించాలని కోరుతూ, నాకు యీ అవకాశం ఇచ్చినందుకు మీకు నా ధన్యవాదాలు అర్పిస్తూ విరమిస్తున్నాను.

శ్రీ అనంతరెడ్డి (దొమ్మట) :- అధ్యక్షా, రెవిన్యూ మినిస్టర్‌గారు రెవిన్యూ డిమాండ్లు ప్రవేశపెడుతూ కొన్ని విషయాలపై సభ్యుల అభిప్రాయాలు కోరడం జరిగింది కాబట్టి, నేను కొన్ని విషయాలు మీద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకు వస్తున్నాను. మంత్రిగారు భూసంస్కరణలు గురించి, టెనెంట్స్ గురించి, తక్కావకౌలు కరిది భూములగురించి, ఖారీజ్‌ఖాతా భూములగురించి కొన్ని అభిప్రాయాలు అడిగారుగాబట్టి, నేను చెబుతున్నాను. తెలంగాణాలో 1317వ ఫసలీలో బందోబస్తు చేసినారు. అప్పుడు కొన్ని గ్రామాలలో మోకాపై రికార్డులున్నవి. అస్మాన్‌జీలు, గాదేంగూడా, నద్దీనాలా అని కొన్ని రికార్డులు అప్పుడు ఏర్పాటు చేయబడినవి. ఇప్పటికీ అవే ఇంకా అమలులో ఉన్నవి, వాటిని మార్చటానికి యీ ప్రభుత్వం ప్రయత్నించటంలేదు. నిజాం నిరంకుశ ప్రభుత్వంచేత చేయబడిన చట్టాలే ఇంకా అమలులో ఉన్నాయి. ఈ ప్రజాస్వామిక ప్రభుత్వం వచ్చి ఎనిమిది సంవత్సరాలైనా, ఇంతవరకు ఆ చట్టాలను మార్చలేదు. ఇప్పటికి రెండు సంవత్సరాలనుండి తెలంగాణా ప్రజలపై అదనంగా 5 కోట్ల రూపాయల పన్ను కొత్త చట్టాలు తెచ్చి వేసినారు. కాని ఆనాటి నిజాంప్రభుత్వం చేసిన చట్టాలను సవరించటం మాత్రం యీ ప్రభుత్వానికి చేతకాలేదు. తెలంగాణాలో మెట్టభూమి ఎకరానికి ఎనిమిది అణాలనుండి 5 రూపాయలవరకు పన్ను ముఖరర్ ఉన్నది. తరికి పన్నెండు రూపాయలనుండి 20 రూపాయల వరకు ఉన్నది. అది మొదటి ఫసల్‌కు. ఇప్పుడు అదనంగా సర్చార్జి, వ్యాపారపన్ను వేయడంవల్ల ఖుష్కీభూమికి ఎకరానికి మొత్తం 4-10-0 అయింది అన్నమాట. ఇదివరకు 8 అణాలు ఉన్నది. ఇప్పుడు 4-10-0 అయింది అన్నమాట. అదేవిధంగా ఇదివరకు 5 రు .లు ఉండేదానికి ఇప్పుడు 8-2-0 అయింది. వేల ఎకరాలుఉన్న భూస్వామికి, ఎకరానికి ఎనిమిది అణాలనుండి ఒక రూపాయివరకే పన్ను ఉంటుంది. ఎందుకంటే, మొదట బందోబస్తు చేసినప్పుడు, అధికారులకు లంచాలు ఇచ్చి, ఆవిధంగా చేసుకొన్నారు. కాబట్టి ఇప్పుడు, నాలుగువందల ఎకరాలు ఉన్న భూస్వామికూడ ఎకరాకు 10 అణాలు మాత్రమే ఇవ్వవలసి వస్తున్నది. ఎందుకంటే ఇప్పుడు గవర్నమెంటు కంచెలకు, పడావా భూములకు మాత్రమే సర్చార్జి మినహాయింపు చేసింది. అటువంటి భూములు ధనవంతులకు భూస్వాములకు వుంటవి. అటువంటి భూములు పేదవారికి మధ్య తరగతి వారికి వుండవు.

భూసంస్కరణలు తెచ్చి దాదాపు 6 సంవత్సరాలైనది, కాని ఇంత వరకు దానిని అమలుజరుపలేదు. ఎకరం పది రూపాయలు ఉన్న ఖుష్కీభూమిని

పందరూపాయలనుండి నాలుగువందల రూపాయలకు ఇదివరకే భూస్వాములు అమ్మకొన్నారు. తరిభూమిని 500 రూపాయలనుండి వెయ్యి రూపాయల వరకు అమ్ముకొన్నారు. మిగిలినది కూతుళ్ళపేర, భార్యలపేర భూములు విభజించు కొన్నారు. చివరకు ఇప్పుడు జరిగింది ఏమిటంటే, - భూస్వాములకు -మధ్యతరగతి వారికంటేకూడ తక్కువ భూమి ఉన్నదన్నమాట. పందరూపాయలు మాల్‌గుజారీ కట్టేవారి తక్కావి బకాయిలు మాఫీచేస్తామని మంత్రిగారు చెప్పారు. పంద రూపాయలు మాల్‌గుజారి కట్టేవారు ఎవరు? వతనదార్లు, భూస్వాములుకూడ పంద రూపాయలు మాల్‌గుజారీ కడుతున్నారు. దాంట్లో బీదరైతులు, మధ్యతరగతివారు లేరు. ఇటువంటివారు ఎవరైనా తక్కావి అప్పు తీసుకుంటే, వారు ఇంతకుముందే పూర్తిగా బకాయిలు తీర్చేశారు. తెలంగాణాలో పటేల్ పట్వారీలకు జీతం 5రు.ల నుండి 10 రు. మధ్య ఉన్నది. ఈ పది రూపాయలు చాలక, వారు 'సాదర్ ఖర్చు' అని, 'తైహాబంది అని, 'జమాబంది ' ఖర్చులని' యీవిధంగా పందరూపాయలు కాజేస్తున్నారు. వారికి అయ్యే ఖర్చు లంచాలు తీసుకోవటానికి వీలుండేటట్లు ఇదివరకు వున్న రెవిన్యూచట్టాలు చేయబడ్డాయి. అప్పుడు ఉన్న నిరంకుశ ప్రభుత్వంలో, ఆఫీసర్ళు ఆవిధమైన చట్టాలు తీసుకువచ్చారు అన్నమాట. ఇప్పుడు ప్రజాస్వామిక ప్రభుత్వం వచ్చినతర్వాతకూడా, ఇంకా ఆచట్టాలను సవరించకపోవటం చాలా శోచనీయము. పూర్వము తాలూకాకు ఒక తహశీల్‌దారు ఉండేవాడు. ఇప్పుడు ముగ్గురు తహశీల్‌దార్లు ఉంటున్నారు. ఒకరు బకాయి తహశీల్‌దారు, ఇంకొకరు కిన్‌సాలిదేషణ తహశీల్‌దారు. మరియిద్దరు తహశీల్‌లో ఉండే తహశీల్‌దార్లు- ఈ విధంబుగా ముగ్గురు ఉంటున్నారు . పూర్వము తాలూకాకు ఒక తహశీల్‌దార్ ఉండి కూడ హస్తముషా, ఉరుమలో ప్రతి సాలు ఆయన ప్రతి గ్రామం వెళ్ళి తనిఖీ చేసే వాడు. అటువంటివేమీ ఇప్పుడు చేయటంలేదు. అదేతీరు, ఇదివరకు జిల్లాకు ఒక కలెక్టర్, ఒక డిప్యూటీ కలెక్టరే ఉండేవాడు. ఇప్పుడు జిల్లాకు ముగ్గురు డిప్టీలు ఉంటున్నారు. పెద్ద జిల్లా అయితే నలుగురు ఉంటున్నారు. పూర్వం డిప్టీకూడా ప్రతి గ్రామానికి వెళ్ళి-రైతులనుండి పావుతీలు తెప్పించి, తాము స్వయంగా ఖిర్దీకి, ఖాతాకు ఒకజిల్లా చూసేవాడన్నమాట. ఇప్పుడు అటువంటివాటిని చూసే దిక్కు మొక్కు లేదు

శ్రీ కె. వెంకటరావు:- గౌరవ సభ్యుడు ఇప్పుడు చెప్పిన వాటిలో యింత వరకు అయిదు మాటలు ఉర్దూమాటలు ఉన్నవి. వాటికి అర్థము ఏమిటో తెలియలేదు. నేను సమాధానము చెప్పాలంటే కొంచెము నాకు అర్థమయ్యేటట్లుగా చెబితేగదా, నేను వాటికి సమాధానము చెప్పగలను? కాబట్టి కొంచెము నాకు అర్థమయ్యేటట్లు మాట్లాడ వలెననని కోరుతున్నాను.

శ్రీ అనంతరెడ్డి:- మంత్రులు మాట్లాడేటప్పుడు ఇంగ్లీషు మాటలుగూడ మధ్య మధ్య మాట్లాడుతూంటారు. అవి మాత్రము మాకు తెలుస్తున్నవా?

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యుడు చేప్పేది ఏమిటంటే మంత్రులు అప్పు డప్పుడు ఇంగ్లీషు మాటలు ఉపయోగిస్తుంటారు, అట్లామాట్లాడవద్దని అంటున్నారు. అలాగేవారు ఉర్దు మాటలు వాడినారని అంటున్నారు. ఈ విషయములో నేను గౌరవ సభ్యునితో ఏకీభవిస్తున్నాను.

శ్రీ కె. వెంకటరావు:- అవునండి. నేనుకూడ ఆదే మనవి చేస్తున్నాను. నా వద్దనుంచి వారికి సమాధానము కావాలంటే కొంచెము అర్థము అయ్యేటట్లు మాట్లాడమని అంటున్నాను.

శ్రీ అనంతరెడ్డి:- నన్నుమాత్రము ఏమి చెయ్యమంటారు?

మిస్టర్ స్పీకర్:- మీకు అర్థము అయితేనే చెప్పండి. కాకపోతే బాధలేదు.

శ్రీ కె. వెంకటరావు:- అంతేగదా. ఇప్పుడు మీరు రూలింగుఇచ్చారు గనుక ఇక బాధలేదు.

శ్రీ అనంతరెడ్డి:- బంచరాయి పోగులు cost ను గురించి మూడు సంవత్స రముల క్రింద లావునీ సర్టిఫికెట్లు అందరికీ ఇచ్చారు. వాటికి యింతవరకు పట్టాలు యివ్వలేదు. కొన్ని గ్రామాలలో గ్రామోద్యోగులు, గ్రామ పెద్దలు కలసి వాటిని మేపించడము, మరల వారిమీదనే పన్నువేసి వసూలు చేయటము జరుగుతున్నది.

[The Bell was rung]

అధ్యక్షులవారు నాకు టైము అయిందంటున్నారు గనుకఇంతటితో ముగిస్తున్నాను.

శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు ( నరసీపట్నం—జనరల్ ):- అధ్యక్షా! మన రెవిన్యూ మంత్రిగారు ప్రతిపాదించిన రెవిన్యూ డిమాండును నేను బలపరుస్తున్నాను. వారు నిన్నటిరోజున ఇచ్చిన ఉపన్యాసములో భూసంస్కరణలకు సంబంధించిన బిల్లును రాబోవు సెషన్‌లో తప్పకుండ ప్రవేశ పెట్టుతానని చెప్పారు. భూసంస్కరణల విషయములో చాలామంది సభ్యులు చాలా విధములుగ మాట్లాడు చున్నారు. కాని ప్రతిపక్షమువారు ఆ బిల్లును ప్రతిపాదించక పోయినప్పటికినీ, దానిని ఒక ఆలజడిలో పెట్టి ప్రజలలో దుమారము రేకెత్తించడముకోసము యత్నం చేస్తు న్నారు. గాని, నిజానికి అందులో ఉన్న మంచిచెడ్డలు, సదబు, సందర్భము ఏమాత్రము విచారించకుండ చేస్తున్నారు. అయితే రెవిన్యూమంత్రిగారు లౌక్యముగ

రెండు మూడు statements ఇదివరకే ఇచ్చారు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు కూడా ఆ విషయము గురించి statement ఇచ్చారు. ఇక మన కాంగ్రెసువారు చూస్తే వారికి ఇష్టమువచ్చినట్లువారు statements ఇస్తున్నారు. ఇంతమందికూడా అనేక మోస్తరులుగ statements ఇవ్వడమువల్ల ప్రజలలో భయాందోళన గలిగి చాలా బాధ పడుతున్నారు. ఒక్కొక్క కుటుంబానికి సాలుకు 5,400 రూపాయలు నికరాదాయము ఉండేటంత భూమిని ఉంచేటట్లు చేస్తామని మన Cheif Minister గారు చెప్పారు. వంగల్లు కోదండరామిరెడ్డిగారు కూడ కొన్ని విషయాలను గురించి మాట్లాడారు. నేను వారితో ఏకీభవిస్తున్నాను. అయితే మంత్రులైనవారు నెల ఒకటికి జీతముక్రింద వెయ్యి రూపాయలు, House Allowance క్రింద 250 రూపాయలు Conveynce Allowance క్రింద 250 రూపాయలు– మొత్తము 1500 రూపాయలు తీసుకుంటు న్నారు. అది సంవత్సరమునకు 18,000 రూపాయలు అవుతున్నది. పల్లెలలోని కుటుంబాలకు ఒక్కొక్కరికి సంవత్సరమునకు 5,400 అయితే వీరికి 18 వేలు అవుతున్నది. ఇదిగాక అనారోగ్యము సంభవిస్తే, హాస్పిటల్సులో ఉచిత సౌకర్యాలు కూడ కలుగ జేసుకుంటున్నారు. మంత్రులైనవారు ఇంత హెచ్చుజీతము పుచ్చు కుంటూంటే, ఇక పల్లెలలోని కుటుంబాలకు 5,400 రూపాయలు ఏవిధముగ సరి పోతుందో అర్థముకావడములేదు. ఈ విషయములో జిల్లాలలో అనేకచోట్ల అనేక రకములైన ఆందోళనలు బయలుదేరినవి. అందువల్ల యీ ఆదాయమును పరిమితము చేసే సందర్భమును మరొకసారి మంత్రివర్గమువారు పల్లెలలోని వారిని ప్రమాద పరిస్థితులలోనికి దింపకుండా పునరాలోచించ వలసిందిగా మనవి చేస్తున్నాను. నేను యీమాదిరి మాట్లాడుతున్నానని మంత్రిగారు ఏవిధముగాను మనస్సున బాధ కలుగ జేసుకోకూడదని మనవి చేస్తున్నాను.

శ్రీ కె. వెంకటరావు :– జవాబు చెబితే బాధ ఎందుకు?

శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు :– మంత్రిగారు జవాబు చెప్పిన తరవాత మేము బాధపడితే ఆ విషయమును గురించి చెప్పుకోటానికి అతీ, గతీ లేకుండ ఉన్నది. అందువల్ల నేను చెప్పినమాటలు సవ్యముగ అర్థముచేసుకోవాలని అంటున్నాను.

శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ (ఖమ్మం-జనరల్) :– అయితే పల్లెల లోనూ, బస్తీలలోనూ standard of living ఒకే విధముగ ఉంటుందేమో చెబుతారా?

శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు:– లక్ష్మీకాంతమ్మ గారు ఎం. ఎ. చదువుకున్నారు ఆమె D. F. O. గారి భార్య. తల్లితండ్రులు ఎం. ఎ. దాక విద్యను

చెప్పించారు. ఇదిగాక ఆమె ఇప్పుడు M.L.A. అయింది. Night College లో B.L. పరీక్షకు తయారవుతున్నారు. ఇలాంటి సందర్భములో వారికి ఇతరుల కష్టములతో పనిలేదు. కాని పిల్ల, జెల్ల ఉన్నవారు యీ ఆదాయము ఖర్చులకు చాలక ఎంత ఇబ్బందిపడుతారోకూడా అందరు ఆలోచించవలసిఉంటుంది. నాకు, రెవిన్యూ మినిస్టరుగారికి, పిల్లలు లేరుగనుక, వారికి, నాకు అంతగాబాధ ఉండదు. ఒక్కొక్క చోట పల్లెలలోనే ఒక్కొక్క కుటుంబములో ఎన్నెన్ని కష్టములు ఉంటూఉంటాయో, ఒక్క పర్యాయము ఆలోచించారా అని అంటున్నాను. పట్టణములలో ఎక్కువగ ఖర్చులుఉంటాయి గనుక, ఎక్కువఉండాలని, పల్లెలలో అంతగా ఖర్చులు ఉండవు గనుక, వారికి ఖర్చువేరు అవి అనుకోవడము చాలా పొరపాటు. పట్టణములలో ఉన్నవారుకూడ పల్లెలనుంచి వెళ్లినవారే. ఈ విషయములు మాత్రము జ్ఞాపకము చేసుకోవాలి. సరే. ఆ బిల్లువచ్చినప్పుడు ఆ విషయములలోనికి లోతుగా పోవచ్చు.

ఇక Survey and Settlement విషయము తీసుకుందాము. ఎస్టేటుగ్రామాలతో Survey and Settlement జరుగుచున్నది. యీ విషయమునుగురించి రాజేశ్వర రావుగారుకూడా మాట్లాడారు. మా నియోజకవర్గములో సర్వేవారు పనిచేస్తున్నారు ప్రతిదానికి లంచముతప్ప వేరుపని వీరికిలేనట్లున్నది. మా తాలూకాలో పెద్దగుమ్మలూరు ఎస్టేటులో వేంపాడు, నెల్లిపూడిగ్రామాలు ఉన్నవి. అక్కడ ప్రజలుచాలా అమాయకులు. ఈ సర్వేచేసే Surveyors రాళ్లుపాతడములో పాతవలసినచోటు తప్పించి, నాలుగుగజములు అటువైపు ఒకసారి, నాలుగుగజములు ఇటువైపు ఒక సారిపాతి, డబ్బుకొరకు బేరముపెట్టుతున్నారు. చేనుగల ఆ ఆసామీలను బెదిరించి డబ్బుకాజేస్తున్నారు. నీకుకొంత భూమికలుపుతాను, నాకేమిఇస్తావుఅని బేరాలు పెట్టుకుని ఇటువీడిదగ్గర అటువాడిదగ్గర డబ్బుకాజేయడము ప్రారంభిస్తున్నారు. ఈ లంచగొండితనమును అరికట్టించటానికి ప్రభుత్వము ఏదైనా మార్గముకనిపెట్టితే, అక్కడ అమాయకరైతులు చాలాసంతోషిస్తారు. ఈ విషయము నానోటీసుకు రాగానే నేను పిటిషను పెట్టించాను. అదేమాదిరి మల్లవరం అనే గ్రామం ఉన్నది. ఒకమంగలివానికి ఇచ్చిన స్థలమును కొలిచేటప్పుడు రాయితప్పుగాపాతి, లంచము అడిగాడట. ఆ మంగలి నావద్దకువచ్చి చెప్పుకున్నాడు. ప్రతివాడిని యీ విధముగ బాధపెడుతూఉంటే నేను ఎన్నిపిటిషనులని పెట్టించను? ఆ మల్లవరంగ్రామములో Development works కొరకు కొంతస్థలము ఆ మంగలివానికి యిచ్చారు. రోడ్డు కూడ వేసుకున్నారు. రాయి పాతవలసినచోట పాతకుండా తప్పుస్థలములో పాతి, డబ్బులంచము అడిగితే, అర్థము ఏమైనాఉన్నదా? ఆ మంగలి బీదవాడు. డబ్బుయిచ్చుకోలేక నావద్దకువచ్చాడు. ఇలాటివి ఎన్నోకేసులు ఉన్నవి. పెదగుమ్మలూరు చెరువుఅని ఉన్నది. ఆ చెరువు విషయములో ఇప్పటికి అయిదు సంవత్సరముల

నుంచి అక్కడ Proprietor కొంతపొలము occupy చేసుకొన్నాడు. నేను అప్పుడు రివెన్యూ మినిష్టరుగా ఉన్న చంద్రమౌళిగారితో చెప్పాను. ఆయన టూరుకు వచ్చి ఆ ప్రదేశము చూచారు. దానిమీద నా పిటిషను కలెక్టరును విచారించమని పంపించారు. కలెక్టరు విచారించి ఆ Proprietor 20,25 ఎకరాలు అక్రమంగా occupy చేసుకున్న మాట నిజమేనని, ఆయనను evict చేయటానికి ఆర్డరు ఇచ్చాడు. దానిమీద ఆ Proprietor కలెక్టరువద్ద పిటిషను పెట్టి stay order ఆ కలెక్టరువద్దనే సంపాదించాడు. ఇప్పుడు క్రొత్తగా వచ్చిన సర్వేయరు అదివరకు ఉన్న రాయిని తీసి యింకా కొంచెము అవతల పాతించాడు. దానివల్ల చినగుమ్మలూరు, పెట్టుగోడపల్లి, కొత్తూరు, భీమవరం యీ గ్రామాల రైతుల యొక్క హక్కులు affect అవుతున్నవి. గనుక వాళ్లు ఏమి చేయటానికీ తోచక కష్టపడుతున్నారు. ఈలోగా ఆ Proprietor ఎకరము ఒకటికి 1500 రూపాలచొప్పున కొనుక్కొనమని రైతులతో బేరము పెట్టాడు. 500 రూపాయలు ఎకరము ఒకటింటికి అడ్వాన్సు క్రింద పుచ్చుకుంటున్నాడు. ఈ విధముగ ఆ అమాయకపు రైతులు ఆ భూమి ఆయనదే ననుకుని ఎడ్వాన్సులు యిచ్చారు. ఇదివరలో అది పట్టాభూమి కాదని ఆర్డరు ఇచ్చిన కలెక్టరే, అది యిప్పుడు పట్టాభూమి అని stay ఆర్డరు ఇస్తూ, ఈ విషయమును Settlement Officer ను విచారించమని ఉత్తరువు చేశారు. అది జరిగి యిప్పటికి సుమారు అయిదు సంవత్సరములు అయింది. కాని దీనివల్ల వచ్చే ప్రమాదము ఏమిటో మంత్రిగారిని ఆలోచించమని మనవి చేస్తున్నాను. కాబట్టి Survey Department వారు యీలాంటి లంచగొండితనమునకు పాల్పడకుండా, రాళ్లు తప్పుగా పాతకుండా వుండగలందులకు, తగిన చర్య తీసుకుంటూ ఇవి ప్రభుత్వము నోటీసుకు వచ్చినవి గనుక తప్పుచేసినవారిని dismiss చేయవలసి ఉంటుందని ప్రభుత్వం మందలిస్తే, కొంతవరకు పరిస్థితులు చక్కబడుతాయని నా విశ్వాసము.

తరువాత Estates Abolition విషయము ఒకటి ఉన్నది. ప్రభుత్వమువారు యీ Estates అన్నీ స్వాధీనపరుచుకున్నారు. స్వాధీనము చేసుకున్న జమీందార్లకు నష్టపరిహారము క్రింద డబ్బుకు బదులు Bonds ఇస్తామని మంత్రిగారు చెబుతున్నారు. Compensation ఇచ్చేది త్వరలో ఇస్తే, అప్పులు ఉన్న జమీందార్లు అప్పులను తీర్చుకుని అందరిలో అప్పులు తీర్చాడు అని మర్యాద సంపాదించుకుని పరపతి పోగొట్టుకోకుండా విలువకొని ప్రపంచములో తలెత్తి తిరగటానికి చూస్తున్నారు. ఇప్పుడు ఇవి బాండ్ల రూపములలో ఇస్తే, అవి మార్చుకొనటానికి, అప్పుల క్రింద ఇస్తే తక్కువ ఖరీదు కట్టుకుని వాటివల్ల వ్యాపారస్థులు బాగుపడుతున్నారు. కాబట్టి కాంపెన్సేషన్ యివ్వటానికి ఇకమీదట ఏ మాత్రముకూడ ఆలస్యము లేకుండ, వీలుగా వుంటే మరొక బిల్లు పెట్టి అయినా త్వరలో బాండ్ల రూపములో కాకుండా, డబ్బు రూపములో యివ్వాలని రెవిన్యూ మంత్రిగారికి మనవి చేస్తున్నాను.

శ్రీ కె. వెంకటరావు:— నేను చెప్పినది అర్థముచేసుకోకుండా రాజుగారు ఏమేమో మాట్లాడుతున్నారు. 20 లక్షలు, ఆ మాదిరిగా పెద్దపెద్ద మొత్తములు ఇవ్వవలసిన జమీందార్లకు బాండ్లరూపములో ఇస్తాము, చిన్నచిన్న మొత్తములు అంటే, 3 వేలు, అయిదువేలు యీ మాదిరి మొత్తములను డబ్బు రూపములోనే ఇస్తామని నేను నిన్నన్నే చెప్పాను. అది బహుశ రాజుగారు వినలేదనుకుంటాను. అందువల్ల నేను చెప్పినది వినకుండా మాట్లాడితే ఏమి ప్రయోజనము?

శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు:— నేను ప్రత్యేకంగా అందుకోసమని చెప్పడంలేదు. General గా కూడా యిది అన్యాయమని మనవిచేస్తున్నాను. మైనారిటీలకు రక్షణ యివ్వాలంటున్నాము, Minorities అంటే కులతత్వాలు. కులాలు అనేభావంలో అందరూ అనుకుంటున్నారు. మరివారుమాత్రం మైనారిటీస్‌కాదా? కులాలు ఉండకూడదని మన భారత ప్రభుత్వం, మనంకూడా అంటున్నాము. కులాల పేరుతో చిన్నచిన్న కులాలవారిని నాశనం చేస్తున్నామంటే అది minorities ను నాశనం చేస్తున్నట్లు కాదాయని మిమ్ములను ప్రశ్నించవలసిన అవసరం వచ్చింది.

మిస్టర్ స్పీకర్:— మీరు నాతో మాట్లాడితే మంత్రిగారు జవాబుచెప్పరు. కాబట్టి వారితోనే మాట్లాడండి.

శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు:— అధ్యక్షులవారిద్వారా మంత్రిగారికి చెబుతున్నాను. మంత్రిగారు పేదవారికి ధనరూపంలో ఇస్తామన్నారు. అది సాధ్యమైనంత త్వరలో ఇచ్చినట్లయితే, పాత అప్పులు తీర్చుకునే ప్రయత్నం చేస్తామని మనవి చేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందులకు అధ్యక్షులవారికి ధన్యవాదాలు అర్పిస్తూ నేను సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి (డోర్నకల్):—అధ్యక్షా, రెవిన్యూ మంత్రిగారు ప్రవేశ పెట్టిన డిమాండును బలపరుస్తూ తమద్వారా కొన్ని సూచనలు చేస్తున్నాను. భారతదేశం వ్యవసాయదేశమనేది నిర్వివాదాంశము. మన ఆంధ్రరాష్ట్రం ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడిఉన్నది. వ్యవసాయం మీదఆధారపడినది. జనాభా దిన దినాభివృద్ధిగాంచు చున్నది. వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయడానికి ఏ యే మార్గాలను అనుసరించాలో గమనించి భూసంస్కరణల బిల్లును వచ్చేసమావేశంలో ప్రవేశ పెడతామని మంత్రిగారు హామీ యిచ్చారు కనుక ప్రభుత్వానికి నా అభినందన లర్పిస్తున్నాను. ఏ సమస్య వచ్చినప్పటికిన్నీ దానికి for and against arguments తప్పకుండా వుంటాయి.

*(Smt. T. Lakshmikanthamma in the Chair)*

భూసంస్కరణలను ఏ రీతిగా, ఏ ప్రాతి పదికపై తీసుక రావాలో మనం ముఖ్యంగా గమనించ వలసిన అవసరం ఉన్నది. కొంతమంది మిత్రులు " ఇతర రంగాలలో భూసంస్కరణలు ప్రవేశ పెట్టకుండా ఒక భూమి విషయంలోనే సంస్కరణలు ప్రవేశ పెట్టటం న్యాయమా?" అని అడుగుతున్నారు. కాని ఎక్కువ జనాభా భూమిపై ఆధారపడి ఉన్నారు. కనుక ముందుగా భూసంస్కరణలను మొదటి మెట్టుగా గైకొని. తరువాత క్రమేణ ఇతర రంగాలలో సంస్కరణలు ప్రవేశపెట్టితే అందులో దోషము ఏమీలేదని నేను ప్రత్యేకంగా మనవి చేస్తున్నాను. భూసంస్కరణలను ప్రవేశపెట్టే పూర్వం దానిలోని మంచి చెడ్డలను దీర్ఘంగా విచారించవలసియున్నది. కాని దానిని రాజకీయ ప్రాబల్యంగా (political sloganగా) తీసుకొని విమర్శించడం ప్రతిపక్ష సభ్యులకు అలవాటయిపోయింది. అయితే Treasury Benches లోని కొంతమంది కూడా అదే ధోరణిలో మాట్లాడుతున్నారు. కాని ఏసంస్కరణలను తీసుకవచ్చినా గట్టి పునాదులపై తీసుకుని రావలసినదిగా కోరుతున్నాను. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి ఉత్పత్తిని పెంపొందించడానికి ఏయే కార్యక్రమాలు అవసరమో ఆలోచించాలి. భూమిపై ceilings పెట్టవలెనా, వద్దా, future holdings పై ceiling పెట్టవలెనా, లేకపోతే ప్రస్తుతంవున్న holdings పైన ceilings పెట్టాలా అనే విషయాలు సాకల్యంగా విచారించవలసి యున్నది. Ceilings పెట్టాలని ప్రతిఒక్కరు అభిప్రాయ పడుతున్నారు. Future holdings పైననే ceilings పెట్టాలని చెప్పేవారు కొందరున్నారు. కాని present holdings పైన ceilings పెట్టుతూ వ్యవసాయాభివృద్ధి దెబ్బతినకుండా ఆలోచించాలని మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

ఈ భూసంస్కరణలు ప్రవేశ పెట్టడంలో కొన్ని చిక్కులు కూడా ఉన్నాయి. ఒక ప్రాంతానికీ మరొక ప్రాంతానికీ భూమి, నీటి వనరులలో తేడాలున్నాయి. కనుక యీ విషయాలన్ని దీర్ఘంగా ఆలోచించవలసియున్నది.

తెలంగాణాలో యిదివరకే భూసంస్కరణలు ప్రవేశ పెట్టబడినాయి. వీటిని ఆంధ్ర ప్రాంతానికి కూడా ఎంతవరకు వర్తింపచేయవచ్చు, వాటిలోని లోటుపాట్లు ఏమిటి అనే విషయం ఆలోచించాలి.

Personal cultivation గురించి మంత్రిగారు సెలవిచ్చారు. 'personal cultivation' అనేదానికి definition ఇవ్వవలసియున్నది. భూమిగలవారు నాగలి పట్టుకొని దున్నితేనే స్వంత సేద్యమవుతుందా. లేక కూలి జనాన్ని, పాలేరులను పెట్టి పనిచేయించుకోవచ్చునా అనే విషయాన్ని గమనించాలి.

కుటుంబంలోని వారంతా తమ వ్యవసాయం తామే చేయాలంటే చాలాకష్టం కాబట్టి పాలేరులపై ఆధారపడి వ్యవసాయం చేయడం శ్రేష్ఠమని హైదరాబాదు చట్టంలో ఏర్పాటుచేశారు. హైదరాబాదు టెనెన్సీ చట్టంలో 47వ సెక్షనులో చాలా లోపాలున్నాయి. లోగడ హైదరాబాదు ప్రభుత్వం Land Alienation Act తీసుకునివచ్చినప్పుడు 47వ సెక్షను ప్రకారం డిప్యూటీ కలెక్టరునుంచి permission తీసుకోవాలని ఏర్పాటుచేశారు. కాని ఆరీతిగా అమలు జరుగలేదు. ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానిని పూర్తిగా అమలులోనికి తీసుకుని రావాలని ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తున్నది. దానిని గురించి రైతులలో పెద్ద ఆందోళన ఉన్నది. కాబట్టి 47వ సెక్షనును పూర్తిగా తీసేసి ఆంధ్ర ప్రాంతంలో ఉన్నట్లుగానే డిప్యూటీ కలెక్టరు నుంచి పర్మిషన్ తీసుకోవాలనేది లేకుండా చేయాలని కోరుతున్నాను. ఖాస్రా పహాణీలమీద రైతులకు ఇచ్చిన హక్కులను కాపాడాలి. Registration fees ను మాత్రం వసూలు చేసుకొని దానిని సమన్వయం చేస్తారని ఆశిస్తున్నాను. ఇప్పుడు అనేకమంది రైతులు కొత్త భూములను కొనుక్కున్నారు. మొత్తం డబ్బంతా చెల్లించినారు. వాటిని ఖాస్రా పహాణీలలో లిఖించడం జరిగింది. ఇప్పుడు ఖాస్రా పహాణీలు రద్దయిపోయినాయి. మళ్లీ permission తీసుకోవాలని పెట్టినట్లయితే భూస్వాములకు మరల డబ్బు యిచ్చే ఏర్పాటు చేసినవారం అవుతాము. కాబట్టి ఖాస్రాపహాణీలను ఒప్పుకొని ప్రభుత్వానికి రావలసిన రిజిష్ట్రేషను ఫీజు రాబట్టుకొని, 7వ సెక్షనును (డిప్యూటీ కలక్టరునుంచి పర్మిషన్ తీసుకోవాలనేదానిని) రద్దుచేస్తారని ఆశిస్తున్నాను.

ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో శిస్తులో చాలా తారతమ్యాలున్నాయి. కాబట్టి Integration of Laws ప్రకారంగా వీటన్నింటినీ సమన్వయంచేసి క్రమేణా ఒక స్థాయికి తీసుకురావాలని కోరుతున్నాను.

తెలంగాణాలో లావుణీ రూల్సులోని sections ఒక దాని కొకటి విరుద్ధంగా ఉన్నాయి. వాటివల్ల ఒక సెక్షనుప్రకారం ఒకవ్యక్తికిహక్కు కలిగితే, ఇంకొక సెక్షను ప్రకారం ఇంకొక వ్యక్తికి హక్కు కలిగే అవకాశాలున్నాయి. కాబట్టి వాటిని వెంటనే సవరించి తగాదాలను దూరం చేయడానికి ప్రయత్నం చేయాలని మనవి చేస్తున్నాను.

మంత్రిగారు గత సంవత్సరం తనఉపన్యాసంలో జిల్లాపరిపాలనలోని అవకతవకలు, లంచగొండి తనం అనేవి పురాతనమైనసమస్యలేనని చెప్పినట్లు నాకుజ్ఞాపకం ఆ సమస్యలతో అదేరీతిగా బాధపడవలసినదేనా లేక వాటిని రూపుమాపడానికి గట్టి కూర్పులు ఏవైనా తీసుకువస్తారా యని అడుగుతున్నాను. జిల్లా పరిపాలనలో లంచగొండి తనం రోజురోజుకు ఎక్కువ అవుతున్నది. మంత్రిగారు ఇదివరకు Progressive legislation తీసుకుని రావడానికి ప్రయత్నం చేశారు. వారు మేధావులు

అనే ప్రతీతి ఉన్నది. కాని లంచగొండి తనాన్ని నిర్మూలించడానికి ఏవిధమైన మార్పులూ చేయుటలేదు. పురాతన పద్ధతుల ప్రకారం ఇదివరకు ఏర్పాటు చేసుకొన్న రీతిగానే ప్రభుత్వం నడుపబడుతున్నది. కాని ఇప్పటి అవసరాలకు తగిన విధంగా మార్పులు చేయుటలేదు. అవినీతిని లంచగొండితనాన్ని నిర్మూలించడానికి ఏమీ ప్రయత్నాలు చేయడం లేదు.

ఇంతేకాక, సీరుడీ, సేత్‌సింధీల విషయంలో వారికి సరైన వేతనాలు ఏర్పాటు చేసి మంచి అవకాశాలను కల్పించాలని మనవి చేస్తున్నాను. అన్నిటికంటె వంశపారంపర్యంగా వచ్చుచున్న పటేల్, పట్వారీ, వతన్‌దారీ తనం వంటి వాటిలో చాలా మార్పు రావలసి ఉన్నది. లంచగొండితనం చాలా పెరిగిపోయింది. క్రమంగా ఆస్థానములను ప్రభుత్వ ఉద్యోగస్తులు ఆక్రమించునట్లు చేయాలని నేను మనవి చేయుచున్నాను.

తాలూకా, జిల్లా హెడ్‌క్వార్టర్సును మార్పు చేయాలని కొందరు మిత్రులు సూచించినారు. అలా చేసిన ప్రభుత్వంపై పెద్ద భారం పడును. కనుక మార్పు కావలసిన గ్రామాలు, తాలూకా జిల్లా బౌండరీస్‌లోచి న్న చిన్న మార్పులు చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి, చేసుకోవచ్చును. ఆ కమిటీవారు ఏ గ్రామాలను ఏ తాలూకాలో లేక ఏ జిల్లాలో ఉంచిన ఎక్కువ సౌకర్యంగా ఉండునో విచారించి చేయునట్లు చూడాలని నేను మనవి చేయుచున్నాను.

*శ్రీ బి. నరసింహారెడ్డి ( సూర్యాపేట-జనరల్ ): అధ్యక్షా! భూసంస్కరణల విషయంలో మన ఆంధ్ర ప్రభుత్వవైఖరి చాలా విచిత్రంగా మారుచున్నది. భూసంస్కరణల ప్రాధాన్యం గురించి, ఆ విషయంలో వస్తున్న వివాదములను, అనుమానములను దూరంచేస్తూ గౌహతి కాంగ్రెసు తీర్మానించింది. దేశ ఆర్థికవిధానంలో దానికి ఉన్న కీలక ప్రాధాన్యమునుగురించి ప్లానింగు కమిషన్‌గూడ నొక్కిచెప్పింది. దానిని మన రాష్ట్రంలో ప్రభుత్వ పక్షంలోనే కొంతమంది వ్యతిరేకించుచున్నారు. వాదోపవాదములతో దాదాపు రెండు సంవత్సరములు గడిపినారు. భూసంస్కరణలు ప్రవేశపెట్టుటకు నాంది చర్యలుగూడ తీసుకొనబడలేదు. భూసంస్కరణలు అమలుజరపాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశమును ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అపహాస్యంచేసినట్లే కనబడుచున్నది. భూసంస్కరణ అంటే ఎప్పుడో సంస్కరణ జరిగిన తరువాతనే "దున్నేవాడికే భూమి"అనుట కాదు. తెలంగాణాలో ప్రజలు మహా పోరాటములు సాగించి బూర్గుల రామకృష్ణరావుగారి పరిపాలనాకాలంలో చట్టరీత్యా కొన్ని హక్కులు సంపాదించుకొన్నారు. ఆ హక్కులప్రకారం ఈనాడు రైతుల చేతులలో కొన్ని లక్షల ఎకరములు బంజరుభూమి ఉన్నది. కొండా వెంకట

రెడ్డిగారు వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు సుమారు 13 లక్షల ఎకరములు బంజర భూములు పంచినట్లు ఒకసారి స్వయంగా చెప్పినారు. ఈ బంజరు భూముల, కౌలు భూముల విషయంలో భూసంస్కరణలు రైతులకు రక్షణను చేకూర్చాలి. భూ సంస్కరణలకు నాందీచర్యగా రైతులు సేద్యం చేసుకుంటున్న బంజరు భూములకు శాశ్వతపట్టాలను ఇవ్వవలయును. ఒక సీలింగుపెట్టి ఆ పైన ఉన్న భూములను తీసి బీదరైతాంగమునకు పంచాలన్నది భూసంస్కరణల యొక్క ప్రధాన అంశం. పేరుకు భూసంస్కరణలు అమలుచేసినామని భూస్వాములు బినామి పట్టాలు అన్నీ చేయించు కొన్న తరువాత ఒక ఆర్డినెన్సు ప్యాసుచేసి రైతులకు పంచుటకు భూమి లేకుండ చేసిన ఆ సంస్కరణల ఫలితముండదు. ఆ విధంగా చేయడం భూసంస్కరణల నినాదమునే అవహాస్యము చేసినట్లవుతుంది.

జిల్లాలలో అడ్మినిస్ట్రేషన్ సరిగా జరగడంలేదు. నా నియోజక వర్గములో Small Savings ఉద్యమ ... అమలుచేయుటకు మంత్రి నర్సింగరావుగారే అక్కడ ఒక పబ్లిక్ కమిటీని ఏర్పాటు చేసినారు. వివిధ రాజకీయ పక్ష ప్రతినిధులకు అందులో అవకాశం కల్పించారు. కాని అక్కడ ఉన్న బాధ్యతగల అధికారులు ఆ పబ్లిక్‌కమిటీ లతో సంప్రదించడం లేదు. ఆ targets ను సాధించుటకు పద్ధతులను వారితో కలిసి నిర్ణయించడంలేదు. వారికి ఇష్టంవచ్చినట్టు, పటేలు, పట్వారీల ఆధారంతో, ఎకరమునకు నిర్ణయించిన రేటు ప్రకారం కాకుండా వసూలు చేస్తున్నారు. అలాగే కౌలుదార్ల విషయములో భూస్వాములు జోక్యం కలుగజేసుకున్నప్పుడు కౌల్దారు వాదన వినకుండనే భూస్వామికి అనుకూలముగా తీర్పులు చేయడం జరిగింది. సూర్యాపేట తాలూకాలో వెంపటి అనే గ్రామము ఉన్నది. అక్కడ విసునూరి రామ చంద్రారెడ్డి తమ్ముడు భూస్వామిగా ఉన్నాడు. ఆయనభూమి హరిజనుల ఇండ్ల స్థలములకు చాలా అనుకూలముగా ఉన్నదని, ఆభూమి ఇండ్లకుగాను ఇవ్వవలయునని నిర్ణయం జరిగినప్పటికి, తాహశీల్దారును కూడగట్టుకొని మొత్తంగా వాయిదా వేయిస్తూ కొద్ది చిల్లర రైతులకు మాత్రం మరల సిఫార్సు చేయడం జరిగింది. డిస్ట్రిక్టు అడ్మి నిస్ట్రేషన్ యావత్తూ అక్కడి కాంగ్రెస్ నాయకుల కనుసన్నలలోను, అక్కడి భూస్వాముల ప్రాబల్యం క్రిందను నడుస్తున్నది. అక్కడ ఉన్న తహసీల్దార్లు వగైరా ఉద్యోగులు అక్కడి కాంగ్రెస్ నాయకులకు, భూస్వాములకు లొంగిపోవడం జరుగుచున్నది. ఒకే కేసులో కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకున్న యెడల చట్ట ప్రకారంతీర్పులు జరుగుటలేదు. అన్నారం అనేగ్రామములో 10, 15 సంవత్సరముల నుండి అక్కడి రైతులు చెరువునుండి నీటిపారకం చేసుకుంటూ ఉండేవారు. కాని కొందరు కాంగ్రెస్ వాదులు ఫిర్యాదుచేసి ఆనీటిని గూడ ఆపుచేయించ గలిగినారు.

ఉలాపురం అనే గ్రామములో కూడా కౌలుదారుయొక్క వాదన వినకుండ భూస్వామికి అనుకూల తీర్పు ఇవ్వబడింది. ఈ విధంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, భూస్వాములు రైతులకైనందిన వ్యవహారములలోను పరిపాలనా విధానంలోను జోక్యము కలుగ చేసుకుంటున్నారు.

ఇది భూస్వాముల ప్రాబల్యముతో అక్కడవున్న కాంగ్రెస్ పెద్దల ప్రాబల్యముతో నడుస్తున్న ఎడ్మినిష్ట్రేషన్‌గా కన్పిస్తున్నది. కాని స్వతంత్రముగానడుస్తున్నదిగా మాత్రంలేదని మనవిచేస్తున్నాను. చేదోలు చెఱువు మరమ్మత్తు చేయటానికి డబ్బు మంజూరు అయినప్పటికీ, ఇంతవరకు అమలు జరగలేదు. ఇటువంటి కేసులు చాలా వున్నాయి. ఎడ్మినిష్ట్రేషన్ అనేది రూల్సు అండ్ రెగ్యులేషన్ ప్రకారం నడువకుండా కొని శక్తుల ప్రాబల్యము వల్లనే నడుస్తున్నదని నేను మనవి చేస్తున్నాను.

శ్రీ ఎ. చిదంబరరెడ్డి (పెనుకొండ) :- అధ్యక్షిణీ!..... .

మిస్టర్ చేర్మెన్:—ఒక స్త్రీ అధ్యక్షస్థానములో వున్నప్పుడు, అధక్ష్య అనవలెనా, మహిళాధ్యక్ష అనవలెనా? అనే సందేహమును గౌరవసభ్యులు చాలామంది వెలిబుచ్చారు. ఆస్థానమును ఎవరు అలంకరించినా ఎట్టి విచక్షత వుండదు కనుక అధ్యక్ష అనే సంబోధించాలని నేను మనవిచేస్తున్నాను. ఒకసారి శ్రీమతి విజయలక్ష్మి పండిట్ అధ్యక్షస్థానములో వున్నప్పుడు చైర్‌మన్ అనవలెనా చైర్‌వుమన్ అనవలెనా అనే సందేహం వచ్చినప్పుడు ఆవిడ చైర్‌మన్ అనవలెననే తీర్మానించినది.

శ్రీ బి. కేశవరెడ్డి :— అధ్యక్ష అనేపదం స్త్రీలింగమును సూచిస్తుందా? లేక పురుషలింగమును సూచిస్తుందా?

మిస్టర్ చేర్మెన్:— ఈ స్థానములో ఉన్నవారిని "అధ్యక్ష" అంటేనే బాగుంటుంది.

శ్రీ ఎస్. కె. వి. కృష్ణావతారం (తాడేపల్లిగూడెం — జనరల్).— అధ్యక్ష అనిఅంటేనే బాగుంటుంది. Man inculdes, "woman" also. ఆడవారు చైర్‌మన్‌గాను, వైస్‌చైర్‌మన్‌గా వున్నప్పటికి చైర్‌వుమన్ వైస్‌చైర్‌వుమన్ అని పలుపటంలేదు. కనుక అధ్యక్షస్థానములో స్త్రీ వున్నప్పటికీ 'అధ్యక్ష' అని పిలిస్తేనే బాగుంటుంది.

శ్రీ వి. కూర్మయ్య (గుడివాడ—రిజర్వుడు) :— మీ Previous ruling తో [illegible] అయింది. అధ్యక్షిణి అనవలని మీరు చెప్పారు.

మిస్టర్ ఛైర్మెన్ :- ఆ పదము Correct అయితే కావచ్చు కాని ఈ స్థానములో వున్నప్పుడు "అధ్యక్షా" అని పిలవాలనే చెబుతున్నాను.

శ్రీ ఎ. చిదంబరరెడ్డి .- అధ్యక్షా! రెవిన్యూ మంత్రిగారు ప్రతిపాదించిన ఈ పద్దును నేను బలపరుస్తూ, కొన్ని విషయాలను వారిదృష్టికి తేదలచుకొన్నాను, గత రెండురోజులనుండి జరిగిన చర్చలలో సభ్యులు తమతమ అభిప్రాయాలను వెల్లడించారు. కరువు కాటకాలతో ప్రళయతాండవమాడే మెట్టప్రాంతమునుండి వచ్చిన నేనుకూడా మంత్రిగారికి కొన్ని సూచనలను మీద్వారా చేయదలచు కొన్నాను.

ప్రథమంగా మైనర్ ఇరిగేషన్ విషయముపై మాట్లాడుతాను. మొత్తం ఆంధ్రప్రదేశ్ అంతటిలోను, శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం జిల్లాలలో మైనర్ ఇరిగేషన్ చెఱువులు ఎక్కువగా వున్నాయి, ఈ సంవత్సరం శ్రీకాకుళం జిల్లాకు ఎక్కువ డబ్బు ఇచ్చారు. కాని అనంతపురం జిల్లాకు ఎంతఇచ్చారో, చిత్తూరులో ఎంత ఖర్చుపెట్టారో మంత్రిగారు ఏమీ చెప్పలేదు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో దాదాపు 12 వందల చెఱువులను మరమ్మత్తు చేయవలసి వుంటుందని రెవెన్యూశాఖామాత్యులు గడచిన సంవత్సరము తెలియజేశారు. కాని గడచిన సంవత్సరములో అనంతపురములో మరమ్మతు చేసిన చెఱువులసంఖ్య అతి స్వల్పమని మంత్రిగారికి తెలియజేస్తున్నాను. పెద్దపెద్ద ప్రాజెక్టులకు కోట్లకొలది రూపాయలను ఖర్చుచేయవచ్చు. వాటిని మా మెట్టప్రాంతాల వారముకూడా వద్దని చెప్పటములేదు. కృష్ణదేవరాయల కాలమునాటి చెఱువులు పూడిపోయి, తెగిపోయి వాటికి నీరువచ్చే ఆధారములు తగ్గిపోయినాయని తెల్పుతున్నాను పెద్దపెద్ద ప్రాజెక్టులకు ఖర్చుపెట్టేదానిలో 10% అయినా మైనర్ ఇర్రిగేషన్ చెఱువులకు ఖర్చు ఖర్చుపెట్టాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. 'రాయలసీమ' అని చెపితే మంత్రిగారికి కోపమురావచ్చును. అయినా నేను అదేవిధంగా చెప్పదలచుకున్నాను. రాయలసీమలో, మెట్టప్రాంతములలో మైనర్ ఇరిగేషన్ పనులు చాలాఉన్నాయి. ఆ ప్రాంతములను బాగుపరచి, అభివృద్ధిలోనికి తీసుకువచ్చినట్లయితే అక్కడి ప్రజలు కరువు కాటకాలకు గురికాకుండా కోస్తాజిల్లాలతో సమానముగా వుండగలుగుతారని మనవి చేస్తున్నాను.

ఏటికాలవల విషయములో మంత్రిగారు ఒకప్పుడు సహాయము చేశారు. అటువంటివి కడపజిల్లాలోను యింకా అనేకం అన్ని జిల్లాలలోను వున్నాయి. మేము ఈ కాలవలను ఎలా త్రవ్వుకుంటున్నామో మాకు ఎంత రెవెన్యూరేటు వున్నదో కోస్తాజిల్లాలలోని సోదరులు చూస్తే పరిస్థితి వారికి అర్థం అవుతుంది. మాకు జరుగు

తున్న అన్యాయమును వారు గుర్తించగలరు. కొన్నిచోట్ల 2, 3 మైళ్ళలో 15 అడుగుల లోతున కాలువత్రవ్వి ఎండాకాలములో నీళ్ళు తీసుకొంటున్నాము. మాకు వున్న రేటు, కృష్ణగోదావరి జలాలను తీసుకుంటున్నవారి రేటుకంటె కూడా అధికము గావుంది. అది న్యాయమైన విషయంకాదని, మాకు సహాయంచేయవలసిన బాధ్యత మంత్రిగారిపై వుందని వారికి మీద్వారా తెలియజేస్తున్నాను.

చాలామంది సభ్యులు భూసంస్కరణల గురించి మాట్లాడారు. భూసంస్కరణలు వద్దని మేము చెప్పుటలేదు. ఆసమస్యను, ఆసంస్కరణల గురించి ఒక్కపార్టీ వారే మాట్లాడుటవల్ల కాంగ్రెసువారు వాటికి వ్యతిరేకులని అర్థంకాదు. తిమ్మారెడ్డి గారు భూసంస్కరణలురాకుండాచూస్తున్నారుఅనేవాదన సరియైనది కాదు. భూసంస్కరణలు కావాలనేఅందరము కోరుతున్నాము. కాని మా పెద్దలు సంపాదించిన డబ్బుతో భూమినికొనుక్కోవటం తప్పాఅని ప్రశ్నిస్తున్నాను కాని ఈభూసంస్కరణల గురించి మాట్లాడేవారు బ్యాంకులలో కోట్లకు కోట్లు దాచుకున్నవారి విషయం ఆలోచించరేమని నేను ప్రశ్నిస్తున్నాను. పట్టణాలలో పెద్దపెద్ద బంగళాలుకట్టి లక్షలకు లక్షలు బాడుగలు సంపాదిస్తున్నవారి గురించి ఎవరూఆలోచించటంలేదు. భూసంస్కరణలతోపాటు వారి విషయములనుకూడా, ఆలోచించమని కోరటంతప్పా? ఆలోచించాలని కోరుతున్నాను.

రెవెన్యూ ఎడ్మినిస్ట్రేషన్ గురించి ఒకవిషయం చెప్పవలసివుంది. R.D.O ఎందుకు వుండాలి? అది post office business చేస్తున్నదని కొందరు చెప్పారు. కలెక్టరుకు, తహసిల్దారుకు మధ్య R.D.O లేపోతే అక్రమాలు ఆలస్యాలు జరుగగలవు. ఎడ్మినిస్ట్రేషన్‌ను తాహసిల్దారుకు వదలటంవల్ల చాలా అక్రమాలు జరుగుతున్నాయని హెచ్చరిస్తున్నాను. పాతకాలములో ఏవిధముగా వుందో, ఈనాడుకూడా అదే ధోరణిలో ఈ ఎడ్మినిస్ట్రేషన్ నడుస్తున్నదని మంత్రిగారికి మనవిచేస్తున్నాను. ఏ కాగితమువంపినా సమాధానం ఎప్పుడు వస్తుందో తెలియదు. మా తాలూకాలోని ఒక చిన్న చెరువుగురించి 1½ సంవత్సరక్రితం నేను రిప్రెజెంట్‌చేశాను. ఈనాటి వరకు ఏమిజరిగిందో తెలియలేదు.

శ్రీ కె. వెంకటరావు:—ఆలోచనలోవుంది.

శ్రీ ఎ. చిదంబరరెడ్డి:—కనీసం ఆలోచనలో వుందని అయినా జవాబువస్తే బాగుండేది. M.L.A., represent చేసినదానికే ఆలస్యం జరిగితే రైతులు వ్రాసుకొన్నవాటికి జవాబువస్తుందనే ఆశ నాకులేదు.

కనుక నేనుచెప్పిన అన్ని విషయాలను గురించి మంత్రిగారు శ్రద్ధగా యోచిస్తారని ఆశిస్తూ. మీరీ అవకాశం ఇచ్చినందుకు నాధన్యవాదాలను మీకు సమర్పించుకొంటూ సెలవుతీసుకొంటున్నాను.

శ్రీ వి. గోపాలకృష్ణ (పిఠాపురము):- అధ్యక్షా! ప్రభుత్వం తరపున ప్రతిపాదించిన రెవెన్యూ డిమాండ్లను బలపరుస్తున్నాను. జమీందారీలను రద్దుచేసిన తరువాత, ఆ గ్రామాలలో, జమిందారుల స్థానాన్ని ప్రభుత్వం ఆక్రమించుకున్నప్పటికి, రైతులకు యేమీ, ఉపకారం జరుగలేదని చెప్పుటకు విచారిస్తున్నాను. రెవిన్యూ మంత్రిగారు చెప్పినట్లు జమీందారులను రద్దుచేసి, వారికి నష్టపరిహారమిస్తున్నప్పటికికూడ, ప్రభుత్వానికి అధికరాబడి వస్తూనేయున్నది. ఇదికేవలం ధనార్జనకు ప్రభుత్వం చేసినపనిగా కనుపిస్తున్నదేగాని, రైతులకు మేలుచెయ్యాలన్న విషయం గోచరించడంలేదు.

*(One hon' Member Crossed the Chair)*

మిస్టర్ ఛైర్మెన్:- సభ్యులు మాట్లాడుతున్నప్పుడు, స్పీకరుకు సభ్యులకు మధ్య నడవకూడదని యిదివరకు రూలింగు యివ్వబడినది. అదిగమనించాలని కోరుతున్నాను.

శ్రీ వి. గోపాలకృష్ణ:— ఈ జమీందారీ ఎస్టేట్సు రద్దుచేసిన సందర్భంలో అనేక పోరంబోకు భూములను ఆక్రమించుకొని అమ్మివేయడం జరిగింది. ఆ రోజులలో జమీందారులకు వ్యతిరేకంగా, ప్రజలు సాహసించి, ఈ విషయాలన్ని ప్రభుత్వదృష్టికి తీసుకొనిరావడమన్నది, చాలా కష్టమైనపని అని మంత్రిగారికి తెలియనిదికాదు. ఆ విధముగా ప్రభుత్వదృష్టికి తీసుకొనివచ్చినప్పటికి యేమీ చర్యలుతీసుకొనకపోవడం విచారకరము, పోరంబోకులను జమీందార్లు యేవిధముగా ఆక్రమించుకొన్నది maps వేసి చూపెట్టినప్పటికి, ఆ maps లో, ఆ particular portion ను కాల్చివేసి యేమీ చర్యతీసుకోకుండా అధికారులు ఉన్నారు. నెల్సన్ యేవిధముగా తనగుడ్డికన్నుకు టెలిస్కోపు పెట్టుకుని signal ను చూడలేదని చెప్పాడో, ఈ అధికారులకూడ ఆ చిత్రాలను, కాల్చివేసి తమ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చకుండా, తప్పుడు రిపోర్టులు ప్రభుత్వానికి పంపుతున్నారు. ప్రజలు యావన్మంది కోరినప్పటికికూడ యీ అధికారులు సక్రమంగా పనులుచేయుటలేదంటే ఆది కాంగ్రెస్ ప్రభుత్వమే కానీయండి, అభ్యుదయ భావాలతో పురోగమించే ఉద్దేశ్యాలతో స్థానాలు ఆక్రమించియున్న మంత్రుల ప్రభుత్వమే కానీయండి, అట్టి ప్రభుత్వాన్ని ప్రజలు సహించలేరు. తమక్రింది ఉద్యోగులు, తాము యిచ్చిన ఉత్తర్వులను వమ్ముచేసి నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారంటే దేశానికి గత్యంతరం ఏమిటా అని బాధగా యున్నది. మంత్రులు తాము ఇచ్చిన ఆర్డర్లు సరిగా అమలు జరుగు

తున్నదీ లేనిదీ అధికారుల ప్రవర్తన యెట్లున్నది చూడవలసిన బాధ్యత తమపై యున్నదని గ్రహించాలి. మంత్రివర్గ పాలసీని సక్రమంగా అమలు చేస్తున్నారా అన్నది కూడ చూడవలసి యున్నది.

భూసంస్కరణలను గురించి మంత్రిగారు చాలా విషయాలు వివరించారు. స్వంతంగా భూమి దున్నుకునే రైతులు ఉన్నారు స్వంతముగా భూమిని దున్నుకునే యినాం దారులు ఉన్నారు. ఎంతమంది యినాందార్లు లోటుపాట్లతో పంటలు పండిస్తూంటే యేవిధముగా ఎకరానికి దిగుబడి వస్తున్నది, రైతులు పండిస్తూంటే ఎంత దిగుబడి వస్తున్నది, ఎవరివల్ల భూములు అభివృద్ధిలోకి వస్తున్నాయి మొదలయిన వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నవా? ఇన్ని ఎకరాలకంటే యెక్కువభూమి ఉంచుకో రాదని పరిమితిని యేర్పాటు చేస్తామంటున్నారు. రైతులు ఒకరిదగ్గర పది ఇంకొకరిదగ్గర 20 యిట్లాగ వందలాది ఎకరాలను తీసుకొని పదిఎకరాల ఈనాందారుకంటే ఎక్కువ సంపాదిస్తున్నప్పుడు అటువంటివారినిగురించివివరాలను ప్రభుత్వంసేకరించిందా? నిన్న రెవిన్యూమంత్రిగారు టెనెన్సీ ఆక్టులో 50 పాళ్ళు తగ్గిస్తానని చెప్పారు. ఈవిధముగా చిన్నఈనాందార్లమీద భస్మాసుర హస్తంపెట్టినట్లయితే(క్షమించాలి యిట్లాఅన్నందుకు) విపరీతమైన పరిస్థితులు, సంక్షోభం కలుగజేస్తున్నారని చెప్పవలసియుంటుంది. అయిదు ఎకరాలు, పదిఎకరాలు ఉన్న ఆసామీలు యీరోజున దానిపైవచ్చే ఆదాయంతో సరి పుచ్చుకోలేక యే L. D. C. గానో U. D. C. గానో పనిచేస్తూ వేడినీళ్ళకు చన్నీళ్ళు తోడ్పడునట్లుగా బ్రతుకుతున్నారు. కేవలం ఆభూమి మీదనే బ్రతకమని చెప్పడం అన్యాయం. ఇటువంటి యీనాందారుల సమస్యను యేవిధంగా పరిష్కరిస్తారు? వందలకొలది ఎకరాల భూమిని శిస్తుకు తీసుకుని వ్యవసాయంచేసే వారిపై ఎటువంటి సంస్కరణలు తీసుకొని వస్తారు? భూములమీద పరిమితిని నిర్ణయిస్తున్నా రంటే రాబడిమీద పరిమితి నిర్ణయిస్తున్నారు. రాబడిని తగ్గించడమంటే, దేశంయొక్క ఆర్థిక అనిష్టాన్ని కోరుతున్నారన్నమాట, ఇది యేమాత్రం అభ్యుదయం కాదు. మీరు వ్యక్తిలో ఉన్నటువంటి incentive ను చంపుతున్నారని మనవి చేస్తున్నాను. మనిషికి యేమైనా లాభంలేనిదే యే పని చేయడు. అది మానవ సహజ లక్షణము. సోవియట్ రష్యాలో ఈ భూసంస్కరణలు fail అయిపోయినవి. ఈ భూమిమీద ఎల్లప్పుడూ ఒకే నిర్ణీతమైన ధరలు రావు .ఎందువల్లనంటే యెప్పటి కప్పుడు ధరలు మారుతోంటాయి. పంటలు ఎల్లప్పుడు ఒకేరకంగా దిగుబడి అవదు. అందుచేత రైతు ఆదాయంలో మార్పులు వస్తుంటాయి, పోనీ ప్రభుత్వం అయినా పంటలకు నిర్ణీతధరలు నిర్ణయిస్తుందా అంటే అదీలేదు. పంటకు భీమా పథకంలేదు. దీనినిబట్టి చూస్తే ఈ ప్రభుత్వం గ్రామ ప్రాంతాలను అభివృద్ధి పరచక వాళ్ళను అణగద్రొక్కి ఎల్లప్పుడు పరిపాలన పట్టణవాసుల హస్తగతమై యుండేటట్లు చేయు

టకు ప్రయత్నిస్తున్నదని అనుకోవలసియున్నది. అంటే దేశంలో రెండు వర్గాలను ఏర్పరచి పరిపాలన చేయాలని ఆలోచిస్తున్నదా? ఈ సమస్యను పరిష్కరించలేక టొటలిటేరియన్ కంట్రీస్‌లో డిక్టేటర్స్ యేవిధంగా ప్రవర్తిస్తున్నారో—అదే పద్ధతి మన దేశంలో కూడ ప్రవేశ పెట్టుటకు యత్నిస్తున్నారా? ఈవిధంగా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేక అనేక క్లిష్ట సమస్యల ఉత్పన్నానికి కారణ భూతులవు తున్నారు. కలవారి భూములను తీసుకొని లేనివారికి పంచి వాళ్లస్థాయి తగ్గించి. వీళ్ల స్థాయిని పెంచుదాము అనుకోవడం కేవలం టొటలిటేరియన్ దేశాల పద్ధతే; ఉత్పత్తిని హెచ్చించే మార్గాలు ఆలోచించాలి. Competitiveగా, చేదోడు వాదోడుగా ఉండే పద్ధతులద్వారా ఈ సమస్యా పరిష్కారానికి పూనుకోవాలి. అంతేగాని ఒకరిస్థాయి తగ్గించుటకు, మరొకరి స్థాయిని పెంచుటకు ప్రయత్నించినచో పూర్వం మురాదొంగలు చేసే పనికిందకు వస్తుందని మనవి చేస్తున్నాను.

శ్రీ జి. శ్రీరాములు (హుజూరాబాద్-రిజర్వుడు) :- అధ్యక్షా : గౌరవ నీయ రెవిన్యూ మంత్రి శ్రీ కళా వెంకటరావు 1958—'59 సం॥రపు Revenue Demand కు Rs. 5,82,04,300/— కావాలని అమిత ఆనందంతో, ముసి, ముసి నవ్వులతో మనముందు పెట్టి, దానిని pass చేయవలసిందని అభ్యర్థించినారు. రూపాయలు అవసరమైనపుడు, పన్నులు ప్రతిపాదించినపుడు, మంత్రిగారు చాలా మర్యాదగానే మాట్లాడతారు. ప్రజోపయోగ కరమైన పనులు చేయవలెనని, ప్రభుత్వంలోని అవినీతిని అరికట్టవలెనని చెప్పితే "ఇది మా రాజ్యం, మా ఇష్టంవచ్చినట్లు పరిపాలన సాగిస్తాము, మాకు ఎదురు ఎవ్వరూ లేర"ని మాట్లాడుతూ వుంటారు. ఈ విధంగా ఏలిన ప్రభుత్వాలు ఎక్కువకాలం నిలవలేవనే విషయం మంత్రిగారు తెలిసికోవడం మంచిది. భూ సంస్కరణలు తీసుకువస్తామని వారు చెబుతున్న మాట కొన నాలుకనుంచి వచ్చిందో లేక కొండనాలుకనుంచి వచ్చిందో నాకు అర్థం కావడం లేదు. పెద్ద ఆర్భాటంగా ప్రసంగాలు, ప్రచారం చేసి, అధికంగా భూములున్నవారు వాటిని అమ్ముకోవడానికి, తమ బంధుమిత్రులకు పంచుకోవడానికి అవకాశం కల్పించింది ఈ ప్రభుత్వం. ఇవన్నీచూస్తే వీరు చెప్పేమాటలకు, చేసేపనులకు ఏ మాత్రం పోలికలేనట్లు కనిపిస్తోంది. ఇటువంటి కల్లబొల్లి మాటలు చెప్పి తమ బలంతో ప్రతిపాదనలు నెగ్గించుకొని అమాయక ప్రజలను మోసంచేస్తున్నారు ఈ మంత్రిగారు. ప్రజలనుంచి పన్నులరూపంలో లక్షలు కోట్ల సంఖ్యలో వచ్చినడబ్బునంతా తమ యొక్క, తమబలగంయొక్క వైభోగవిహారాలకే వినియోగిస్తున్నారని చెప్పకతప్పదు. మంత్రులు, కలెక్టరులు, వారిసిబ్బంది ప్రతినెల, వేలకువేలు జీతాలు ప్రయాణ భత్యాల క్రింద తీసుకొంటున్నారు. ఎండనక, వాన అనక, చెమట, రక్తం ఓడ్చి రోజుకు 24 గంటలు చొ॥న 12 మాసాలు కష్టపడే రైతుకు, కార్మికునకు నెలకు

ఎంతగిట్టుతుందో మంత్రిగారు ఎప్పుడైనా ఆలోచించారా? లేదు. గ్రామాల్లో వుండే సుంకరి, నీరడీలకు ఈ ప్రభుత్వం ఎంత జీతం ఇస్తోంది? నెలకు ఒక్కరూపాయి అటనికి జీతం ఇస్తున్నారు. దీనితో అతడు తన కుటుంబాన్ని ఏ విధంగా పోషించుకోగలడు? తన పిల్లలకు విద్యావైద్యం ఏవిధంగా ఏర్పాటు చేసికోగలడు? దీన్ని గురించి ప్రభుత్వం ఎన్నడైనా ఆలోచించిందా? లేదు. సుంకరిచేత ఆ శాఖ ఉద్యోగులు వెట్టిచేయింప కొంటూరు. కలెక్టరుకు అన్ని సదుపాయాలు అతడే చూడాలి. కాని అతని కడుపుకు ఏమైనా పెట్టాలని ఈ ప్రభుత్వం ఆలోచించదు. నీరడీల గురించి వేరే చెప్ప పనిలేదు. వారికి జీతాలే లేవు. వారిచేత పనిమాత్రం చేయించుకొంటుంది. సుంకర్లకు జీతాలు ఎక్కువచేసి, వారికి వున్న ఈనాం భూములకు వెంటనే పట్టాలివ్వాలి. అదేవిధంగా నీరడీలకు జీతాలు ఏర్పాటుచేసి, వారికివున్న భూములకు పట్టాలివ్వాలని మీ ద్వారా మంత్రిగారికి, ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి నప్పటినుంచీ సుంకరీలకు జీతాలు ముట్టలేదు. ఈ ప్రభుత్వం ఎగవేసింది. ఇది ఎంతకాలం జరుగునో నాకు అర్థం కావడం లేదు. సంవత్సరానికి 12 రూపాయలు జీతం అయినప్పుడు, అదికూడా ప్రభుత్వం ఎగవేస్తే వారు ఎలా బ్రతకాలి? మా నియోజక వర్గంలోని వంగపల్లి గ్రామ సుంకరీలకు అయిదు సంవత్సరాలనుంచి జీతం రావడంలేదు. ఇది ఏమి అన్యాయం? దేశంలో ప్రభుత్వమనేది ఉన్నదా? లేదా? అనే విషయం అనుమానంగా వుంది.

ఈ నాడు దేశంలో హరిజనులు బీదవారి శ్రేణిలో మొదటివారు. పోరంబోకు, ఖారిజ్‌కౌత, గైరాన్ భూములు వీరికి పంచిపెడుతున్నామని ఈ మంత్రులు మాటలుమాత్రం చెబుతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి హరిజనులు దున్నుకొంటున్న భూములకు ఈనాటి వరకు ఈ ప్రభుత్వం పట్టాలివ్వలేదు. మా నియోజకవర్గం విషయం ఒకటి ప్రభుత్వ దృష్టికి తీసుకు వస్తాను. ఎన్నో సంవత్సరాలనుంచి వేలసంఖ్యలో పోరంబోకు ఖారిజ్‌కాతా భూముల తావుని కొన్ని "కౌరవాయీలు" మూలకు పెట్టి ఉంచారు. ఈవిషయాన్ని గురించి రెవిన్యూ మంత్రిగారికి, ముఖ్య మంత్రిగారికి శాసన సభ్యునిహోదాలో నేను తెలియజేశాను. కాని యింతవరకు ఏ చర్య తీసుకొన బడలేదు. కనీసం మేము వ్రాసిన దానికి జవాబు మంత్రులుకాని, ప్రభుత్వంకాని చెప్పడంలేదు. ప్రజల దరఖాస్తులకు సమాధానం యివ్వని ఈ ప్రభుత్వం ఎందుకు ఉన్నదని నేను అడుగుతున్నాను. పోరంబోకు, ఖారిజ్ కాతాబంజరు భూములను, ఎన్నోచోట్ల పెద్ద భూస్వాములు అమ్ముకొన్నారని ప్రభుత్వ దృష్టికి తీసుకు వస్తే యింతవరకు ఏ చర్యలు తీసుకోలేదు గత హైద్రాబాద్ ప్రభుత్వకాలంలో శ్రీ బి. రామకృష్ణరావుగారు ముఖ్యమంత్రి హోదాలో ఎన్నికలకు ముందు పర్యటనచేసి హరిజనులకు భూములిస్తున్నామని చెప్పారు. ఇచ్చారు. ఆ భూములు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు తెలియదు. కాని వారివద్ద

పన్నులు మాత్రం వసూలు చేయబడుతున్నాయి. వీటిని గురించి నిదర్శనలు, వివరాలు యివ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అటువంటి certificates ఇచ్చిన వారందరికి వెంటనే భూములు కౌలతలు వేసి ఇవ్వవలెనని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అమాయక కౌలుదార్లను ఎంతో మందిని ఈ రోజున బేదఖల్ చేస్తున్నారు. వారికి తినడానికి తిండి కూడా లేకుండా పోయింది. మా నియోజకవర్గంలో గుండేరనే గ్రామంలో రెండు మాసాల క్రితం, సంవత్సరాల తరబడి దున్నుకొంటున్న రైతులను, బేదఖల్ చేశారు. నేను స్వయంగా తహసిల్‌దారు వద్దకు వెళ్ళి వీటిని గురించి చెప్పి 96 section ప్రకారం భూస్వాములపై చర్య తీసుకొని రైతులకు ఖబ్జా యిప్పించమని చెప్పాను. తహసీల్‌దార్ దానిని ఏ బుట్టదాఖలు చేశాడో నాకు తెలియదు. ఇంత వరకు ఎట్టిచర్య తీసుకోబడలేదు. Tahsildar ను అడిగితే Revenue Inspector కు పంపానని Revenue Inspector ను అడిగితే పట్వారీకి పంపానని చెబుతున్నారు. ఇంతకు కరువాయి ఏ stage లో వుందో తెలియదు. కాబట్టి ఇది ప్రభుత్వమా? లేక గోటీవాటమా? ప్రభుత్వంలో ఇటువంటివి ఎన్నో అవినీతి కరమైన పనులు జరుగుతున్నాయి. ఈ Revenue department లో ఉన్నంత అవినీతి మరెక్కడా లేదని మనవిచేస్తున్నాను.

(శ్రీ) సి. వి. సూర్యనారాయణరాజు (ఎలమంచిలి):— అధ్యక్షా! విన్న రెవిన్యూ మంత్రిగారుఈ demand ను ప్రతిపాదిస్తూ ఏవో కొన్ని జమీందారీలను abolish చేశాము. ఇనాము దారులను abolish చేశాము, బంజరుభూములను పంచిపెడుతున్నాము, ఏవో land reforms తీసుకు వస్తున్నాము, వీటి గురించి మీ సలహాలు ఇవ్వమని చెప్పారు. ఈ సలహాలను మేము ఇచ్చేటప్పుడు రెవిన్యూ మంత్రిగారు తమ స్థానంలో లేకుండా, ఇంకొక మంత్రిగారిని కూర్చోబెట్టారు. కావున మా సలహాలకు జవాబులు ఎవరు ఇస్తారో అనుమానంగా ఉన్నది.

మిష్టర్ చైర్‌మన్:— జవాబు వారే ఇస్తారు. Note చేసుకొండి.

శ్రీ బి. కేశవరెడ్డి (ఘనాపుర్):— అధ్యక్షా, ఏదైన demand పై చర్చ జరుగుతున్నప్పుడు, దానికి సభ్యులు సూచనలు చేస్తున్నప్పుడు, దానికి సంబంధించిన మంత్రి ఉండాలా? లేదా? తమరు రూలింగు ఇవ్వాలని కోరుతున్నాను.

మిష్టర్ చైర్‌మెన్:— ఉండ నక్కరలేదు.

శ్రీ సి. వి. సూర్యనారాయణరాజు:— జమీందారీలు abolish అయిపోయాయి. మొత్తం 18 వేల చదరపు మైళ్ళలో 9 వేలు survey పూర్తి చేశామని

చెప్పారు మొట్టమొదట గ్రామానికి వచ్చి encroachments remove చెయ్యకుండా పెద్ద భూకామందులది, పలుకుబడు కలవారిది, political leaders గా ఉండేవారి యావత్తు భూమిని ముందు survey చేస్తూ ఉన్నారు. ఇదిఅన్యాయమని చెబుతున్నాను. రహదార్లు కూడ వారి ఆదీనంలోనే ఉన్నాయని survey చేసి పట్టాలు ఇస్తున్నారు. జమీందారీ area లో ఇంతవరకు ఏ గ్రామముకూడ survey చెయ్యలేదు. Demarcated pathways కూడ ఏమిలేవు మంత్రిగారు వీటిని గమనించి Survey Settlement వారికి instructions ఇవ్వాలని కోరుతున్నాను.

అంతే కాకుండా ఆ గ్రామాలలోఉన్న minor irrigation sources ఇంతవరకు మరమ్మతు చెయ్యలేదు. ఇవన్నీ ఒక list లో వేసుకొని 5 సంవత్సరాలకు ఒకసారి ప్రతిదానిని repair చేస్తామని మంత్రిగారు అన్నారు. విశాఖపట్టణం జిల్లాలో 3 లక్షల 90 వేల రూపాయలు minoı irrigation క్రింద మంజూరు చేస్తే 2 లక్షల 70 వేల రూపాయలు ఖర్చుపెట్టకుండా ఉండి పోయింది. దానికి కారణం ఏమిటి? ఈ విషయం మేము అడిగితే estimate తయారు చేయటానికి మాకు తగిన సిబ్బంది లేదు కాబట్టి మేము ఏమి చెయ్యలేమని officer లు అంటున్నారు. ఇక్కడ Budget లో చూస్తే 30 లక్షల రూపాయలు minor irrigation schemes క్రింద కనిపిస్తున్నది. ఇనాముదార్లక్రింద 11 వేల గ్రామాలను తీసుకోడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు, కాని ముందు ఈ minor irrigation sources ను బాగుచెయ్యకుండా గ్రామాలు తీసుకుంటే రైతులకి ఏమీలాభం ఉంటుంది అని అడుగుతున్నాను.

ఇక వీటికి compensation విషయంలో మంత్రిగారు మాట్లాడుతూ, 3 లక్షల రూపాయలు దాటిన వారికి, Bonds ఇస్తామని, దానిలోపుగా ఉన్నవారికి, డబ్బు ఇస్తామని అన్నారు. కాని జమీందారీ రద్దుచట్టం ప్రకారంగా, "half the compensation" ఇప్పుడు ఇచ్చి, మిగిలినది, survey, settlement, అయిన తర్వాత ఇయ్యాలని ఉంది. కాబట్టి ఈ చిన్న చిన్న ఇనాముదార్ల విషయంలో ఏమి చేస్తారో తెలియదు. దీనికి మంత్రిగారు జవాబు చెబుతారని ఆశిస్తున్నాను.

ఇక, Land Reforms తీసుకు వస్తామని అంటున్నారు. దీనికి సంబంధించి ఇంతవరకు మన ప్రభుత్వం గాని, మద్రాసు ప్రభుత్వం గాని, ఏరకమైన వ్యవసాయానికి, ఎంత ఖర్చు అవుతుందని లెక్కలు తయ్యారు చేసినట్లు కనిపించదు. కావున, మొట్టమొదట ఏ వ్యవసాయానికి ఎంత ఖర్చు అవుతుందో, ఎంత రాబడి వస్తుందో, లెక్కలు తయారు చేసుకొని దాని ప్రకారంగా ఒక తీర్మానానికి రావాలి గాని ఇవి, ఏవీ, లేకుండా Land Reforms పెడుతున్నామంటే, అర్థం లేదు. Large Scale farming లో Cost of production తగ్గడానికి వీలు ఉన్నది. ఈ సందర్భంలో, సంవత్సరానికి ఒక కుటుంబానికి 5,400– రూపాయలు వస్తే సరిపోతుం

దని ఒక నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తున్నది. ఇది దేనిని బట్టి నిర్ణయించారో తెలవిస్తారా? ప్రతి సంవత్సరం పంటలు పండుతాయని నమ్మకమా? లేక, ధరలు ఈ లాగే నిలుస్తాయని నమ్మకమా? Planning వారు కూడ రాష్ట్రాన్ని బట్టి నిర్ణయించాలని అన్నారుగాని, ఇన్ని ఎకరాలు ఉంది కావున ఇంత ceiling అని వారు ఎక్కడా చెప్పలేదు. ముందు Cost of production తగ్గించే ఆలోచన చెయ్యాలి. అప్పుడే ధరలు తగ్గడానికి వీలు ఉంటుంది.

ఇంకో విషయం, ఈ వ్యవసాయానికి ముఖ్య కారణమైన పశు పోషణ గురించి ఆలోచించినట్టు కనిపించదు. Large Scale farming లో mechinery use చెయ్యగలరు గాని, small scale farming కి, పశు పోషణ తప్పకుండా ఉండి తీరాలి. కావున ఎన్ని పశువులు కావాలి, వాటి మేత కొరకు ఎంత భూమి కావాలి, ఈ భూమికి, ఎంత manure కావాలి ఇవన్నీ దృష్టిలో పెట్టుకోవాలి.

Industries స్థాపించినప్పుడు, మీరు ఒక Unit fix-up చేస్తూ ఉన్నారు. అదే మోస్తరుగా, ఈ farming పెట్టినప్పుడు కూడ, అది ఎన్ని ఎకరాలలో పెట్టితే, మనకు గిట్టుతుంది అని ఒక నిర్ధారణకు వచ్చిన తర్వాతనే farming ప్రారంభిస్తే బాగుంటుంది. Industries కు fix చేసినట్లుగానే agriculture కు కూడ fix-up చెయ్యాలి.

కుటుంబానికి, ఈ ceiling fix-up చేసినప్పుడు, ఆ కుటుంబంలో ఉన్న యావన్మంది కూడ ఆ Unit లో బ్రతకడానికి సంవత్సరం మొత్తానికి, 200 రోజులు వారికి పని కల్పించి fix-up చెయ్యాలి. ఏ 10, 20, 30, ఎకరాలు గల కుటుంబంలో, వాళ్ళు మొత్తం 10, 15 మంది ఉంటే, వాళ్లకు కేటాయించిన unit లు, వారికే సరిపోతాయా? లేదా? అనేది దృష్టిలో పెట్టుకొని fix-up చెయ్యాలి.

భూసంస్కరణల విషయంలో, తోటలు వేసిన భూములను మినహాయిస్తారేమో అనుకున్నాము. కాని పళ్ళ తోటలు కూడ ceiling లోకి వస్తాయని అన్నారు. ఒక ప్రక్క మన Agriculture Minister గారు, ఉన్న భూములలో అంటు మామిడి, జీడి మామిడి, తోటలు వెయ్యండని ఒక G. O. కూడ issue చేశారు.

*(Mr. Speaker in the Chair)*

ఆ G. O. లో అంటు మామిడి తోటలు, జీడి మామిడి తోటలు కొండ వద్దున సాగుకులాయకిగా ఏ బంజరులో వేసినా అప్పు యిస్తామని చెప్పినారు. ఒక ప్రక్కన భారత ప్రభుత్వంవారు subsidy యిచ్చి " పండ్ల తోటలు వేయించాలి, ఇండియా ప్రజలు తక్కువ పండ్లు తింటున్నారు, పండ్లు తినవలసిన అవసరం వుందని"

చెబుతున్నారు. ఒక ప్రక్కన మామిడి తోటలు, జీడి మామిడి తోటలు, ద్రాక్ష ఎక్కువగా పండించాలని చెబుతూ యింకో ప్రక్కను వాటిని discourage చేస్తున్నారు. అందుచేత యీ ceiling ఏర్పాటు చేసినప్పుడు యివన్నీ దృష్టిలో పెట్టుకుని చేస్తారని మనవి చేస్తూ శలవు తీసుకుంటున్నాను.

*శ్రీ వి. కూర్మయ్య:— అధ్యక్షా, నాకీ అవకాశం యిచ్చినందుకు కృతజ్ఞతా వందనములు చెల్లిస్తున్నాను. మన ప్రభుత్వం యొక్క దృక్పథం, కేంద్ర ప్రభుత్వం యొక్క దృక్పథం, యీ ప్రభుత్వాలకు కారణమైన కాంగ్రెస్ దృక్పథం socialist pattern of society ని దేశంలో స్థాపించడం. అయితే దానిని స్థాపించడానికి యీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన పాలసీలు ముఖ్యంగా land reforms policy, land assignment policy, ఎంతవరకు దోహదం చేస్తున్నవో అంతవరకు ఉపయోగ పడతవి. నేడు ప్రభుత్వం దృష్టిఅంతా ప్రజలకు క్షేమం కలుగ జేయ వలయునవి. అనగా ప్రతివాడికి తిండి, బట్ట, ఇల్లు వుండే ఏర్పాటు చేయవలసిన కనీస ధర్మం ప్రభుత్వంపైన వుంది. అయితే యీ భూసంస్కరణల విషయంలో ఒక బిల్లును వచ్చే శాసన సభా సమావేశంలో ప్రవేశపెడతామని రివిన్యూ మంత్రిగారు శలవిచ్చారు. అయితే యీ బిల్లు ఏరూపములో వస్తుందో లేక కొండను త్రవ్వి ఎలకను పట్టినట్లు వస్తుందో చూడవలసిన అవసరం వుంది. అయితే వారు తమ ఉపన్యాసంలో అనేక ప్రశ్నలను లేవదీసి యీ ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చినప్పుడే మనం నిజమైన భూసంస్కరణలను ప్రవేశపెట్టగలము అని సభ్యులను తగిన సలహాలివ్వవలసి కోరారు. అయితే, నేనుమాత్రం "వ్యవసాయకూలీలు బాగుపడనిదే దేశంలోని మెజారిటీ ప్రజలు బాగుపడరు" అనే భావంతో Tiller of the soil should be the owner of the soil" అనే slogan తో వ్యవసాయ కూలీ ఉద్యమంలో 20 సంవత్సరాలనుండి పనిచేస్తూ వచ్చాను. అయితే ప్లానింగు కమీషనువారు 5,400 రూపాయలనే ఒక amount ను fix చేసి ఆ ఆదాయము వచ్చేటంత వరకు భూములను ఉంచాలనే సిద్ధాంతమును ఎప్పుడైతే నిర్ణయించారో అప్పుడే భూస్వాములందరు "మిగిలిన ఆదాయము మీద ceiling ఎందుకు పెట్టకూడదు, ప్రభుత్వ మంత్రులు 1500 రూపాయలు తీసుకునేవారి ఆదాయాలపై ceiling లేకుండా రైతులమీదనే ఎందుకు పెట్టాలి, అని చెప్పడం విని, ఆలోచించిన తరువాత వినోబా భావేగారు, మహాత్మగాంధీగారు సంకల్పించిన co-operative commonwealth ను స్థాపించడం అత్యవసరమని నాకు తోచుచున్నది. దక్షిణ ఇండియా constructive workers conference కంగేశిలో మహాత్మగాంధీగారు " co-operative commonwelth స్థాపించడమే కాంగ్రెస్సు లక్ష్యం" అని చెప్పారు. నేను గాంధిగారి శిష్యుడను అగుట

చేత గాంధియన్ సిద్ధాంతములో నాకు నమ్మకం వుండడంచేత ఈ సీలింగులు ఫ్లోలింగులు అన్నీ వదలిపెట్టి కో-ఆపరేటివ్ ఫార్మింగు సొసైటీలను స్థాపించి గ్రామాలలోఉండేభూమంతా గ్రామస్థులదేనని భావించి కష్టపడి పనిచేసేవానికే చాలినంతభాగమిచ్చి మిగిలినదే ఇతరదేశాలకుగాని, యితరజిల్లాలకుగాని, యితరరాష్ట్రాలకుగాని పంపించాలనే సిద్ధాంతం వున్న కో-ఆపరేటివ్ కామన్‌వెల్తును స్థాపించాలి. ఆ విధంగాచేస్తే ఈ సీలింగుప్రశ్న పోతుంది, Personal cultivation అంటే ఏమిటనే ప్రశ్న పోతుంది, Tenant–landlord సంబంధాల సమస్య పోతుంది. గాంధీగారుచెప్పినట్లుగా, ప్రధానమంత్రి శ్రీజవహర్లాలుగారు చెప్పినట్లుగా కో-ఆపరేటివు ఫార్మింగును అమలుజరిపే చట్టం వెంటనే తీసుకురావాలని చెబుతున్నాను. శ్రీ రాజేశ్వర రావుగారు చెప్పినట్టు ఎవరికీ అభ్యంతరంలేని, ప్రభుత్వానికి కష్టంలేని బంజరు భూములు, వ్యవసాయానికి పనికివచ్చేవి 46 లక్షల ఎకరాలున్నవి. దానిని భూమిలేని కూలీలకు పంచాలని కోరుతున్నాను. దాదాపు 46 లక్షల మంది హరిజనులిక్కడున్నారు. ఆ భూమిని హరిజనులకే యివ్వమని చెప్పను గాని అందరికీ తలో రెండు ఎకరాలు యిచ్చుకోవచ్చు. అప్పుడు తిండి సమస్య చాలవరకు తీరుతుంది. తరువాత లంకభూములున్నాయి. మదరాసులో జస్టిస్ పార్టీవారుండగా ఒకరిద్దరు హరిజనులు nominated Members గా ఉన్నప్పుడే Field labour Co-opertive societies కు మూడుసంవత్సరాల average rate కు కౌలుకు యిస్తూవచ్చారు. అయితే కాంగ్రెసు ప్రభుత్వం వచ్చినతరువాత, శ్రీ కళా వెంకటరావుగారు రెవిన్యూ మంత్రి అయిన తరువాత, ఆపాలసీని మార్చారు. స్లోగా, సిస్టమాటిక్‌గా; మెథాడికల్‌గా హరిజనులకు నష్టముకలుగజేయాలనే భావంతో వారుచేశారని భావిస్తున్నాను. కాదంటే వారి సమాధానంలో చెప్పమనండి. మొట్టమొదట జస్టిస్‌పార్టీ హయాంలో ఇద్దరు ముగ్గురు నామినేటడ్ సభ్యులే వుండేవారు. ఇప్పుడు 46 మంది హరిజన M. L. A లమున్నాము. మేము ఏమి చేస్తున్నామో, ఎందుకున్నామో మాకు అర్థం కావడంలేదు. దానిని వారు ఏవిధంగా మార్చారు? శ్రీ కళా వెంకటరావుగారు రెవిన్యూమంత్రిగా మదరాసులో వున్నప్పుడు లంక భూములమీద ప్రాగాకు లేక వాణిజ్యపంటలు వేస్తున్న భూమిని 33% ఎక్కువ చేశారు, ప్రస్తుతం rentals మీద 40% ఎక్కువ చేసి ఆ 40% యివ్వకపోతే వారికెవ్వరికీ భూములివ్వకూడదని చెప్పారు. పూర్వం F. L. C కి preference వుండేది. ఇప్పుడు all communities తో కూడిన కో-ఆపరేటివ్ సొసైటీ స్థాపించి ఆ సొసైటీలకు preference యిచ్చి యిదివరకు హరిజనులకు landless labour కి వున్న preferenee తీసివారేయాలని G. O జారీచేశారు. మంత్రిగారిని ఒక విషయం అడుగుతున్నాను. క్రొత్తకమిటీలను ఏర్పాటు చేసినప్పుడు యిదివరకున్న కమిటీలను oust చేయాలనే యీ G. O భావం కాదా? All communities members చేరుకనుక యివ్వమని జిల్లాఅధికార్లు యివ్వాళ కాక

పోతే రేపు చెపుతారు. All communities అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, వెలమదొరలు ఉండాలి. బ్రాహ్మణులు వ్యవసాయం చేస్తారా? వారందరూ వ్యవసాయం చేయరే! వ్యవసాయం చేయని వారినిసభ్యులుగా చేరిస్తే వారు హరిజనులను చేర్చుకోరు. హరిజనులకు అపకారం చేయాలనే ఉద్దేశ్యంతోనే యీ G. O జారీచేశారు. లేకపోతే ఏ ఉద్దేశ్యంతో చేశారో అర్థం కావడంలేదు. మాతరఫున హరిజన మంత్రిగావున్న శ్రీ సంజీవయ్యగారు నిద్రపోతున్నారా? లేక ఆయన "వారు ఎట్లాచేసుకుని పోతుంటే మన కెందుకు" అని దీనిమీద cabinet లో పోట్లాడడానికి శక్తిలేక ఊరుకున్నారా? అని అడుగుతున్నాను.

కార్మిక శాఖామంత్రి (శ్రీ డి. సంజీవయ్య) :- శక్తిలేక నిద్రపోలేదు. మేల్కొనే వున్నాను. శక్తి సామర్థ్యాలను కూడా ప్రదర్శిస్తున్నాను.

*Sri V. Kurmayya* : I am not yielding. ఆయన వెనుక 46 మంది సభ్యులం వున్నాం ఆయనకు బలం కావాలంటే కనీసం 36 మంది ఆయన వెనుక వున్నాం, అందరికంటె శక్తిగల మంత్రి ఆయనే అని చెబుతున్నాను. ఇంతమంది హరిజన శాసనసభ్యులను వెనుక పెట్టుకొని, వారందరూ తమ యిష్టవచ్చిన G. O జారీచేస్తుంటే ఊరుకున్నారా? ఇకముందునుంచి ఊరుకోడానికి వీలులేదని హెచ్చరిస్తున్నాను. వారు ఊరుకుంటె మేము ఊరుకోమని చెబుతున్నాను. లంకభూముల విషయంలో శ్రీ కళా వెంకటరావుగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను. ఈ భూములను భూమిలేని హరిజనులకిచ్చి వారికి జీవనోపాధి కలుగ జేయాలని ప్రార్థిస్తున్నాను. ¾ తీసివేయమన్నారు. దానిని వేలం వేస్తామన్నారు. 10 ఎకరాలుంటె 8½ ఎకరాలు తీసిపారేశారు. పశుగ్రాసం పేరుతో తీసిపారేసిన ఆ భూమిలో నిజముగా పశుగ్రాసంకాక పొగాకు వేస్తున్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం అబద్ధమైన సమాధానాలిస్తున్నది. పశుగ్రాసానికని మినహాయించిన ¾ భూమి పశుగ్రాసానికనే ఉంచారా? లేక వేలంవేసి వాణిజ్యపంటలను వేసుకోమంటున్నారా? శ్రీ కళా వెంకటరావుగారు సమాధానం చెప్పాలి. మాజిల్లా పరిపాలనకు కలెక్టర్లుగా చాలా in experienced Officers ను క్రొత్తగా I.A.S. పరీక్ష pass అయినవారిని వేస్తున్నారు. వారి పరిపాలన ఏమీ బాగాలేదు. ఎందుచేతనంటే పరిపాలనచేయడానికి అధికారులకు అనుభవంకావాలి. Rules క్షుణ్ణంగా తెలిసుండాలి, క్రొత్తగావచ్చిన వుర్రివాళ్లకు ప్రజల కష్టాలు తెలియవు. ప్రజలుచెప్పినప్పటికీ వారువినరు. ఈ భూములను వారికివ్వవద్దని శ్రీ వెంకటరావుగారు వారికి చెబుతున్నారేమో అనుమానంగా వున్నది. 10 సంవత్సరాలుగా సాగుచేసుకుని శివాయి జమా హక్కుగల భూములను కొంతమంది politi-

cal sufferers కు యిస్తున్నారు. ఆ గ్రామాలలో జరిగిన సంఘటనల ఉదాహరణలు వందలకొలది యివ్వగలను. సమయంలేదు కాబట్టి యివ్వడంలేదు. కాబట్టి యివన్నీ క్షుణ్ణంగా విచారించి ప్రభుత్వం ఈ మార్పులు తీసుకురావాలని కోరుతున్నాను. ముఖ్య మంత్రిగారిక్కడవుంటే బాగుండేది. ముఖ్యమంత్రిగారు ఈ విషయాలు ముఖ్యంగా వినాలి. వెంకటరావుగారు దీనిలో నిధి అని అందరికితెలిసిన విషయమే. తదితర మంత్రులలోపాలసీ అంటే ఏమిటో, భూమిఅంటే ఏమిటో, బంజరుఅంటే ఏమిటో, ఎవ్వరికి తెలియదు. ఆయన మంచి పేరు తెచ్చుకోవాలని చెబుతున్నాను. ఒకవేళ మార్పు తీసుకొని రాకపోతే political sufferersకు యిచ్చే భూముల విషయములో గాని, land assignment policy లోగాని, భూసంస్కరణల విషయములోగాని మార్పు తీసుకొనిరాకపోతే మన కాంగ్రెసుగతి ఏమిఅవుతుందో చెప్పలేము. 1949-50 వ సంవత్సరములో ఈ మంత్రులే మద్రాసులో వున్నారు. కళా వెంకటరావుగారు రెవెన్యూ మంత్రిగాను. మన ఆర్థికమంత్రిగావున్న గోపాలరెడ్డిగారు ఆర్థికమంత్రి గాను, మన ముఖ్యమంత్రి అటవీశాఖ మంత్రిగాను వున్నారు. గత ఎలక్షనులో ఏమిఅయింది. కమ్యూనిష్టులను తగ్గిద్దామనే భావంలో పోలీసులతో ప్రజలను తన్నిస్తూంటే ఆరోజున అసెంబ్లీలో చెప్పాను. "పోలీసులు కమ్యూనిష్టులను తగ్గించ డానికి ప్రజలను అన్యాయముగా కొడుతున్నారు. వచ్చే elections లో మనకు అపజయము తప్పదు" అనిచెప్పాను. ఆ రోజున గోపాలరెడ్డిగారు ఇదిఅంత అబద్ధము. హరిజనులంతా అబద్ధమాడుతున్నారు, అనిచెప్పారు. కాంగ్రెసుకు 1952లోపట్టిన అవస్థ పట్టకుండా చేయాలని అలా అపజయమనేది కలిగితే వారేబాధ్యులు కాగలరని చెపుతూ విరమిస్తున్నాను.

శ్రీ డి. వి. రమణారెడ్డి (దర్శి) :— అధ్యక్షా, రెవెన్యూ మంత్రిగారు ప్రవేశపెట్టిన డిమాండును బలపరుస్తూ, భూసంస్కరణల విషయములో సోదర మెంబర్లను కొన్నిసలహాలు ఇవ్వమని కోరినందుకు నేనున్నూ కొన్ని సలహాలు చేస్తున్నాను. భూసంస్కరణలతోపాటు అన్నిరంగాల్లోను, అన్ని సంపదలమీద సంస్క రణలు తీసుకొని వచ్చినప్పుడే అది Socialistic Pattern of Society అవుతుంది. ఒక్కరైతుమీదనే ఈ సంస్కరణలు తీసుకొని రావడము అంత న్యాయమైన సంగతి కాదని మీద్వారా ప్రభుత్వమునకు మనవి చేస్తున్నాను. రైతుకంటె ఎన్నోరెట్లు ఆదా యము కలవారి జోలికి పోకుండా కష్టపడి దేశానికంతకూ తిండిగింజలు పండించు చున్న యీ రైతు మీదనే సంస్కరణలు ప్రథమములో తీసికొని వచ్చి రైతు నష్ట పడే మార్గము తెచ్చిపెడుతున్నారంటే చాలా అక్రమముగా వుంది. భూసంస్కరణలు చేయుట తప్పనిసరియై చేయవలసివస్తే అన్ని రాష్ట్రాలు చేసిన తరువాత అవి చూసి మనము చేస్తే బాగుంటుంది.

శ్రీ కె. వెంకటరావు :- అందరూ అలా అనుకుంటే ఎవరు ముందు చేస్తారు ?

శ్రీ. డి. వి. రమణారెడ్డి :- అలా ముందుగా చేసినట్టి Prohibition వల్ల మనకు కొన్ని కోట్లు నష్టము వచ్చింది.

శ్రీ కె. వెంకటరావు :- సమాధానము చెబుదామని చెప్పవద్దు. ముందుగా prohibition ప్రవేశపెట్టింది బొంబాయి కాని మద్రాసు కాదు.

శ్రీ డి. వి. రమణారెడ్డి :- ఈ భూసంస్కరణల విషయములో మద్రాసు ప్రభుత్వము అవలంబించిన ప్రకారము చేయుట మంచిదని నా సలహా. వారు మద్రాసులో further గా కొన్ని భూములకు sealing వుండేటట్లు, ఇప్పుడు వున్న భూముల జోలికి పోకుండా వుండేటట్లున్ను ఆలోచిస్తున్నారు. మనం ఆవిధంగా ఎందుకు చేయకూడదో ఆలోచించండి. మనం Prohibition విషయములో ఎన్నో కోట్లు నష్టపడవలసివచ్చిందంటే అందరికంటే ముందు తొందరపడి చేయడము వల్లనే దానిని పూర్తిచేయుటకు ఎన్నోరకములైన పన్నులు వేసి ప్రజలనుంచి వసూలుచేసి వారి ఆదరాభిమానాలు పోగొట్టు కొంటున్నాము. మనము నష్టపడితిమే గాని ఫలితము యేమియు కలుగక త్రాగుట జాస్తి అయినది. దీర్ఘముగా ఆలోచన చేయక త్వరపడి చేసినట్టి పనులు యిట్లేయుండును. యెవరో ఒకరు ముందు చేయాలిగాని, అందరూ అట్లా అనుకుంటే మనం ఎలా ముందుకు పోగలము అని మంత్రిగారు శెలవు యిచ్చారు. తప్పని సరిగా చేయవలసి వచ్చినప్పుడు గూడా నిదానముగా తక్కిన విషయాలన్నీ చక్కగా విమర్శించి, తెలుసుకొని రైతుకు కనీసము 10, 15 వేల రూపాయల ఆదాయము యొక్క పరిమితినైన పెట్టవలయును, లేకున్న చాలా కష్టములకు లోనవుదురు. అట్లు చేయనిచో దేశములోని రైతులోకము యొక్క విశ్వాసము ప్రభుత్వము పూర్తిగా కోల్పోవలసి వచ్చును.

మిస్టర్ స్పీకర్ :- తెలంగాణా కూడా మనభాగమేనని జ్ఞాపకము పెట్టుకోమంటున్నారు.

శ్రీ డి. వి. రమణారెడ్డి :- తెలంగాణా మనభాగమే అయినప్పటికి తెలంగాణాను గూడా సంస్కరణల సందర్భములో మన స్థాయికి తీసుకు పోవలసియున్నది. జిల్లాపరిపాలనా విధానములో ముఖ్యముగా రెవెన్యూ డిపార్టుమెంటు చాలా అవినీతిగ నడుస్తూ యున్నది. దానిని సర్వజ్ఞులగు రెవెన్యూ మంత్రిగారు అరికట్ట లేకున్నారు. రెవెన్యూ మంత్రిగారికి వయస్సు పెద్దదవటము చేత వారి హుంషారు పడలుతున్నదేమో ననిపిస్తూ యున్నది. లేకున్న ఈ అవినీతిని తొలగించుట వారి

శక్తికి మించినదికాదు. రెవెన్యూ శాఖలో ఉన్న పొరపాట్లు, అవినీతి ఇంత అని చెప్పేదానికి వీలులేకుండా వుంది. దానిని గురించి ఎక్కువ శ్రద్ధతీసుకొని చక్క-చేయడానికి కంకణబద్ధులు అవుతారని ఆశిస్తున్నాను. ప్రజా ప్రతినిధులు అనబడే ఈ M. L. A లతో చెపితే ప్రజల పనులు అన్నీ నెరవేరుతాయని వారు ఎన్నుకొన్న సభ్యులతో వచ్చి రెవెన్యూకు సంబంధించిన విషయాలు మొరపెట్టుకొంటారు. పనులు కాకపోవడమే కాకుండా జవాబులుకూడ లేని నిదర్శనాలు చాలా వున్నాయి. మంత్రిగారు శ్రద్ధతీసుకొని చేయగలిగితే ఈ M. L. A లు ప్రజల దృష్టిలో కొంత గౌరవాదరములు పొంది ఇప్పుడున్న అనాదరణ స్థితినుంచి తొలగించినవారు కాగలరని మనవి చేస్తున్నాను. ఒక చిన్న విషయము మీద్వారా రెవిన్యూ మంత్రిగారికి నివేదించుచున్నాను. దానిని వారు బాగా ఆలోచించవలయును. Treasury లో M. L. A's pay bills గాని T. A bills కాని payment కొరకు పంపిస్తే లంచమివ్వనిదే payment ఇవ్వమని అన్నట్టి నిదర్శనాలు జరిగి దానిమీద reports ఇవ్వడం కూడా జరిగివున్నది. ఇంతకంటే అవినీతికరమగు విషయము యేమిచెప్పాలి, ట్రెజరీలో సామాన్య పౌరుడు అక్కడ డబ్బు చెల్లించడానికి గాని తీసుకొనడానికిగాని వెళ్లినపుడు వారుపడుతున్న బాధలు ఇంతింతని చెప్పడానికి వీలులేదు. వారి ఇబ్బందులను ఆలోచించకుండా వుండటానికి వీలులేదు. పరిపాలన సౌష్టవముగా జరగాలన్నపుడు మంత్రులు తమతమ డిపార్టుమెంట్ లో వున్నవిషయాలను విమర్శ చేసివాటిని చక్క-చేయుటకు యెక్కువ శ్రద్ధ చూపాలి. లేనియెడల ప్రభుత్వము ప్రజలకు యెన్ని సదుపాయములు చేసినా, యెన్ని Developments చూపించినా ప్రయోజనము యేమిన్నీ కనబడదు. వారికి అభివృద్ధి పనుల సౌఖ్యంకన్నా నిత్యకృత్యములో వారు పడేబాధలను తొలగించటానికే ప్రాధాన్యత కోరుకొనుచున్నారు. పరిపాలన విధానములోని లోపములు ప్రభుత్వమును నిందలపాలు చేయుచున్నవి. మేము కనపడినప్పుడల్లా ప్రజలనుండి వినలేని నిందలువింటూ వుండడము జరుగుతూ వుంది. మన పరిపాలనా యంత్రాంగములో వెంటనే మార్పులు తీసుకొనిరానప్పుడు మనము దేశాభివృద్ధికై కోట్లకొలది ఖర్చుచేయు ద్రవ్యము వృథాయగుచున్నట్లును, బూడిదలో పోసిన పన్నీరు మాదిరిగాను వుంటూ మనము చేసిన మంచిపనులు లెక్కకు రాకుండా పోతున్నవిగా అవుతుంది. అందరు వానియందు శ్రద్ధవుంచి తప్పు ఎక్కడ వున్నదో తెలుసుకొని చక్క-చేయటానికి తీవ్రముగా ప్రయత్నించినచో మీకు అసాధ్యమైన పనికాదు. ఎన్నోసారులు ఎంతోమంది మెంబర్లు చెప్పుతున్నారు కాని ఇంతరకు ఎలాంటిమార్పు రాకుండా ప్రభుత్వపు పరిపాలనా విధానముయొక్క నడకమాత్రము తాబేలు నడక మాదిరిగానే వుంది. కొన్ని ప్రాంతాల విషయములో రెవిన్యూమంత్రిగారు అక్కడకు వెళ్ళి చూశారు. వారికింతవరకు ఎలాంటి relief ఇవ్వడముకాని శిస్తు రెమిషన్ ఇవ్వడముకాని జరుగలేదు. అక్కడి పశువులకు

మేతలేక డెల్టా ప్రాంతాలకు తోలుకొనిపోయి నానా అవస్థలు పడుతున్నారు. తిండి గింజలులేక పాటకజనం గ్రామాలను వదిలి పోతున్నారు. దయవుంచి ఏదైనా కరువుపనులు ప్రారంభించి మా ప్రాంతములో చేయవలసినదిగా కోరుతున్నాను. Village Officers విషయములో వారు ఆశించినంతగాని, అనుకొన్నంతగాని అభివృద్ధి జరగలేదు. ఎన్నో డిపార్టుమెంటులకు వారు సమాధానము చెప్పవలసి ఉంటుంది. పూర్వకాలంలో మాదిరి గాకుండా ఈనాడు కేవలము జీతంమీదనే ఆధారపడి ఉండేటటువంటి, గ్రామోద్యోగులు కొంతమందిఉన్నారు. వారికిచ్చేజీతము ఒకపూట తిండికైనా సరిపోదు. వాళ్లకు ఇతర విధముల సదుపాయములు కలుగ చేయవలసినదని ప్రభుత్వము వారిని కోరుతున్నాను.

ఎస్టేటు గ్రామాలను ప్రభుత్వము తీసుకున్న తరువాత సర్వే సెటిల్ మెంటు జరుపుచున్నారు. రైతులకు చిత్తు పట్టాలు ఇస్తున్నారు. ఇలా పట్టాలిచ్చే సందర్భంలో రైతులు 10 రోజుల లోపల ఆక్షేపణలు చెప్పుకోవలసియున్నది. ఇదివరలో గ్రామోద్యోగులు సమ్మెచేసిన సమయములలో కొందరు సెక్షను రైటర్లవల్ల యీ రఫ్‌పట్టాలను తయారుచేశారు. ఒకరినంబరు మరొకరికి మారిపోవడం జరిగింది. అటువంటివి ఒకటి, రెండుగాదు. ప్రతి పట్టా తప్పులే. యీ రఫ్ పట్టాల బాగోగులను విచారించ డానికి వచ్చిన ఉద్యోగి, ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క రోజు మాత్రమే ఉండడము జరిగింది. ఒక్కొక్క గ్రామంలో 4, 5 వందలమంది రైతులున్నప్ప టికి ఏ 5, 6 మందినో విచారించి వెళ్లిపోయినందువల్ల మిగతా పట్టాలలో తప్పులు సవరణలు జరుగక అట్లనేయుండి పట్టాలు సరిగాలేవు. కాబట్టి వాటిని తిరిగి గ్రామోద్యోగులకు పంపించి వారు పరిశీలన చేసినతరువాతనే సరైన పట్టాలిస్తే బాగుంటుంది. ఈవిధంగా రైతులకు యిబ్బందులున్నవి గనుక సరైన పద్ధతులలో పట్టాలు జారీ చేయడం అత్యవసరం. నాకీ అవకాశము ఇచ్చినందులకు అధ్యక్షులవారికి కృతజ్ఞత తెలుపుతున్నాను.

* శ్రీ యం. నాగిరెడ్డి (మాచర్ల) :- అధ్యక్షా! ఈబడ్జటు డిమాండు లలో అత్యంత ప్రధానమైనటువంటిది, ముఖ్యమైనటువంటిది ఈ ల్యాండు రెవిన్యూ డిమాండు అని మనకందరకు తెలిసినదే. ఈ డిమాండుకు సంబంధించి చిరకాలంగా ప్రజలు, ఎసెంబ్లీ సభ్యులు కోరుచున్నవి భూసంస్కరణలు. ఈ విష యంలో ఒక నిర్ణయానికివచ్చి, ఇప్పటికయినా భూసంస్కరణలు తీసుకొనివస్తారని ఆశించాము. కాని రెవిన్యూమంత్రిగారు పాతపాటనే వినిపించారు. కర్నూలులో భూసంస్కరణల విషయంలో మీ సూచనలు చెప్పండని శ్రీ చంద్రమౌళిగారడిగారు, గత సంవత్సరము రెవిన్యూ మంత్రిగారు అదేవిధముగా చెప్పారు. ఈ సంవత్స రముకూడ తిరిగి ఆ పాతపాటే పాడారు. భూసంస్కరణలు అమలు చేయవలెనని

మూడేండ్లనాడు ఆవడిలో చెప్పారు. నిన్న, మొన్న ప్రాగ్జ్యోతిషపురంలోకూడ అదే తీర్మానము తిరిగి ఆమోదించారు. అనేక రాష్ట్రములలో కాంగ్రెసు ప్రభుత్వాలు భూసంస్కరణలు ప్రవేశపెట్టేయి. కొన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టినా సక్రమంగా అమలు చేయడంలేదు. యీ విషయాన్ని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఢేబర్‌గారు నొక్కి చెప్పడంచేత యిప్పుడైనా భూసంస్కరణలు మన రాష్ట్రంలో ప్రవేశపెడతారని ఆశించాము. కాని ఇప్పుడుకూడ మంత్రిగారు మీ సూచనలేమిటని మమ్ములను అందరునూ అడుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వమువారు, ప్లానింగ్ కమిషన్‌వారు రు. 4,800 ఖర్చునుచేర్చి ఆదాయమువచ్చే భూమికాని లేదా రు. 3,600 లు నికరాదాయమువచ్చే భూమిగాని గరిష్ట భూపరిమితిగ ఉండాలని చెబుతూ భూసంస్కరణలు రావాలని చెప్పారు.

శ్రీ కె. వెంకటరావు :— ప్లానింగ్ కమిషన్ రిపోర్టులో రూ. 3,600 లు నికరాదాయం గరిష్టపరిమితి అని నిర్ణయించబడినట్లు ఎక్కడైనా ఉన్నదేమో చూపిస్తే నేను అంగీకరిస్తాను.

శ్రీ యం. నాగిరెడ్డి :- పన్నెండువందల రూపాయల నికరాదాయమువచ్చే భూమి కుటుంబ కమతమని, దానికి మూడురెట్లవరకూ భూమి గలిగిఉండవచ్చునీఅన్నారు. అంటే రూ. 3,600 ల నికరాదాయమన్నమాట. ఖర్చులు చేరిస్తే 4,800 రూపాయల ఆదాయమువచ్చే భూమిని కలిగియుండవచ్చు.

మిస్టర్ స్పీకర్ :— తెలంగాణాలో అమలులో ఉన్న దానినిబట్టి చెబుతున్నారా?

శ్రీ యం. నాగిరెడ్డి :— అవును. మనరాష్ట్రములోని ఒకభాగములో ఇది అమలులో ఉంది. ఆ శాసనములో లోటుపాట్లుంటే దానిని ప్రజాభిప్రాయమునకుగాని సెలెక్టుకమిటీకిగాని పంపి అన్ని రాజకీయపార్టీల ప్రజాభిప్రాయాలు తెలుసుకోవచ్చు. యీనాడు మంత్రిగారు మనముందు రెండు ప్రశ్నలను పోజ్ చేస్తున్నారు. భూస్వాములు భూములను అన్యాక్రాంతము చేస్తున్నారని, బేదఖల్ చేస్తున్నారని వారు చెబుతున్నారు. ఇటువంటివాటిని ఆపుచేయాలి, పంచదార ఫ్యాక్టరీల పేరునా, సిగరేట్ ఫ్యాక్టరీల పేరునా భూస్వాములు తమ భూములను వ్రాస్తున్నారు. యీవిధమైన అన్యాక్రాంతములను, బేదఖళ్ళను రద్దు చేయడానికి ఆర్డినెన్సు తీసుకొచ్చేబదులు 20 ఎకరాల పైబడి భూమికలవారిని లెక్కలు ఇవ్వమని ఆర్డినెన్సు తీసుకొనివచ్చారు. దీనివల్ల కలిగిన ఫలితమేమిటి. లెక్కకు మించిన బినామీ విక్రయాలు జరిగాయి. యీనాడు ప్రభుత్వమునకు వచ్చిన లెక్కలను మంత్రిగారు పరిశీలించినట్లయితే గ్రామాలలో 20 ఎకరాలకు మించి భూమి

ఉన్నవారు ఏ ఒకరిద్దరుమాత్రమే కనపడుతారు. 1937 సంవత్సరం నుంచికూడా భూ సంస్కరణలు తీసుకొస్తామని కాంగ్రెసు ప్రభుత్వం చెపుతున్నప్పటికీకూడా ఇందులో సక్రమమైన చర్యలేమీ తీసుకోలేదు. ఏదో ఒకసాకు చూపించి జాగుచేయవలెననే ఉద్దేశ్యముతో ఉన్నట్లుమాత్రమే కనపడుతున్నది. ఎప్పటికప్పుడు సూచన లివ్వండి అనిమాత్రమే అడుగుతుంటారు. ఎంతోకాలంగా రెవిన్యూశాఖలో అనుభవమున్న మంత్రిగారు మా సూచనలకై ఇంతకాలము వేచిఉన్నారా అని అడుగుతున్నాను. బంజరు భూముల విషయము చూడండి. యీ సమస్య యీనాటి వరకూ పరిష్కారముకాలేదు. రాజగోపాలచారిగారి ప్రభుత్వము బంజరు భూములను రాజకీయబాధితులకు ఇవ్వకూడదని ఆర్డర్లు ఇచ్చినప్పటికీ మరల దానిని కర్నూలులో రద్దుచేయడముజరిగింది. ఎన్నో సంవత్సరములుగా రొంపేరు ప్రాంతములోని భూములను సాగుచేసుకుంటున్నవారిని వెళ్లగొట్టి వాటిని రాజకీయబాధితులకు ఇస్తున్నారు. తెనాలి తాలూకాకు చెందిన శ్రీ పి. యం. రత్నసభాపతి అనే ఆసామికి 150 ఎకరముల సుక్షేత్రమైన భూమిఉంది. బాపట్ల తాలూకాలో గోసాల కోటయ్య అనేరైతు ఎ. 1–30 ట్లు సాగుచేసుకుంటూంటే ఆ భూమిని తీసుకొని 150 ఎకరాల భూమిఉన్న రత్నసభాపతిగారికి రాజకీయబాధితుడనే పేరుపెట్టి ఇవ్వడము జరిగింది. రాజకీయబాధితులు పేదలుగా ఉన్నవారికి భూమిఇవ్వవలసినదే. మొట్టమొదటినుంచీ మేము ఒక పార్టీగా దానికి అంగీకరించాము. కాని నూరు, నూటయాభై ఎకరాల భూములున్నవారికే రాజకీయబాధితులనే పేరుతో ఇంకా భూమిని కట్టబెట్టడం న్యాయంకాదు. 10,25 సంవత్సరాలుగా పేదరైతులు బంజరుభూములను సాగుచేసుకుంటున్నా ఉద్యోగుల అశ్రద్ధవల్ల వారికి ఇంతకాలం నుంచీ పట్టాలివ్వడములేదు. అటువంటివారిని యీనాడు భూములనుంచి వెళ్లగొట్టడము జరుగుతున్నది. ఇంతకాలంగా రాయి, రప్ప తొలగించి బంజరుభూములను సాగులోనికి తెచ్చినవారిని యీనాడు వెళ్లగొట్టడము భావ్యమా అని అడుగుతున్నాను. యీనాడు వేలంపాటరేటునా, మార్కెట్ రేటు ప్రకారము వారిని వెళ్లగొట్టుతున్నారు. 10,15 సంవత్సరాల వాయిదాలలో ఆ భూములకీనాడున్న ధరలను చెల్లించమంటే ఆపేద రైతులకు అది సాధ్యమా అని అడుగుతున్నాను. ఆ డబ్బుయీయలేనివారిని యీనాడు తొలగించడము జరుగుతున్నది. మా తాలూకాకు సంబంధించినంతవరకూ అగ్రహారములో రెండు, మూడువందల ఎకరాల భూమి, దామరపాడు, నడిపూడి గ్రామాలలో యీ విధంగా ఉన్నది. ఇదే విధముగా చెరువుపశక భూములున్నాయి. ఎబాండెండ్ టాంక్సు అని గ్రామలెక్కలలో నమోదు చేసి వాటిని 15, 20 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న రైతులనుకూడా యీనాడు మార్కెట్ రేటు ఇవ్వమని చెబుతున్నారు. ఐతే యీ చెరువు భూములను పెద్ద భూస్వాములకు ఇవ్వదలచినపుడు మార్కెట్ రేటు ఇవ్వమని యీప్రభుత్వం అడుగు

తున్నదా అని ప్రశ్నవేస్తున్నాను. గుంటూరు తాలూకాలో గోళ్లమూడి చెరువుఉంది. అక్కడి ప్రజలు యీ చెరువులో నీరు నిలుస్తుంది, మా పశువులు త్రాగుటకు నీరు ఉంటుంది అని చెప్పుకొన్నప్పటికికూడ రాజకీయబాధితులనే పేరుతో ఆ భూమిని ఒక కాంగ్రెసు శాసన సభ్యునకు యీయడము జరిగింది. తెలంగాణాకు సంబంధించి నంతవరకు ఒక ఉదహరణచెబుతాను. కరీంనగరుతాలూకా రేణుగుంట గ్రామంలో పోచమ్మచెరువు అనే 400 ఎకరాలచెరువు ఉన్నది. ఆ చెరువులో నీరు నిలుస్తుందని, ఆ నీరు ప్రజలకు అవసరమనీ చెపుతున్నాకూడా 5,6 వందల ఎకరాల భూమిఉన్న ఒక జమీందారు అక్కన్నపేట చొక్కారావుగారికి వారి ఆస్తిచాలదని యీ భూమి కూడా ఇచ్చింది ప్రభుత్వము. ఆనాడు దానికి వ్యతిరేకముగా శ్రీ బి. రామకృష్ణరావు గారి హయాంలో రైతులందరు పెద్ద ఆందోళనచేస్తే ఆ ఉత్తర్వు నిలుపుదల చేయడ మైనది. శ్రీ సంజీవరెడ్డిగారు ఆ ప్రాంతాలకు ఎన్నికల ప్రచారానికి వెళ్లినపుడు అచటి ప్రజలందరూ వారికి యీ విషయం విన్నవించుకోగా ఆ విషయంలో తప్పని సరిగా చర్యతీసుకుంటామని చెప్పినప్పటికికూడా శ్రీ జె. వి. నర్సింగరావుగారు కట్టను తెగకొట్టి భూమిని ఆ ఆసామికి ఇచ్చినట్లు తెలిసింది. ఇటువంటి కేసులు అనేకం ఉద హరించ గలను. బంజరుభూములు చేసుకొంటున్నవారికి పట్టాలు యివ్వడంలేదు.

లంక భూముల విషయంలోకూడా మంత్రిగారికి పదే పదే చెప్పాము. ఒక వైపు పచ్చగడ్డికని, మూడవ వంతు వేలమువేస్తారు. అది పాట పెట్టేవరకు భూస్వాములకు వస్తోంది. వాళ్లు అందులో వ్యాపారపంటలు వేస్తున్నారు. అది రద్దుచేయమంటే, వాళ్లమీద పెనాల్టీ వేస్తామంటారు. అక్కడ పేదప్రజలు, హరి జనులు, మాల, మాదిగ ఎరుకుల, డొక్కల, దొమ్మర యిలాంటివాళ్లంతా తిండి కొరకు చేసుకొంటూంటే, మూడవ వంతు భూస్వాములకు గడ్డిలేదని యిస్తున్నారు. పేదవాళ్లు తినటానికి తిండిలేక. డొక్కలుమాడి, మడత కుడుములు తింటూంటే ఏమీ ఫర్వాలేదు గాని వందల ఎకరాలున్న భూస్వాములకు వేలము వేయటమనేది కడు శోచనీయమైన విషయం. ఈ సమస్య భూసంస్కరణలు పరిష్కరిస్తుందా?

ఇళ్ల స్థలాల విషయం అనేకసార్లు ప్రభుత్వ దృష్టికి తెచ్చాను. జనాభా పెరిగిపోయి గ్రామాలు పెరిగిపోతున్నాయి. గ్రామము చుట్టూ ఉన్న బంజరు భూములు అవీ ఆక్రమించుకొని, కొనుక్కొని, ఇళ్ళు కట్టుకొని పది, ఇరవై సంవత్స రములనుంచినివసిస్తున్నారు. వాటిని గ్రామ కంఠములో చేర్చమని కోరాము. కబేళాలు యివ్వండని కోరాము. ఆర్డర్సు పాస్ చేశామన్నారు. కర్నూలులో ఉన్నప్పటి నుంచి మేము మొత్తుకుంటున్నాము. నేను కర్నూలు అసెంబ్లీకి ఎన్నికయిన మరు క్షణమే మా తాలూకాలో పేటసన్నిగళ్ల గురించి మొట్టమొదట ప్రభుత్వానికి కాగితము యిచ్చాను. ఆర్డర్సు యిచ్చామంటారు. నాలుగేండ్లయినది. యింతవరకు పట్టాలు

యివ్వరు. పంచాయతీబోర్డు. యింటిపన్ను వసూలు చేస్తున్నది. ఇటు రెవిన్యూ డిపార్టుమెంటువారు వసూలు చేస్తున్నారు. చీరాల, బాపట్ల అయితే మునిసిపాలిటీ లైసెన్సు వసూలు చేస్తారు. ఈ విధంగా మూడు రకాల పన్ను యిచ్చుకోవాలి. ప్రభుత్వం ఆర్డర్సు పాస్‌చేసి ఎన్ని సంవత్సరములు గడిచినా ఇంప్లిమెంట్ కావటం లేదు. ప్రభుత్వం తగు శ్రద్ధ తీసుకొనవలెనని కోరుతున్నాను.

అడవుల బంజర్ల విషయం ఉన్నది. ఎన్ని ఏళ్లనుంచో సాగుచేస్తున్నారు. సత్తెనపల్లి తాలూకాలో బోధనం గాని, చిట్టాలగాని, పల్నాటి తాలూకా కాట్రపాడు గాని, పట్రుపాలెంగాని, అనేక ఊళ్లు ఉన్నాయి. ఫారెస్టు పెంచాలన్నారు. అక్కడ చెట్లు పెరగవు. అక్కడ సాగుచేసుకుంటున్నవారిని వెళ్లగొట్టి, ఫారెస్ట్సు పెంచి, దానిద్వారా దేశాన్ని ఉద్ధరించారంటే, ఆ జీ.ఓ. అందరికీ వర్తించేట్లు చేయాలి. కాని సత్తెనపల్లి తాలూకా రాయడుపాలెం ఫారెస్టు బంజరు విషయంలో రాజకీయ బాధితులకు రెండు మూడువందల ఎకరాలు యివ్వటానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదు, వర్షాలు కురవకుండా పోవు, పంటలు సరిగానే పండుతాయి. కాని పేదలు సాగుచేసుకొనే చోట్ల — బోధనం, చిట్టాల, కాట్రపాడు, పట్రుపాలెం — యిలాంటి గ్రామల్లోనూ, లేక వినుకొండలో 3 డిస్ట్రిక్ట్సు కాలనైజేషన్ సొసయిటీ ఎక్స్ — మిలిటరీ వారందరూ ఫారెస్టు బంజర్లు చేసుకొంటూంటే, ఆ సొసయిటీని రద్దు చేసి వెళ్లగొట్టుతున్నారు. సైంటిఫిక్ కారణాలని ఏవో చెబుతారు. కాని రాజకీయబాధి తులకు ఫారెస్టు బంజర్లు యివ్వటానికి ఆక్షేపణలేదు.

టెనెన్సీ బిల్లు సక్రమంగా అమలు జరుగుటలేదు. ఆ బిల్లు ప్రకారం ప్రభుత్వం తమకు హక్కుయిచ్చిందని, ఆ హక్కును సాధించుకొందామని ప్రజలు పూనుకుంటూంటే, బాపట్లతాలూకాలో వాళ్లు భూస్వాముల భూమి మీదకు దాడివచ్చా రని వెళ్లగొట్టడం, కేసులుపెట్టి శిక్షలు విధించటం వల్ల, రైతులు బ్రహ్మాండమైన నష్టాలకు గురి అవుతున్నారు. ఈ చట్టము అమలులోవచ్చిన అవకతవకలు లోపాలు ఉంటే, దానిని అర్థముచేసుకొని ఇంప్లిమెంట్ చేయుటలో అధికారులకేమ యినా చిక్కులుఉంటే వాటిని ప్రభుత్వం పరిశీలించి సవరించి సక్రమంగా అమలు పెట్టేందుకు వెంటనే పూనుకోవాలిగాని రైతులను శిక్షలకు గురిచేయకూడదు.

పన్నుల విధానంలో యూనిఫార్మిటీలేదు. తెలంగాణాలో ఎక్కువ అని ఆ లెవెల్‌కు మిగతా చోట్ల తీసుకురావాలని, మిగతచోట్ల ఎక్కువ ఉంటే తెలంగాణాను ఆ లెవెల్‌కు తీసుకు వెళ్లాలని, ఆ విధంగా అన్ని చోట్ల పన్నులు పెంచుతున్నారు. అసలు తెలంగాణాలో శిస్తులు ఎక్కువని, తరాలను తగ్గించాలని ఎన్నో సంవత్సర ములుగా ఆందోళన చేస్తూంటే తగ్గించుటకు ప్రయత్నం చేయుటలేదు. ఈ రెండు

సంవత్సరాలలోను లాండ్ సర్ చార్జీ అని, స్టాండర్డైజేషన్ అని, వ్యాపార పంటల పన్ను అని, బెటర్ మెంట్ లెవీ అని, అనేక రకాలుగా పన్నులు వేస్తూ యూనిఫార్మిటీ తీసుకురాకుండా చేస్తున్నారు.

గ్రామోద్యోగుల విషయంలో మంత్రిగారి లెక్కల ప్రకారం సిబ్బంది ఖర్చు, మునసబులు, కరణాలు, వెట్టివాళ్ళు, మోహతాదులు, — వీరందరికీ 17 పర్సెంట్ ఖర్చు అన్నారు. ఈ విషయంలో యిదివరకు నేను అనేక సూచనలు చేశాను. వాళ్ళకు, జీతాలు చాలటలేదు. పంచాయితీలకు — గుమాస్తాలను, స్కావెంజర్సును పోషించే స్థితి లేదు. పంచాయితీలకు ఇచ్చే 12 1/2 రద్దుచేశారు. నూటికి 25, 30, పంచాయితీలకు యిచ్చి ఈ ఎస్టాబ్లిష్మెంటును పంచాయితీ బోర్డ్సుకు హాండోవరు చేస్తే వీళ్ళు లైటర్సుగానో, స్కావెంజర్స్గానో, స్వీపర్సుగానో, పనికి వస్తారు; మునసబు, కరణాలు గుమాస్తాలుగా పనికివస్తారని ప్రపోజల్సు తెచ్చాము. ఇప్పుడు ఖర్చుకూడ అంతే కనబడుతోంది. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని సవరించాలని కోరుతున్నాను.

బాకీలు రద్దు చేయుట గురించి జీ. ఓ. యిచ్చారు. 1952 కు ముందు ఉన్నటువంటి తక్కావీ ఋణాలు, 57 సంవత్సరములో 100 రూపాయల లోపు శిస్తుకట్టుతున్న వారికి రద్దుచేశారు. కాని, 1954 లో యీ ఖాస్రాపాణీ వ్యవహారం వచ్చేటప్పటికే ఎవరికి వారు భూసంస్కరణలు వస్తాయనే ఉద్దేశంతో విభాగాలు చేసుకొని రు. 100 లోపు శిస్తు కట్టేవిధంగా పంచుకొన్నారు. అందువల్ల 1952 కు ముందు ఋణాలు తీసుకున్నటువంటి భూస్వాములంతా తరువాత విభాగాలు చేసుకొనటం వల్ల, యీ జీ. ఓ. ప్రకారం ఋణాలు యివ్వనవసరం లేకుండా పోతున్నది. అందువల్ల, రు. 100 ల లోపు శిస్తువారికి అని అనటంలో 1957 కు ఆ లిమిట్ పెట్టడంలో ఆ ఖాస్రాపాణీల ప్రకారం ఆ ఋణాలు తీసుకున్న భూస్వాములంతా ఏమీ తీర్చనవసరం లేకుండా పోతున్నది. ఆ జీ. ఓ. 1952 తరువాత ఋణాలు తీసుకున్న వారికి అనువర్తించకుండా పోయే పరిస్థితులున్నాయి. ఖాస్రాపాణీలు రద్దు చేయాలని ప్రభుత్వమునకు డబ్బు రావటం లేదనే అభిప్రాయం ఉన్నట్లు మంత్రిగారు చెబుతున్నారు. కాని రిజిస్ట్రేషను ఫీజు ఎట్లా రావాలో దానిని గురించి ప్రభుత్వం ఆలోచిస్తున్నదిగాని, అనేకమంది విక్రయాలద్వారా కొనుక్కొన్నవాటిని రద్దు చేయటం అంటే, మళ్లీ యీ భూములను నన్నింటినీ ఆ భూస్వాములు స్వాధీన పరచుకొనుటకు, వీళ్లకు ఉండే హక్కులు పోయే పరిస్థితులు ఉంటాయి.

రెవిన్యూ బోర్డు చాలా దండుగగా ఉన్నదనే సమస్య ఉన్నది. గ్రామాల్లో మునసబు, కరణాలు, పైన రెవిన్యూ ఇన్స్పెక్టరు, తాసిల్దారు, డిప్యూటీ కలెక్టరు, కలెక్టరు, రెవిన్యూ బోర్డు, దానిమీద గవర్నమెంటు ఉన్నాయి. ఇప్పుడు గవర్నమెంటు ఒక బిల్లు ప్రవేశ పెట్టినది. రెవిన్యూబోర్డు పైనలు కాదని, ప్రభుత్వమే దానికి అధికారము తీసుకొనబోతోందని అన్నారు. రెవిన్యూ బోర్డు అనవసరం. ఇది ఎంతో ఖర్చుతో

కూడుకొన్నది. రెవిన్యూ బోర్డు మెంబరు. వి. వి. సుబ్రిహ్మణ్యంగారంటివారు మొన్న సెమినార్‌లో మాట్లాడుతూ సర్కారు జిల్లాలు అన్నీ యాంటీ సోషల్ అన్నారు. వారు అన్నమాటలు యివి:-" Circar Districts are socially backward and anti-social." ఐ. సి. యస్. ఆఫీసర్లు యీవిధంగా రాజకీయ విషయాలలో ప్రమేయం పెట్టు కొని వారి కర్తవ్యం నిర్వహించుటలేదని. యీ విధంగా తెలంగాణా, ఆంధ్ర భేదాభి ప్రాయాలను తీవ్రమైన స్థితికి తీసుకు పోతున్నారని యివాళ కనపడుతున్నది. అందు కని రెవిన్యూ బోర్డు అవసరం లేదని మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్:— అయితే మీరు రెవిన్యూ బోర్డు తీసివేయాలంటారు,

శ్రీ కె. వెంకటరావు:- అర్యా, 22 మంది దీని మీద మాట్లాడారు. సంతో షం, కాని ప్రధానమైన విచారం ఏమంటే—రెవిన్యూ అడ్మినిస్ట్రేషన్‌లో చిన్న విషయా లమీద—చెరువు, తోట, పుంత-వీటిని గురించి విమర్శ చేయకుండా, నేను యిచ్చిన బ్రాడ్‌ప్రిన్సిపుల్స్ మీద సలహాలు యివ్వవలసినదని కోరితే, చాలా సలహాలు రాలే దనే చెప్పాలి. కొద్దిమంది సభ్యులు మాత్రమే దానిని గురించి ప్రస్తావించారు. మరి చెప్పలేకనో, ఏమో, అసలు మమ్ములను ఎందుకు అడగాలి, నీకు తెలియదా? అని ప్రశ్నకూడా వేశారు. ఇది న్యాయమైనటువంటి విషయం కాదని మనవి చేస్తున్నాను. (Interrption).

మిస్టర్ స్పీకర్:- ఎవ్వరిని మాట్లాడనివ్వను. మంత్రిగారు ఒక గంట మాట్లాడ వచ్చును.

శ్రీ కె. వెంకటరావు :- Thank you, Sir. నిన్న అసలు పునాది సిద్ధాంతాల గురించి మనవి చేశాను. అవన్నీ మళ్లీ నా జస్టిఫికేషన్ క్రింద చెప్పటం మంచిది కాదు. ఇప్పుడు ఆఖరున మాట్లాడిన గౌ. సభ్యుడు, రెవిన్యూ బోర్డు అక్కరలేదని అన్నారు. కావాలోఅక్కరలేదో దానికి వేరే సమాధానం చెప్పకుంటా. మొన్నజరిగిన కలెక్టర్సు కాన్ఫరెన్సు, Confidential Conference అక్కడ వి. వి. సుబ్రహ్మణ్యం గారిచ్చినఉపన్యాసం, నాగిరెడ్డిగారికెక్కడైనా omnipresence ఉన్నదో లేక ఏ విధమైనTaperecorder అక్కరలేకుండా చెవులోకి శృతిలాగా వారికి వినిపించిందో నాకు తెలియదు.

శ్రీ కె. యల్. నరసింహారావు (ఎల్లందు-జనరల్) :- గవర్నమెంటు ఇస్యూచేసిన ప్రెస్‌నోట్‌లో స్పష్టముగా ఉన్నది.

శ్రీ కె. వెంకటరావు :— ప్రెస్‌నోటు చూడలేదు. క్షమాపణ కోరు తున్నాను. ఆ విషయం ప్రెస్‌నోట్‌లోఉంటే. ..

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (సత్తెనపల్లి) :- అది సెమినార్‌లో జరిగిన ఉపన్యాసం.

శ్రీ కె. వెంకటరావు :- "వారు కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో అన్నారని" సభ్యులు చెప్పారు. కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో నేను ఉండటం తటస్థించింది. అక్కడ వారు మాట్లాడలేదు. ఆ సంగతి నాకు తెలుసు. పోతే సభ్యులు "ఇది సెమినార్‌లో జరిగింది" అని అంటున్నారు. నేను సెమినార్ దగ్గర లేను. కనుక ఆ విషయం నన్ను అడిగి లాభంలేదు.

ఇప్పుడు జరిగిన ఉపన్యాసాలు రెండుమూడు పద్ధతులుగా ఉన్నాయి. మొదట సభ్యులు భూసంస్కరణల గురించి మాట్లాడారు. భూసంస్కరణల గురించి సభ్యులు రెండు రకాలైన ఉపన్యాసాలు ఇచ్చారు. అసలు ప్రభుత్వం ఏమీ చేయలేదు అని అన్నారు కొందరు. ప్రభుత్వం చేయటానికి సంకల్పించింది చాలా పెద్దది అన్నటువంటివారు కొందరు ఉన్నారు. ఈ విధంగా రెండురకాలుగా ఉపన్యాసాలు చెప్పినారు. ప్రతిపక్షంవారు ఊరికే ప్రభుత్వాన్ని విమర్శించటమే తమ ధర్మంగా తీసుకొంటున్నారు. నేను భూసంస్కరణలగురించి ఇదివరకె చెప్పిఉన్నాను. మళ్ళీ పునరుద్ఘాటించి, గట్టిగా నేను చెబుతున్నాను. ప్లానింగ్ కమీషన్ చెప్పినటువంటి పద్ధతులు మనస్సులో పెట్టుకొని, ప్రభుత్వం భూసంస్కరణలు తప్పకుండా తీసుకు వస్తుందని నేను గట్టిగా చెబుతున్నాను. ఎవరికైనా నమ్మకంలేదంటే, దానికి నేను సమాధానం చెప్పవలసిందిలేదు. ప్రభుత్వం చెప్పేది నమ్మకుండా, ఊరికే విమర్శించుకుపోతే, దానికి నేను సమాధానం చెప్పటానికి అవకాశం కుదరదు. సభ్యులు ఊరికే విమర్శిస్తూ మాట్లాడినంత మాత్రాన వ్యవహారం జరగదని సభ్యులందరికీ మనవి చేస్తున్నాను.

( Interruptions from some Hon. Members )

*Mr. Speaker* :- No member should stand up and interrupt the hon. Minister. The Minister may proceed with his reply.

శ్రీ కె. వెంకటరావు :- లాండ్ రిఫారమ్స్‌కు సంబంధించిన పునాది విషయాలు తమకు మనవిచేసే ఉన్నాను. దానిలో ఏ ఏ క్లాజులక్రింద ఏమివస్తుందో నేను చెప్పటానికి వీలున్నట్లయితే అదే నేను చర్చకు పెట్టి ఉండేవాడిని. దానికి సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టబడినపుడు, దానిని గురించి చర్చ చేయవచ్చును. దానిలోని లోపాలోపాలు నిరూపించవచ్చు. సభవారి ఇష్టప్రకారం దానిని శాసనం చేయవచ్చును. అంతేగాని, ఇవాళ ఎరగనటువంటి విషయాన్ని మనస్సులో పెట్టుకొని విమర్శకు దిగటం న్యాయం కాదు.

నా మిత్రులు గోపాలకృష్ణగారు కలియుగంలోనుంచి కృతయుగంలోకి వెళ్ళినట్లు కనుపిస్తోంది. వారు ఒకవిషయం చెప్పారు. "మంత్రులు వెయ్యి రూపాయలు తీసుకొంటున్నారు; అట్లాగే రైతుకుకూడ నెలకు వెయ్యిరూపాయలు మిగిలేటట్లుగా చేయకపోతే ఎట్లాగు?" అని అన్నారు. ఇదే పద్ధతిగా మిత్రులు రాజా సాగి సూర్యనారాయణరాజుగారు కూడా చెప్పారు. మంత్రులకు ఇది వృత్తి కాదనే సంగతి వారికికూడ తెలుసు. శాసనసభా సభ్యత్వం ఆయనకు వృత్తి కానట్లు మంత్రులకు ఇది వృత్తి కాదనే సంగతి వారికి తెలుసు. ఒకమాటో, రెండుమాట్లో, మూడుమాట్లో, శాసనసభ్యులక్రింద ఎన్నుకోబడటం, మంత్రులుగా అవటం జరుగుతుంది. తర్వాత, వారంతా జోలిసంచి వేసుకొని, వీధివెంట కాంగ్రెస్ వర్కర్‌క్రింద ఐనా తిరగాలి; లేదా ఇంటిదగ్గర నాలుగు ఎకరాలు ఉంటే, అది పండించుకొని తిననైనా తినాలి. దీనిని తీసుకువచ్చి, దానితో సమన్వయం చేసి, భూసంస్కరణలు వద్దని చెప్పటము, కాంగ్రెసుపార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకమని నేను ఘంటాపథంగా తెలియజేస్తున్నాను.

శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు :- భూసంస్కరణలు వద్దని నేను ఎప్పుడూ మనవి చేయలేదండి.

శ్రీ కె. వెంకటరావు :- సభ్యులు చెప్పింది భూసంస్కరణలు వద్దనికాదు, వెయ్యి రూపాయలు మినిస్టర్‌కు వస్తున్నాయిగనుక, వెయ్యి రూపాయలు స్థాయిలో భూసంస్కరణలు పెట్టవలసింది అని చేసిన విమర్శకు నేను మనవి చేస్తున్నాను. వారు చెప్పినట్లుగా జరుగదు. అది జరిగే విషయం కాదనికూడ సభ్యులు తెలుసుకోవటం ఉత్తమం.

తరువాత, కొంతమంది సభ్యులు పరిపాలన గురించి అనేకమైన విషయాలు చెప్పారు. వారు బంజరు భూములుగురించి చెప్పారు. బంజరుభూముల సమస్యను గురించి నేను నిన్ననే మనవిచేశాను. అన్ని రాష్ట్రాలలో ఉన్నటువంటి నిబంధనలు తీసుకువచ్చాము. "నేను పార్టీనాయకులతోటి, హవుస్‌లో దీనిమీద అనుభవం ఉన్నవారితోటి సంప్రదించి మనం ఇంటికి వెళ్లిపోయేముందరే, దీనిని ఫైనలైజ్ చేసేటటువంటి ఏర్పాటు చేస్తున్నాన"ని మనవి చేశాను. అది ఎవరూ గుర్తించినట్లు కనుపించదు. మా కూర్మయ్యగారితో సహా, అందరూ విమర్శలోకి దిగారు. బంజరు భూములు ఉన్నమాట నిజం. పోతే అది ఆరు లక్షలు ఉందని కొందరన్నారు. మరి కొందరు అది 40 లక్షల దాకా ఉంటుందని చెప్పారు. ఈ బంజరుభూములను ఇతరులకు ఇచ్చేవిషయంలో ఏర్పడే నిబంధనలు గురించి చూసుకోవాలిగాని, దాని విస్తీర్ణం గురించి ఇక్కడ ఆలోచించుకొవటానికి వీలులేదు. ఈ బంజరుభూమిలో సాగుకు

లాయకు అయిన భూమి ఎంత ఉందో చూడాలి. సబ్-మార్జినల్ లాండ్ ఎంత ఉందో చూడాలి. ఒక బంజరుభూమి పండొచ్చు. ఒకటి పండదు. ఎకరానికి రెండు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, రెండు బస్తాలు పండిస్తే, ఆ భూమి సాగుకు లాయకైనదని అనుకోటానికి వీలులేదు. ఊరికే నాకుకూడ ఒక ఎకరం భూమి ఉందని గౌరవంగా చెప్పుకోటానికి వీలవుతుందే తప్ప, దానివల్ల పంటవచ్చే అవకాశం ఉండదు. ఆ భూములు పేదవాళ్ళకు ఇచ్చి వారిచేత పండించినపుడే ఫలితంపొందినట్లు అవుతుందిగాని, ఉన్న బంజరుభూమినంతా తలో ఆరు సెంట్లు చొప్పున చైనాలో పంచి ఇచ్చినట్లు అంగరికి పంచిఇస్తే, అది ఫ్రాగ్‌మెంటేషన్‌కే ఉపకరిస్తుంది గాని దానివల్ల బీదప్రజానీకానికిగాని పేదప్రజానీకానికి గాని, గాని ఎటువంటి ఉపయోగం మనవి చేస్తూన్నాను.

కూర్మయగారు మట్లాడుతూ "వెంకరావుగారు ఇదంతామార్చేస్తునారు. వారికిశక్తి ఉన్నది, వారుగమత్తుగా తీసుకువెడుతున్నారు అని అన్నారు. నాకుఅటువంటి ప్రభావం ఉన్నదని వారు గుర్తించటం, ఒకమనిషిగా నాకు సంతోషమేగాని. పరిపాలకుడుగా మాత్రం నాకుసంతోషంకాదు. కొన్నాళ్లఆయన, నేను భాగస్వాములమే. ఏ.జి.ఒ తయారుచేసినా ఆయన, నేను భాగస్వాములమే. కొన్నాళ్ళు సంజీవయ్యగారు నేను భాగస్వాములం. అంచేత ఇప్పుడు సీనియర్ అని చెబితే భయపడడు కూర్మయ్య. ఎన్నో వద్దని చెప్పాను, ఆయనకి. అవన్నీ మానేడు, ఇదొక్కటే మానకుండా ఉన్నట్లు తెలుస్తోంది.......

(Interruption)

నేను చెప్పింది అర్థంచేసుకొని కూడవారు అపార్థం కల్పించుకొంటున్నారు. ఆయనను నేను మానమని చెప్పింది ఇదికాదు, ఇంకోటి. అది వారుమానేదానికి కూడ. ఒప్పుకొనేటట్లులేదు.

నాకు హరిజనులమీద ఏవిధమైన కోపములేదు. ఆయన గాంధీగారికి ఎంత శిష్యుడో అంతకంటె ఒక అంగుళం (ఎక్కువగా) ప్రియశిష్యుణ్ణినేను. ఒక విషయం మాత్రం నేను కూర్మయ్యగారికి సవినయంగా మనవిచేస్తున్నాను. గాంధీగారియొక్క శిష్యులు యీ ప్రపంచంలో ఉన్నంతవరకే యీ హరిజనులమీద ప్రత్యేక అభిప్రాయం, అభిమానం ఉంటుందిగాని, ఎకనమికల్‌గాను, సోషల్ పర్పస్‌కోసంగాను, వీళ్ళకు ఏదైన చేసేవాళ్ళు ఉంటారుగాని, "పొలిటికల్‌గా వీళ్ళను పైకి తీసుకురావాలి. వాళ్ళు మనమీద రాళ్ళు రువ్వినా, వాళ్ళయొక్క క్షేమాన్ని పరిపాలించాలి" అనేటటువంటి ఉద్దేశం ఉండేవాళ్ళు ఉండరు. కనుక, ఆయన, నేను మిగిలిన యీ ఉద్దేశంగలవారు బ్రతికిఉన్న కాలంలోనే, శాంతిగా యీ సమస్య పరిష్కారం చేసుకోవాలిగాని, ఇంకొకరిని దూషించటం వల్ల యీ సమస్యపరిష్కారం జరగదని వారికి మనవి చేస్తున్నాను.

తర్వాత విషయం, పొలిటికల్ సఫరర్స్‌గురించి, మన నాగిరెడ్డిగారికి ఎప్పుడూ రాత్రింబగళ్ళు కలలో యీ పొలిటికల్ సఫరర్సే కనుపిస్తూ ఉంటారు. పొలిటికల్‌సఫరర్స్ చేసిన పాపం ఏమిటి? ఈ దేశానికి స్వాతంత్రం సంపాదించటం పాపమయిందా? "వారికి కొద్దిపాటి సహాయం చేద్దామని ప్రభుత్వం సంకల్పిస్తోంది. మీరు దీనిని గురించిమాట్లాడకండి" అని నేను సభవారికి చెప్పినాకూడ వారు తమదృష్టిలోకి తీసుకోవటంలేదు. నేను తిరిగి మనవి చేస్తున్నాను పొలిటికల్ సఫరర్స్‌కు రాష్ట్రం మొత్తంమీద అంతా కలిపి, చెప్పదగినంత భూమికూడ ఇవ్వలేదు. మొత్తం 4 వేల 3 వందల మందికి ఇప్పటికి 30 వేల ఎకరాలు కూడ పుట్టలేదు. మిగిలినవారు 11 వందల లోపుఉన్నారు. ఇందులో 600 మంది వెస్ట్‌గోదావరి జిల్లాలో ఉన్నారు. వారికి ఒక బంజరుభూమి ఇవ్వటానికి చూస్తున్నాము. ఈ పొలిటికల్‌సఫరర్స్ అన్ని జిల్లాలలో కలిపి మూడు నాలుగు వందల మందికంటె ఎక్కువమంది ఉండరు. హరిజనులకు, పేదవారికి భూమి ఇవ్వమని అడగండి. అందులో న్యాయం ఉన్నది...

నేనేదో సమాధానము చెప్పలేదని అన్నారు. భూములున్నవారికే భూములిచ్చారని విమర్శలుచేశారు. Political Sufferersలో పేద వారికి భూమి పంపిణీ స్కీము క్రింద భూమి యిస్తే అప్పుడు సభ్యులు చెప్పినదే రైటు, ఈ భూమి యివ్వడమనేది యీ political sufferers అనేవారికి వారు స్వతంత్రోద్యమములో పాల్గొని దేశమునకు చేసిన సేవకు అదీ ఒక గణింపు క్రింద యిచ్చాముగాని దానికి దీనికి సంబంధము లేదు. ఇందులో పేదవారని, భూమిఉన్న వారు అని ఏమిలేదు. కాబట్టి ఇక దానిని గురించి ఆలోచన ఏమీలేదు. ఇక మిగిలిన భూములను గురించి ఒక్క విషయము చెప్పదలచుకున్నాను. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించినంతవరకు 2,54,599 ఎకరాలు భూమి 77,473 మందికి భూమి* లేనటువంటి వారికి ఇవ్వడమైంది. రోంపేరు ఏరియాలో 4,690 ఎకరముల భూమి ఇంతవరకు 4,940 మందికివాయి జమాబార్లకు 4,356 గురు political sufferers కు యివ్వడము జరిగింది. ఇదిఅంతా విమర్శనార్హమైన విషయముకాదు. ఇకపోగా మరొక ప్రధానమైన విషయము ఉన్నది. యింతవరకు ఇచ్చినభూమి పోను మిగతా భూమిలో సాగుకులాయకీగాఉన్న భూమిని ఏదోరకంగా త్వరలోనే ఇవ్వటానికి ప్రయత్నములు జరుగుచున్నవి. అది అంతా మిత్రులకోసం వినియోగించటానికి కాదని మాత్రము చెబుతున్నాను. దానిని పంపకము చేసే విషయములో అందరి సలహాలతోటి, సంప్రదింపులతోటి ఒక వ్యవస్థను ఏర్పాటుచేసి, ఇదివరకేమైన లోపాలు జరిగియుంటే, అవిఅన్నీ సరిదిద్దుకోవలసియుంటుంది గనుక, అవి సరిదిద్దుకుంటూ భూమి పంపిణీ చేయబడుతుంది. తరువాత కొల్లేరుప్రాంతములో 48 వేల ఎకరములభూమి unsurveyed tract ఉన్నది. దాని విషయములో co-operative farming start చేయమని కూర్మయ్యగారు అంటున్నారు. కాని ఇదివరకు హరిజనులకు field

labour socities ద్వారా ఒకచోట co-operative farming ఏర్పాటు చేశారు. అందులో 60 మంది మొదట్లో పొలానికి వచ్చారు. 15 రోజులు జరిగిన తరువాత 57 గురు వచ్చారు. తరువాత 27 రోజులు అయిన తరువాత 32 మందే వచ్చారు. చిట్టచివరకు నాసంగతి ఏమిటి అని అందరూ దెబ్బలాడుకున్నారు. కాబట్టి అది అంత బాగా పని జరగలేదని రుజువు అవుతున్నది. ఇలాంటివి బాగా successful గా చేయాలంటే ప్రభుత్వమే యీ వ్యవహారము చేయాలి. నేను ఇదివరకే వాగ్దానము చేశాను. అది ప్రభుత్వముద్వారానే నిర్వహింపబడుతుందని మనవి చేస్తున్నాను.

తరువాత village officers ను గురించి కొందరు మాట్లాడారు. నేను చేసిన వాగ్దానము ప్రకారము వారి జీతాలు పెంపు విషయము మొన్ననే పరిష్కారం అయిపోయింది. ఆ రిపోర్టును సభ్యులకు అందజేశాను. ఇక మిగిలిన విషయాలు ఉన్నవి. అవికూడ పరిశీలనలో ఉన్నవి. ఇక భూములు విడదీయడము విషయములో కరణమును అడగక పోవడమువల్ల తేడాలు కన్పించుచున్నవని అన్నారు. వాళ్ళను సంప్రదించితే, అవి అన్నీ పాడు చేశారని మరొకరు అన్నారు. దీని విషయములో ఒకరు ఒక విధముగ complement ఇవ్వడము, ఇంకొకరు ఇంకో విధముగ విమర్శన చేయడము జరిగింది. ఇవిరెండు ఒకటిగానే ఉన్నవి. ఏమైనప్పటికినీ వారు అడిగిన వాటిలో రాతి పన్ను అనేది ఉన్నది. యీ పన్నులో ఒక భాగము కరణమునకు యిచ్చే ఏర్పాటుకూడ చేస్తున్నాము. మిగిలినది రాయి ఖరీదు. అదిమాత్రం ప్రభుత్వానికి చెందుతుంది. ఈ విషయములో రూల్సుఅన్నీ చేశాము. త్వరలోనే ఈ వ్యవహారము జరుగుతుంది. తరువాత వాళ్ళు full time servants అంటున్నారు కాని, వారు full time servants కాదు. ఏదో lower division clerk, upper division clerk మాదిరిగా ఒక డిప్యూటీ కలెక్టరుకు ఇచ్చిన మాదిరి జీతము కావాలంటే అది జరిగే విషయముకాదు. వానివల్ల 40 ﷼o/ocut అవుతుంది. దానిని విలేజి పంచాయతీలకు ఒప్పగిస్తే ప్రభుత్వానికి ధనము వుంటుంది అని అన్నారు. దానివల్ల ప్రభుత్వానికి కొంతడబ్బు వస్తే రావచ్చు. పంచాయతీ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఆ విషయమును గురించి మనము చర్చించుకోవచ్చు.

తరువాత estate villages లో survey and settlements గురించి సాగి సూర్యనారాయణ రాజుగారు యింకా ఇతరులు మాట్లాడారు. రమణారెడ్డిగారి constituency లో పర్యటించాను. అప్పుడు మన కాశిరెడ్డిగారు కూడ నా వెంటనే ఉన్నారు. ఆ టైములో గ్రామాలలో ఉన్న కష్టసుఖాలను గురించి చెప్పారు. వారి ఎదుటనేను ఒంగోలుస్టేషనుకు settlement officer ను telegram ద్వారా పిలిపించుకుని, ఫలానా రీతిగా మార్పుచెయ్యండి, ఇందులో యీ difficulty వస్తున్నది అని

నేను మార్పు చేయించాను. ఈ విషయములో కాశిరెడ్డిగారు నాకు వ్రాసిన వందనముల ఉత్తరముకూడ నా వద్దనే ఉన్నది. అందువల్ల ఆ విషయములో ఆలస్యము జరగడము అనేది ఏమీలేదు. కాని procedure లో ఎక్కడైనా, ఏమైనా తేడా ఉంటే ఉండవచ్చు. దానిని సవరించుకోటానికి వీలు అవుతుంది. అయితే ఒక్క విషయము మాత్రము జ్ఞాపకము ఉంచుకోవలసి ఉన్నది, ఇదివరకు అయిదు ఎకరాలు అని శిస్తు కట్టే పొలము యిప్పుడు కొలిస్తే, అది 9 ఎకరాలు కొలతకు వచ్చింది. దానివల్ల ఇంతవరకు నష్టమువస్తే వచ్చి ఉంటుంది. దానివల్ల ఇప్పుడు విచారించి లాభములేదు. కాని ఈ 9 ఎకరాలు అయిదు ఎకరాలుగానే పరిగణించడము అనేది న్యాయమైన విషయము కాదు. ఇక మిగిలిన విషయాలను గురించి అంటారా, చెరువు ఎవరికో యిచ్చారు. యీ కాలవ అంటే ఇంకా ఎవరికో యిచ్చారు అనేవిమర్శలు ఉన్నవి. అయినను దానికి ఒక procedure అనేది ఉన్నది. అలాంటి వాటికి ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవచ్చు. అందులో ఏమైనా అన్యాయాలు జరిగి ఉంటే, అది ప్రభుత్వం తప్పకుండా సరిచేస్తుందని అంటున్నాను.

తరువాత Harijan House sites, encroachments గురించి కూడాచెప్పాను. దీనికి ఒక చట్టము సభవారి ఎదుటనే ఉన్నది. అందులో ఇదివరకు encroachments ను గురించి ప్రభుత్వానికి Appeal చేసుకునే provision ఈ Act లో లేదు. ఇది most deserving clause అయినప్పటికిన్నీ, ప్రస్తుతము ప్రభుత్వము Interfere గావటానికి వీలు లేకుండా ఉన్నది. అలాంటి provision యిప్పుడు యీ బిల్లులో ఏర్పాటు చేస్తున్నాము. దానివల్ల ప్రభుత్వము పవర్ పుచ్చుకుంటున్నది. ఇలాంటివి నిత్యమూ వచ్చే వ్యవహారాలు గనుక, యీ విషయమును గురించి త్వరలోనే రెండు బిల్లులు తెస్తున్నాము. అవి సభ్యులందరు త్వరలో ఆమోదిస్తే Emergency Act గా చేస్తున్నాము. దీనికి తరువాత కోర్టులకు పోయి అక్కడ నెలల తరబడి ఆలస్యము జరిగినను, ముందుగా ఆ స్థలములలో ప్రవేశించి, పని అంతా జేసుకోటానికి హక్కు కలిగించే చట్టము గనుక వీటిని త్వరలో ఆమోదించమని సభ్యులను కోరుతున్నాను. తెలంగాణాలో కొన్ని అయిటములు, ఆంధ్రలో కొన్ని అయిటములు ఉన్నవి. ఇప్పుడు వాటినన్నింటిని సమీకరణ చేసి, అందులో ముఖ్యంగా పేదవాళ్ళకు గృహనిర్మాణము జరగటానికి provision బిల్లులో ఏర్పాటు చేశాము గనుక, వీటిని వెంటనే పాసు చేయమని అంటున్నాను. తరువాత యీ encroachments విషయములో ప్రభుత్వానికి అప్పీలు provision లేదు. Encroachments అనేది విమర్శనార్హమే. అంటే ఎవరి యిష్టము వచ్చిన చోటు వారు అంటే రోడ్డుకు అడ్డముగా దేవాలయము కట్టమని కాదు, గాంధీగారి statue ను నిలబెట్టమని కాదు. ఒకచోట గాంధీగారి statue పెట్టారు. మొన్న నెహ్రూగారు వచ్చినప్పుడు కారు పోయి దానికి గుద్దుకునే టట్లయినది. దేవాలయము కట్టితే తీసి వేయమని చెప్పవచ్చు. గాంధీగారి statue నిల

బెట్టితే, దానిని తీసివేయమని చెప్పటానికి నోరు రాదనుకోండి. కాబట్టి యిలాంటివి చేయమని కాదు. కాబట్టి ఎక్కడైనా ఒక చోటులో ప్రవేసించి, అక్కడ పది సంవత్సరముల పాటు పండించుకుని జీవించేవాళ్ళకు కొంత preferencial right కలగటానికి వీలుఅవుతుంది. అందులో కొంతమంది యీ భూములు political sufferers కు యివ్వడము ఎందుకు అని అనేబదులు ఫలానా పొలము, స్థలము కావాలని అడగ వచ్చు. తీసుకోవచ్చు. అంతే కాని, ప్రభుత్వము political sufferers కు యిచ్చామని అంటే, వాళ్ళకు యింతవరకు ఎంత ఇచ్చామని విమర్శలు చేయ నారంభిస్తున్నారు? ఇప్పటికి వారికి యిచ్చినదంతా చేరితే 30 వేల ఎకరాలకంటే ఎక్కువ లేదు. దేశములో ఎంతమందో సేవచేస్తేనే గానీ మనకు యీ స్వతంత్రము అనేది ఏర్పడ లేదు. ఆ విషయము మనము మరచిపోగూడదు. వాళ్ళు చేసిన సేవకు మనము కృతజ్ఞతా పూర్వకముగ యిచ్చేది యీ భూమి. దీనిని గురించి ఏమైనా వ్యక్తిగత అభిప్రాయలు ఉంటే ఉండవచ్చు. ఆ దృష్టితో గాకుండా, యిప్పుడు మిగిలిన భూమిని ఏ విధముగా పంపిణీ చేయడము అనేది చూచుకోవాలి అని అంటున్నాను.

మరొక సభ్యుడు ఈ Settlement reports అన్నీ ఏమిచేశారని అన్నారు. అరవై రిపోర్టులు పరిశీలించి, భూమి పైన శిస్తును దేశమంతట సమన్వయించడం కోసము ప్రయత్నములు జరుగుతున్నవి. దీనికి ఒక కమిటీని వేశామని అన్నాను. ఈనాటి వరకు వాటికి వున్న చరిత్ర, ఇంతకు ముందు జరిగిన లోపాలు అక్కడ, ఇక్కడ, ఎక్కడ, ఏమేమి తేడాలు ఉన్నవో, అలాంటివి ఏమీ లేకుండా Wet acre కు అయితే ఇంత అని, Dry acre కు అయితే ఇంత అని, దానిమీద remission rules, యీలాంటి విషయములు అన్నీ ఎన్నో పరిశీలించ వలసి ఉన్నది, దానికి కొంత టైము పడుతుంది. అన్ని వ్యవహారాలు ఆలస్యము లేకుండా జరుగుతూనే ఉన్నవని మనవి చేస్తున్నాను.

ఇకపోతే Land Reforms విషయములో exemptions ను గురించి కొందరు సభ్యులు మాట్లాడారు. దానినిగురించి ఇప్పుడు నేను ప్రస్తావించదలచలేదు. కారణము ఏమిటంటే, ప్రభుత్వము యింతవరకు Land Reforms Bill ను, గురించి ప్రచురించలేదు. సీలింగును, యింతఉంటుంది, అంతఉంటుంది అని ఎవరైనా చెబితే, అవి అన్నీ ఊహగానాల క్రింద లెక్కచేయవలసిందే. బిల్లును ప్రచురించేవరకు ఏదీ నిజము అని అనుకోవద్దని మనవి చేస్తున్నాను. ముందుగానే విమర్శనలుమాత్రము వద్దని అంటున్నాను.

ఒక సభ్యుడు బహుశ రాములుగారే అనుకుంటాను. ఆయన చక్కని తెలుగు భాషలో మాట్లాడుతూ మంత్రిగారు మాట్లాడేది కొండ నాలుక్కి మందిస్తే, కొన నాలుక

నుంచా అని అన్నారు. సాధారణముగా ఎవరైనా మాట్లాడేది కొననాలుకనుంచి మాట్లాడుతారనుకుంటాను. కాని కొండనాలుకతో మాట్లాడడము నేను చూడలేదు. ఎప్పుడైనా శ్లేష్మము అడ్డుపడితే కొండనాలుక మాండల్ సొల్యూషను ఉపయోగిస్తుందేకాని మాట్లాడటానికి పనికిరాదు. ఎవరైనా మాట్లాడేవారు వుంటే, అది నాకు నేర్పితే నేనుకూడా నేర్చుకోటానికి సిద్ధమే. కాని ఇప్పటివరకు నేను ఏదిమాట్లాడినను కొననాలుకతోనే మాట్లాడుతున్నాను.

కొంతమంది గౌరవసభ్యులు :— అందువల్లనే అనుమానాలు కలుగుతున్నవి.

శ్రీ కె. వెంకటరావు :— గౌరవసభ్యులు అంతగా అట్టే అనుమానము పడనవసరములేదు. ఏదో శ్లోకము భగవద్గీతలో ఉన్నది. "సంశయాత్మ వినశ్యతే" అని సంశయములు పడనక్కరలేదు

కొంతమంది సభ్యులు 20 ఎకరాలు ఉన్నవారు అందరు తెలియపరచమని ఒక Ordinance తెచ్చి ముందుగా మంత్రిగారి మిత్రులకు పంపిణీ చేసుకోటానికి ముందుగా warning యిచ్చారని విమర్శలు చేశారు. అయితే యీ పంచుకొనే వారందరు నాకు మిత్రులేనంటారా? ఇది ఒక allegation నామీద ఆరోపించారు. ముందుగానే భూములను వాళ్ళవాళ్ళ మధ్య పంపిణీలు చేసుకోటానికి వీలుకలుగ జేశారుఅని మరొక step ముందుకు వెళ్ళారు. అయితే రాష్ట్రము మొత్తముమీద నాకు యింతమంది మిత్రులు వుంటే, నేను నిజముగ సంతోషించేవాడినే. కాని ఇది అందుకొరకు పుట్టిన Ordinance కాదు. తెలంగాణాలో ఇదివరకు భూసంస్కరణల సందర్భములో లెక్కలు సేకరించబడినవి. అందువల్ల ఆంధ్రలో కూడ అలాంటి లెక్కలు సేకరించవలసివచ్చింది. అసలు ప్రతివాడికి ఒక్క ఎకరము వున్నా, declaration ఇవ్వమని కోరివుంటే బాగావుండేది. కాని 20 ఎకరాలవాళ్ళు సాధారణముగ educated families వారుగా వుంటారు. వాళ్ళు యీ లెక్కలు త్వరలో తేలికగా యివ్వగలుగుతారన్న ఉద్దేశ్యముతో 20 ఎకరాలు అని పెట్టాము. అదితప్ప వేరేమికాదు.

ఇప్పుడు నాదగ్గర 10 జిల్లాలకు సంబంధించిన లెక్కలున్నాయి. ఇవి provisional figures. Total యింకా పూర్తికాలేదు. Census of holding నుగురించి సభ్యులు ఎక్కువగ చెబుతున్నారు. కనుక నేను యీవిషయాన్ని మనవి చేస్తున్నాను. Ordinance జారీచేయబడిన వెంటనే December 1956 లో రిజిష్టరు అయిన భూమి ఎంతో 1957 సంవత్సరంలో రిజిష్టరు అయిన భూములెన్నో వచ్చిన ఆదాయమెంతో

వివరాలు పంపవలసినదని order వేశాను. అట్లావివరాలు తెప్పించిచూస్తే 10లక్షల రూపాయలు మాత్రమే తేడా ఉన్నది. గౌ॥ సభ్యులు చెప్పేది నిజమైతే, ప్రభుత్వానికి ఎన్నోకోట్ల రూపాయల ఆదాయం వచ్చియుండాలి. పోనీ కొంతమందికి అపకారం జరిగినా ఈవిధంగానైనా ప్రజానీకానికి ఉపయోగ పడుతున్నదేమో అనుకున్నాను. కాని ఇప్పటి లెక్కల ప్రకారం stamp fees, registration fees కలిసి 10 లక్షల రూపాయలు మాత్రమే వచ్చినాయి. Registration లో గౌ॥ సభ్యులు అనుకొన్నంతగా జరగలేదని ఋజువు అయినది. Census గురించికూడా ఒకటి, రెండు విషయాలు మాట్లాడుతాను. ఈ census ప్రొవిజనల్ ఫిగర్సు. తరువాత వీటిని Quote చేస్తే ఒప్పుకోను. ఈ వ్యవహారమంతా పూర్తి అయిన తరువాత అచ్చు వేయించి ప్రకటిస్తాము. నేను ఇవి కాగితంమీద వేసుకొన్న కూడికలుమాత్రమే. కాబట్టి గౌ॥ సభ్యులు వీటిని ఎక్కడా Quote చేయవద్దని కోరుతున్నాను.

ఈ క్రిందివి జిల్లాలవారిగా Dry Land కు సంబంధించిన అన్నిరకాల హోల్డింగులూ కలిపి 20 ఎకరాలపైగా ఉన్నవారి సంఖ్యలు :

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం జిల్లా<br>ఈ జిల్లాలో 1000 ఎకరాలున్న<br>వారు ఒక్కరు కూడా లేరు. | 185 మంది |
| 2. | విశాఖపట్టణం జిల్లా<br>ఈ జిల్లాలో 1000 ఎకరాలున్న<br>వారు ఒక్కరుమాత్రం ఉన్నారు. | 525 ,, |
| 3. | పశ్చిమ గోదావరి జిల్లా<br>వెయ్యి ఎకరాల మెరకభూమి<br>గలవారెవ్వరూ లేరు. | 1754 ,, |
| 4. | కృష్ణా జిల్లా | 2,721 ,, |
| 5. | గుంటూరు జిల్లా | 12,139 ,, |
| 6. | నెల్లూరు జిల్లా | 6,601 ,, |
| 7. | చిత్తూరు జిల్లా | 529 ,, |
| 8. | కడప జిల్లా | 6,308 ,, |
| 9. | అనంతపూర్ జిల్లా | 16,689 ,, |
| 10. | కర్నూలు జిల్లా | 21,926 ,, |

ఇంచుమించు యివన్నీ ఎకరానికి 2 అణాల పన్ను ఉన్న మెరకభూములు.

Wet Land కు సంబంధించిన వివరాలు :—

| | జిల్లా | నంబరు |
|---|---|---|
| 1) | శ్రీకాకుళం | 127 మంది |
| 2) | విశాఖపట్టణం | 79 ,, |
| 3) | పశ్చిమ గోదావరి | 1,483 ,, |
| 4) | కృష్ణా | 983 ,, |
| 5) | గుంటూరు | 314 ,, |
| 6) | నెల్లూరు | 226 ,, |
| 7) | చిత్తూరు | 57 ,, |
| 8) | కడప | 15 ,, |
| 9) | అనంతపురం | 24 ,, |
| 10) | కర్నూలు | 22 ,, |

ఒక గౌరవ సభ్యుడు :— East Godavari వి చెప్పలేదేమి ?

శ్రీ కె. వెంకటరావు :— East Godavari కి సంబంధించిన వివరాలు రాలేదు. వస్తే చెప్పేవాడినే.

Wet land మరియు dry land కలిసి ఉన్నవాటి వివరాలు:-

| | | ఎకరాలు |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం | 7,933 |
| 2. | విశాఖపట్టణం | 5,628 |
| 3. | పశ్చిమగోదావరి | 10,930 |
| 4. | కృష్ణా | 11,180 |
| 5. | గుంటూరు | 10,548 |
| 6. | నెల్లూరు | 16,304 |
| 7. | చిత్తూరు | 8,196 |
| 8. | కడప | 7,056 |
| 9. | అనంతపురం | 17,654 |
| 10. | కర్నూలు | 12,259 |

వీటిని final figures గా తీసుకోవద్దని గౌ॥ సభ్యులను మనవిచేస్తున్నాను. సరైన వివరాలన్నీ సేకరింపబడిన తరువాత, కొద్ది రోజులలోనే ప్రకటించుతాము. అవి సభ్యులందరికీ అందజేయబడతాయి.

కరువు పనులను గురించి యిందాక ఒక సభ్యులు విమర్శ చేశారు. 'కరువు పనులు' అని ఉపయోగించే పరిస్థితి యీ ప్రభుత్వానికి యింతవరకూ ద్యోతకం కాలేదు. అక్కడకూడా వర్షాలు సరిగా లేనందువల్ల పంటలు సరిగా పండడం లేదు. అటువంటివాటి విషయంలో తీసుకోబడిన చర్యను సభవారికి మనవి చేశాను ఆమధ్య మా ఆఫీసరులను, రెవిన్యూబోర్డువారినీ సంప్రదించి, వచ్చిన report ను పరిశీలిస్తే తెలంగాణాలోని దేవరకొండలోనూ, కడపజిల్లాలో 5 తాలూకాలలోని కొన్ని గ్రామాలలోనూ సుమారు రు. 300 remission యివ్వడం తటస్థించింది. ఈ విషయమై ఇంకొకసారి మళ్ళా చెబుతున్నాను. ఎక్కడైనా అకాలపరిస్థితులు ఏర్పడినట్లు ప్రభుత్వానికి తెలిసినట్లయితే, ఎప్పుడు ఏ సహాయం కావలసినా చేయడానికి యీ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. ఇటువంటి పరిస్థితులేర్పడినప్పుడు కొంతమంది సభ్యులు ప్రభుత్వ దృష్టికి తెస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో అందరికి సహాయం చేస్తామని మనవిచేస్తున్నాను.

Minor Irrigation గురించి కొంతమంది సభ్యులు చెప్పారు. మైనర్ ఇరిగేషన్‌కు యీ ప్రభుత్వం తక్కువ grant యివ్వలేదని నేను చెప్పిన అంకెల ప్రకారం తెలిసే ఉంటుంది. ఆంధ్రప్రాంతంలో ప్రతి సంవత్సరమూ రు. 34 లక్షలు allotment ఉంటుంది. ఆ మధ్య మళ్ళీ 12, 13 లక్షలు యిచ్చాము. అందుచేత తక్కువ యిస్తున్నారనడానికి వీలులేదు. తెలంగాణాలో రెవిన్యూ డిపార్టుమెంటుకు సంబంధించిన 12 వేల tanks కూ 40 వేల రూపాయల ఖర్చు ఉన్నది. కొన్ని minor irrigation works P.W.D. క్రింద ఉన్నాయి. రెవిన్యూ డిపార్టుమెంటుకు సంబంధించినంతవరకూ "తక్కువ" అనడానికి వీలులేదు. జమీందారీ ఏరియాలను ప్రభుత్వం తీసుకోవడం వలన చాలా చెరువులను మరమ్మతు చేయవలసిన ఆవశ్యకత ఉన్నది. ఆంధ్ర తెలంగాణాలకు కలిసి రెండవ పంచవర్షప్రణాళికలో సుమారు 4 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఈ మొత్తాన్ని ఖర్చుచేసి రెండు ప్రాంతాలనూ ఒక స్థాయికి తెచ్చే ప్రయత్నం జరుగుతున్నది. అకాల పరిస్థితులు ఏర్పడేచోట్ల, రోడ్డు వేయడం మొదలైన పనులకంటే మైనర్ ఇరిగేషన్ పనులమీదే ప్రభుత్వ దృష్టి లగ్నమై ఉన్నదని సభకు మనవిచేస్తున్నాను.

ఇక బి. రామరెడ్డిగారు కొన్ని సూచనలు చేశారు. ఏ రైతు ఎంత పన్ను కట్టాలో తెలియక అనేక బాధలు పడుతున్నారని వారు చెప్పారు, Village Officers Committee's report లో దీనికి పరిష్కార మార్గం సూచించబడింది. ఇకనుంచి ప్రతిరైతుకూ ఒక క్యాలికో బైండ్ పాస్‌బుక్ ఇవ్వ బడుతుంది. ఆ book లో ఆ రైతుకు ఎక్కడ ఎంత ఆస్తిఉన్నదో; ఎంత పన్నుచెల్లించాలో వివరాలతోసహా

ఉంటుంది. రైతులు చెల్లించిన పన్ను ఆ పుస్తకంలో జమ కట్టబడుతుంది. ఇక మళ్లా దానిని దిద్దుటకు వీలులేకుండా నీలికాగితం పెట్టిన duplicate receipt రైతులకు యిచ్చే ఏర్పాటు చేయబడుతున్నది. కాబట్టి ఇక అటువంటి కష్టం ఉండదను కొంటున్నాను.

ఈ Village Officers పన్నులు వసూలు చేయడమేకదా: వీరిని తీసేసినట్లయితే ప్రభుత్వానికి చాలా లాభం వస్తుందని కొంతమంది సలహా యిచ్చారు. కాని Village Officers పని, పన్నులు వసూలుచేయడం ఒక్కటే కాదు. అనేకమైన ఇతర పనులుకూడా ఉన్నాయి. అందువల్ల పూర్తిగా వీరిని తీసేపరిస్థితి యింకా రాలేదు.

జిల్లా, తాలూకా స్థాయిలో తీసుకొంటే కొన్ని కష్టాలున్నాయని కొంతమంది నిరూపించారు. డిపార్టుమెంటులో కొన్నిబాధలు ఉన్నమాట నిజమే. కాగితం పెట్టుకొని ఎంతోకాలం అయినా జవాబు రావడంలేదని కొంతమంది చెప్పారు. సామాన్యంగా యిది జరుగుతున్న విషయమేనని మనఅందరుకూ తెలుసును. దానికి తగిన ఏర్పాటు చేస్తున్నాము. మంత్రిగారుకూడా ఉత్తరములకు జవాబు ఇవ్వడంలేదని కొందరన్నారు. చిదంబరరెడ్డిగారు ఒక minor irrigation tank గురించి mention చేశారు. ఆ విషయమై నేను విచారణచేస్తాను. అనంతపురంలో ఏర్పడిన అకాలపరిస్థితుల గురించి వారు వ్రాసిన D.O కు revenue ను suspend చేయాలని Orders ఎన్నిరోజులలో వెళ్లాయో, వారినే చెప్పమనండి. ఎన్నో ఊళ్లకు సంబంధించిన విషయాలను వెనక్కి పెట్టి ఒకఊళ్లో ఉన్న రోడ్డును గురించో, కుంటను గురించో జవాబురాలేదని, మంత్రిగారి దగ్గరనుంచికూడా సమాధానం రాలేదని విమర్శించడం న్యాయంకాదని మనవి చేస్తున్నాను. ఇక, మిడతలు వచ్చి పొలాలు పాడుచేస్తున్నాయని రామచంద్రారెడ్డిగారన్నారు. ఇదివరకున్న శిస్తు రెమిషన్‌రూల్సులో మిడుతలు తిన్నదానికి remission యిచ్చే ఏర్పాటులేదు. అది correspondence లో ఉన్నది. వారు నన్ను చాలాసార్లు ఆ విషయమై అడుగుచున్నారు. కాగితంమీద లేదుఅనేగాని, మిగిలిన విషయాలలో విమర్శన చేయడానికి ఆస్కారం లేదు.

తెలంగాణా విషయంలో 47వ సెక్షను గురించి ఒక ప్రత్యేకమైన విమర్శ వచ్చినది. ఆ విషయంమీద సభా సభ్యులందరి సలహాను కోరినాను. ఆ సెక్షను ఉండాలని కొందరు అంటున్నారు. తీసేయాలని కొందరు అంటున్నారు. ఈ విషయంలో రెండు అభిప్రాయాలున్నాయి. కాబట్టి వెంటనే మార్పుచేయడానికి వీలులేదు. ఈ చట్టంవల్ల తమకు లాభిస్తుందని కొంతమంది అనుకొంటున్నారు. ఈలోపున పటేల్, పట్వారీలు 'వెంకయ్య' పేరున ఉండవలసినదానిని 'పుల్లయ్య' పేర మార్చే

శారు. దానినే 3 సంవత్సరాలు రామయ్యా పేర వ్రాశారు. ఇప్పుడు అది రామయ్యకు ఇవ్వాలో, పుల్లయ్యకివ్వాలో, వెంకయ్యకివ్వాలో తెలియదు. ఇప్పుడు మార్పుటంవల్ల నష్టం వస్తుందని కొందరంటున్నారు. దానినిగురించికూడ సభ్యుల సలహాలను అడిగినాను. సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలు నోట్ చేసుకున్నాను. చర్యకూడ తీసికోవాలనే కోరిక ఉన్నది. అది త్వరలోనే మీముందుకు వస్తుందని ఆశిస్తున్నాను. కాయబంది గురించి రూల్సులేవు. అది విలేజి ఆఫీసర్సు. తహశీల్దార్ల అనుమతిమీద ఆధారపడిఉన్నది. అందువల్లనే Complaints ఎక్కువగా వస్తున్నవి. ఈ మధ్య ఒక Complaint వచ్చింది. 60 ఎకరములవరకు ఒప్పుకున్నారు. కానిరెండు ఎకరములకు తగాదా నడుస్తున్నది. దానికి సంబంధించిన రిపోర్టురాలేదు. ఇప్పుడు తయారుచేసే రూల్సులో ఒక స్థిరీకరణ మార్గమును ఏర్పాటుచేయాలి. ఇలాంటి విషయములలో ఇంకా భూస్వామ్యంమీద ఉత్తరప్రదేశ్‌లో జరుగు పద్ధతిని ఇక్కడ ప్రవేశపెట్టాలనే కోరిక ఉన్నది. అక్కడ గ్రామప్రెసిడెంటు, గ్రామంలో ఎన్నుకోబడ్డ ఐదుగురు పెద్దలు, తహసిల్‌దారు అంతా ఒకచోటచేరి ఆ గ్రామములోని భూమి, పంట విషయం అందరి ముందు చదివి వినిపిస్తారు. ఎవరైనా అభ్యంతరం తెలిపిన విచారించి ఒక జడ్జిమెంటు ఇచ్చి ఒక పుస్తకంలో వెంటనే రికార్డు చేస్తారు. దానిని మార్చుటకు ఎవరికి అధికారంలేదు. ఈ పద్ధతి బాగుంటుంది అంటే ఇక్కడగూడ ప్రవేశ పెట్టాలనే కోరిక ఉన్నది.

Integration of laws గురించి మాట్లాడుచు డి. వి. సుబ్బారావుగారు దానిని Law Commission కు అప్పగించాలన్నారు. పునాది చట్టాలను ఆల్టర్ చేయనప్పుడు Law Commission కు అప్పగిస్తారు. కాని ఇలాంటి చిన్న విషయములను అప్ప గించరు. లాయర్ల సహాయమే తీసుకొనబడుచున్నది. Law Department లో అంతా లాయర్లే. నాకు లాయర్ పట్టాలేకపోయినా గొప్పలాయరైన జె. వి. నర్సింగ రావుగారు ఉన్నారు. ఆంధ్ర టెనెన్సీ చట్టంలో తప్పులున్నవని రూల్సుకమిటీవారు point out చేస్తున్నారు. Rate of rent ను తగ్గించే అవకాశమున్నది. కనుక దానితో పాటు ఆంధ్ర టెనెన్సీ చట్టమును సవరింపవచ్చును.

ఒకరు village officers కు కన్నుతుడుపు మాత్రమే జరిగినదని అన్నారు. ఆ కన్నీళ్ళు విలేజి ఆఫీసర్ల కళ్ళలో ఉన్నాయా? లేక రైతుల కళ్ళలో ఉన్నాయా? అనే విషయం ఆలోచించుకోవలయునని మనవి చేయుచున్నాను. Dry rate, wet rate తారతమ్యము, నీటి సోర్సు గురించి ఒక నిర్ణయం తీసికొంటామని మనవి చేస్తున్నాను. విజయనగరం ఎస్టేటులో educational qualifications మీద ఉద్యోగస్థులను తీసివేసినారని శ్రీరామమూర్తిగారు అన్నారు.

దానికి సంబంధించిన వివరములన్ని నా దగ్గరఉన్నవి. తీసివేసినవారికి తిరిగి ఎందరికి ఉద్యోగాలుయిచ్చినది. ఎంతమంది పర్మనెంటు అయినది; ఎంతమంది పర్మనెంటు కానున్నది అనే వివరములున్నవి. ఇంతవరకు పర్మనెంటు కానివారిని పర్మనెంటు చేయుటకు ప్రయత్నం జరుగుచున్నదని మనవి చేయుచున్నాను. చిన్న విషయములు చాలా ఉన్నవి. వాటిని గురించి చెప్పుటకు చాలా టైమ్ పడుతుంది. సభ్యులు ఇచ్చినటువంటి ఉపన్యాసములకు కృతజ్ఞుడను. ప్రభుత్వం కొండనాలుకతో గాకుండ అసలు నాలుకతోనే మాట్లాడుచున్నదని స్పష్టం చేయదలచుకున్నాను. కాంగ్రెసు ఆదేశానుసారం ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన, పెట్టబడు భూసంస్కరణలు, భూమిశిస్తు ఇతర విషయములలో ప్రధానంగా రైతులోకం కలిగిన ఈ ఆంధ్రప్రదేశ్‌లో అందరికి సంతృప్తికలిగే విధంగా వ్యవహారం సాగుతుందని, లోపాలు సరిదిద్దబడుతాయని జరుగుచున్న కార్యక్రమముతో తామంతా సానుభూతి చూపాలని నా ఈ నాలుగు డిమాండులను cutmotions ను with-draw చేసికొని పాస్ చేయాలని మిమ్ములనందరిని కోరుచున్నాను.

### *Demand No. I – Land Revenue* *Rs. 1,62,11,000*

*Mr. Speaker*: The question is :

To reduce the allotment of Rs. 1,62,11,000 for Land Revenue by Rs. 100

(గ్రామోద్యోగుల కష్టనష్టాలు గమనించి వారికి కనీసం యల్. డి. సి. లతో సమానమైన జీతాలు అయినా యిచ్చే యేర్పాటు చేయనందుకు.)

The motion was negatived.

*Sri Vavilala Gopalakrishnayya* : I demand a division, Sir.

The House then then divided

Ayes : 31 Noes : 93

The motion was adopted.

*Mr. Speaker*: The question is :

To reduce the allotment of Rs. 1,62,11,000 for Land Revenue by Rs. 100

(భూసంస్కరణలు అమలు జరుపనందుకు నిరసనగా ప్రభుత్వ విధానమును విమర్శించుటకు.)

To reduce the allotment of Rs. 1,62,11,000 for Land Revenue by Rs. 100

(తాలూకా పరిపాలనలో మార్పు లేనందుకు.)

To reduce the allotment of Rs. 1,62,11,000 for
Land Revenue by Rs. 100

(జిల్లా తాలూకా గ్రామ పరిపాలనా విధానంలో మార్పుతెచ్చి ప్రజాస్వామిక పద్ధతి అమలు జరుపనందుకు.)

To reduce the allotment of Rs. 1,62,11,000 for
